ఈనాడు
సిద్దిపేట
సోమవారం 14 ఆగస్టు 2017 16 పేజీలు

రూ. కోట్లు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేసిన జిల్లా రైతులు భారమంతా వరుణుడిపైనే వేసి వేచి చూస్తున్నారు. ఖరీఫ్ సీజన్ సగం దాటినా ఇప్పటికీ చెరువులు, కుంటల్లో నీరు చేరకపోవడంతో బీళ్లను తలపిస్తున్నాయి. భూగర్భజలం అడుగంటి పోతుండటంతో బోర్లు కూడా తట్టితట్టి పోస్తున్నాయి. జిల్లాలో ఎక్కడ నలుగురు రైతులు కూడినా ముచ్చటంతా వానపైనే సాగుతోంది.



గుంతల్లో మాత్రమే నీరు చేరటంతో ఖాళీగా కనిపిస్తోన్న ప్రజ్ఞాపూర్ పెద్ద చెరువు



భారమంతా వరుణుడిపైనే..!

నీరుచేరక బీళ్లను తలపిస్తోన్న చెరువులు

తట్టితట్టి పోస్తున్న బోర్లు

న్యూస్‌టుడే, గజ్వేల్

సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడంతో జిల్లాలో పంటలు అధిక శాతం వర్షాధారం, కొంతమేర బోరు బావులపై ఆధారపడి సాగు చేస్తున్నారు. రెండున్నర లక్షలకుపైగా ఉన్న రైతులు ఏటా(రెండు సీజన్‌లు కలిపి) ఎనిమిది లక్షల ఎకరాలకుపైగా వివిధ పంటలు సాగు చేస్తున్నారు. అన్ని పంటలకు సగటున ఒక్కో ఎకరం సాగుకు రూ.15 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో మొత్తం 5.79 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇప్పటివరకు వరి 57 వేల ఎకరాలు, మొక్కజొన్న 1,56,490 ఎకరాలు, పత్తి 1,83,616 ఎకరాలు, కంది 9,598 ఎకరాలు, మిగతా విస్తీర్ణంలో పప్పుదినుసులు, కూరగాయల పంటలు సాగయ్యాయి. ఈ లెక్కన రైతులు ఇప్పటివరకు రూ.550 కోట్ల మేర సాగుకు ఖర్చు చేశారు. చెరువుల పునరుజ్జీవం కోసం ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం ద్వారా జిల్లాలో వేలాది చెరువులను బాగు చేసినా వర్షాలు సమృద్ధిగా కురవకపోవటంతో నీరు చేరలేదు. జిల్లాలో చిన్న, పెద్ద చెరువులు కలిపి మొత్తం 3256 ఉన్నాయి. చెరువు పారకం ద్వారా జిల్లాలో 60 వేల ఎకరాలు సాగవుతోంది. వర్షాలు సరిగా కురవకపోవడంతో 80 శాతానికిపైగా చెరువులు నీరు లేక పచ్చిక బయళ్లను తలపిస్తున్నాయి. అధికారుల అంచనా మేరకు ఇప్పటివరకు కురిసిన వర్షాలకు 450 చెరువుల్లో సగం వరకు నీరు చేరాయి. 2830 చెరువుల్లో పావువంతు కూడా నీరు చేరలేదు. జేసీబీ గుంతలు మాత్రమే నిండాయి. జూన్‌లో సాధారణ వర్షపాతం 105.8 మి.మీ కాగా 248.3 మి.మీ. నమోదైంది. జులైలో సాధారణ 213 మి.మీ. కాగా 149.7 మి.మీ. నమోదైంది. చెరువుల్లో మాత్రం నీరు చేరలేదు. ఆగస్టు మొదటి వారంలో జిల్లాలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిశాయి. ప్రధానంగా పట్టణాల్లోనే వర్షాలు పడడంతో చెరువుల్లో నీరు చేరక నిరాశే మిగిలింది. చెరువుల్లో నీరు చేరకపోవడంతో భూగర్భజలం కూడా పెద్దగా పెరగలేదు. జిల్లాలో 1.32 లక్షల వరకు విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో సగానికిపైగా నీళ్లు సరిగా పోయటం లేదు. జిల్లాలోని 22 మండలాల్లో సగం వరకు దాదాపు 25 మీటర్ల లోతుల్లోనే నీరున్నట్లు అధికారులు చెబుతున్నారు. సాగుకు ప్రభుత్వం నిరంతర కరెంటు సరఫరా చేస్తున్నా బోర్లలో నీరు లేక రైతులు వరుణుడిపైనే భారం వేశారు.


నీటి లభ్యత పెరగకపోవటంతో బోరుబావి కింద మొక్కజొన్నసాగు

స్వల్పకాలిక వంగడాలతో సరి

బోర్లలో నీటి లభ్యత సరిగా లేకపోవడంతో వరి పంట సాగు చేస్తున్న రైతులు స్వలకాలిక రకం వంగడాలను ఎంచుకుని

మిగతా 7లో

'భగీరథుడు' మన పాలనాధికారి

రాష్ట్ర ప్రభుత్వ పురస్కారం


వెంకటరామరెడ్డి

సిద్దిపేట, న్యూస్‌టుడే: మిషన్‌భగీరథ... రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మానసపుత్రికలాంటి పథకమిది. ప్రభుత్వ పథకాల్లో అత్యంత ప్రాధాన్యమైన దీన్ని సిద్దిపేట జిల్లాలో చక్కటి కృషితో ముందుకు తీసుకెళ్తోన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పాలనాధికారి వెంకటరామరెడ్డికి ఎక్సలెన్స్ పురస్కారాన్ని ప్రకటించింది. స్వాతంత్ర్య సంబురాల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 12 మంది పాలనాధికారులకు వివిధ విభాగాల్లో పురస్కారాలు తాజాగా ప్రకటించారు. ఈ క్రమంలో మిషన్‌భగీరథ కింద వెంకటరామరెడ్డిని ఎంపిక చేశారు. 15న సీఎం కేసీఆర్ చేతులమీదుగా పురస్కారం అందుకోనున్నారు. దీంతో జిల్లా అధికార, ఉద్యోగవర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. సిద్దిపేట మంచినీటి పథకం స్ఫూర్తితో రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలోని ప్రతి ఇంటికి శుద్ధినీరు అందించే లక్ష్యంతో మిషన్ భగీరథకు ప్రాణం పోశారు. దీన్ని జిల్లాలో 2016 ఫిబ్రవరిలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో భాగంగానే పనులు మొదలయ్యాయి. అప్పట్లో ఉమ్మడి జిల్లా జేసీగా బాధ్యతలు నిర్వర్తించిన వెంకటరామరెడ్డి భగీరథ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. సిద్దిపేట జిల్లా పురుడుపోసుకొని ఇక్కడ పాలనాధికారిగా బాధ్యత చేపట్టాక మరింత శ్రద్ధ పెట్టారు.

495 ఆవాసాలకు నీరు

జిల్లాలో దాదాపు రూ.1400 కోట్ల అంచనా వ్యయంతో భగీరథ ప్రాజెక్టు చేపట్టారు. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాలతో పాటు జనగాం, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో ఈ జిల్లా పరిధిలోని మండలాల్లో ఉన్న మొత్తం 773 ఆవాసాలకు నీరు అందించాల్సి ఉంది. ప్రస్తుతం 495 ఆవాసాలకు నీరు అందిస్తున్నారు. దాదాపు 1.50 లక్షల నల్లా కనెక్షన్లు ఇచ్చారు. గోదావరి సుజల స్రవంతి పథకాన్ని మిషన్

మిగతా 7లో

ఒకే రోజు 27 కాన్పులు

మాతాశిశు సంరక్షణ ఆసుపత్రి మరో ఘనత

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సకల సదుపాయాలతో కూడిన వైద్యం.. కేసీఆర్ కిట్.. అమ్మఒడి పథకాల ప్రభావం సత్ఫలితాలను ఇస్తోంది. సర్కారు దవాఖానాలో ప్రసవాల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. సిద్దిపేటలోని మాతాశిశు సంరక్షణ ఆసుపత్రి(ఎంసీహెచ్)లో 24 గంటల్లో 27 ప్రసవాలు చేశారు. శుక్రవారం అర్ధరాత్రి 12 నుంచి శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకు 18 శస్త్రచికిత్సలు, 9 సాధారణ ప్రసవాలు జరిగాయి. జన్మించిన వారిలో 15 మంది మగ, 12 మంది ఆడ శిశువులు ఉన్నారు. వైద్యులు లక్ష్మీ, శివలత నేతృత్వంలో ప్రసవాలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలోని సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ నర్సింహం వెల్లడించారు.


ఆసుపత్రిలో చిన్నారులు

రాయితీ రుణం కోసం జిల్లాలోని బీసీ నిరుద్యోగ యువత కళ్లలో ఒత్తులు వేసుకొని ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం మాత్రం కనికరించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరంతోపాటు ఈసారి బీసీ సంక్షేమశాఖ జిల్లాల వారీగా నిరుద్యోగులకు రాయితీపై అందించాల్సిన వార్షిక రుణ ప్రణాళిక ప్రకటించకపోవడం గమనార్హం. మూడేళ్ల కిందటి రాయితీ బకాయి రూ.3.54 కోట్లు పేరుకుపోవడంతో రుణానికి అర్హత సాధించిన నిరుద్యోగులూ వాటిని పొందలేక కార్యాలయాల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. జిల్లాలవారీగా బీసీ వార్షిక రాయితీ రుణ ప్రణాళిక విడుదల చేయాల్సిన ఆవశ్యకతపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

బీసీ రాయితీ రుణాలు హుళక్కేనా..!



రెండేళ్లుగా ఖరారుకాని ప్రణాళిక


మూడేళ్ల కిందటి బకాయి రూ.3.54 కోట్లు

ఆందోళనలో నిరుద్యోగ యువత

న్యూస్‌టుడే, సిద్దిపేట

జిల్లా జనాభా దాదాపు పది లక్షలు. ఇందులో యువత 40 శాతం అంటే దాదాపు నాలుగు లక్షల మంది ఉంటారు. వీరిలో దాదాపు 50 శాతం బీసీ సామాజిక వర్గానికి చెందినవారే. వీరిలో నిరుద్యోగులు భారీ సంఖ్యలో ఉన్నారు. ఈ నేపథ్యంలో రాయితీపై రుణాలు అందించి స్వయం ఉపాధికి బాటలు వేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. మూడేళ్లుగా ఈ పథకం తడబడుతోంది. నిధులు కేటాయించినా విడుదల చేయకపోవడం, ఒక్కోసారి ప్రణాళిక విడుదల చేయకపోవడం లాంటి కారణాలు నిరుద్యోగులకు శరఘాతంలా మారాయి. 2015-16 ఆర్థిక సంవత్సరం జిల్లాకు 584 యూనిట్లు మంజూరు చేశారు. రూ.6.84 కోట్లు రుణంగా ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇందులో రాయితీ రూ.5.13 కోట్లు కాగా మిగిలింది బ్యాంకు రుణం. ఈ పథకం కింద 584 మంది అభ్యర్థులను స్వయం ఉపాధి యూనిట్లకు ఎంపిక చేశారు. కానీ రాయితీ ఆలస్యంగా విడుదలైంది. దాదాపు ఐదు నెలల కిందట రూ.1.59 కోట్లు విడుదలైంది. దీంతో 267 మందికి రుణాలు అందించారు. మిగతా రూ.3.54 కోట్ల రాయితీ

మిగతా 7లో



మూగబోయిన 'మీనా ప్రపంచం'

ఈ ఏడాది ప్రారంభం కాని ప్రసారాలు ● విజ్ఞానానికి దూరమవుతున్న విద్యార్థులు

న్యూస్‌టుడే, గజ్వేల్‌గ్రామీణ


పాఠశాలలో రేడియో పాఠాలు వింటున్న విద్యార్థులు(పాతచిత్రం)

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు మానసికోల్లాసం కలిగించేందుకు, విషయాన్ని సులభంగా అర్థం చేయించే లక్ష్యంతో ప్రభుత్వ బడుల్లో 'మీనా ప్రపంచం' పేరుతో రేడియో పాఠశాల నెలకొల్పింది. ఏటా జులై మాసం వచ్చిందంటే ప్రతి పాఠశాలలో మీనా ప్రపంచం రేడియో పలుకులు వినిపించేవి. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు పూర్తయినా ఆ పాఠాలు వినబడటం లేదు. ప్రభుత్వం ఇప్పటివరకు ఈ విషయంలో ఎలాంటి ప్రణాళిక కూడా రూపొందించకపోవడంతో అసలు ఈ ఏడాది 'మీనా ప్రపంచం' పాఠాలు నిర్వహిస్తారా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరక, బోధనలో మార్పు రాక విద్యార్థులు నష్టపోతున్నారు.

సిద్దిపేట జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 964 ఉండగా అందులో 88,858 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 3 నుంచి 5వ తరగతి వరకు సుమారు 34,482 మంది ఉన్నారు. వీరికి 'విందాం.. నేర్చుకుందాం' అనే రేడియో పాఠాలు వారంలో ఐదు రోజుల పాటు అంటే సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 11.15 నుంచి 11.45 వరకు వినిపించాలి. ఉన్నత పాఠశాల్లో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల్లో 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు 54,376 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి రేడియో పాఠాలు వారానికి ఐదు రోజుల పాటు ఉదయం 11.45 నుంచి 12.15 వరకు వినిపించాలి. 11 నుంచి 14 ఏళ్ల వయసున్న విద్యార్థులకు సమాజంలో నైతిక విలువలు, జీవన నైపుణ్యాలు, లింగవివక్ష, చైతన్యవంతుల్ని చేయడం, వ్యక్తిగత శుభ్రతతో పాటు వివిధ అంశాలపై ఈ పాఠాలు ఉంటాయి. వారంలో ఒక్క రోజు ఉపాధ్యాయులకు రేడియో ద్వారా బోధనా విధానంపై ఉన్నత విద్యాధికారులతో అవగాహన కల్పిస్తారు.

అందని ఆదేశాలు

పాఠశాలల ప్రారంభంలోనే రేడియో పాఠాలకు సంబంధించి నిత్యం ఏం బోధించాలో రాష్ట్ర విద్యా శాఖ నుంచి ప్రణాళిక విడుదల చేస్తారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు మాసాలు పూర్తయినా నేటికీ అదేమీ పంపించలేదు. దీంతో ఈ కార్యక్రమం అమలవుతుందో లేదోనన్న అనుమానాలు నెలకొన్నాయి. చాలావరకు పాఠశాలల్లో రేడియోలు పని చేయడం లేదు. మరికొన్ని చోట్ల భద్రంగా దాచి ఉంచారు.

విద్యార్థులకు ఉపయోగం ఇలా..

విద్యార్థులు రేడియో పాఠాలు వినడం వల్ల పదాల్లో ఉచ్చారణ, దోషాలు తెలుసుకోవడం, ఉదాహరణలతో కూడిన పాఠాలు చెప్పడంతో త్వరగా అర్థం చేసుకుంటారు. ఉపాధ్యాయులు ఒకే రీతిలో బోధన చేస్తుంటారు. రేడియో పాఠాలు మాత్రం గేయాలు, నాటికలు, కథలు, కథానికలు, భాషలో వ్యవహారిక రూపాల్లో ఉండటంతో విద్యార్థులు అనేక విషయాలు నేర్చుకుంటారు. పాఠాలు వినసొంపుగా ఉండటమే కాకుండా ఏకాగ్రత పెంపొందించేలా అభ్యసన ఉంటుంది.

వేచి చూస్తున్నాం



– కృష్ణారెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి, సిద్దిపేట

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో జులై మాసం నుంచే 'మీనా ప్రపంచం' ప్రారంభమవ్వాలి. ఈ ఏడాది ప్రభుత్వం ఇంకా ప్రారంభించలేదు. దీనికి సంబంధించి ఎలాంటి ఆదేశాలు ఇంకా మాకు రాలేదు. మేము కూడా వేచి చూస్తున్నాం.

సామరస్యానికి ప్రతీక భారత్

సిద్దిపేటలో ఐకమత్య శాంతి ర్యాలీ



సిద్దిపేటలో శాంతి ర్యాలీ ప్రదర్శన

సిద్దిపేట టౌన్‌: సామరస్యానికి ప్రతీక భారత్ అని, అంతా ఒక్కటిగా ఐకమత్యంగా ముందుకు సాగుదామంటూ పట్టణంలో వివిధ వర్గాల ప్రజలు ర్యాలీ నిర్వహించారు. జమియత్ ఉలుమా హింద్ ఆధ్వర్యంలో సిద్దిపేటలో ఎక్బాల్ మినార్ నుంచి పాత బస్టాండ్ వరకు ఆదివారం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా శాంతి, సామరస్యాన్ని చాటే నినాదాలతో కూడిన ప్లకార్డులను చేతబూనారు. జమియత్ బాధ్యుడు ముఫ్తి అబ్దుల్ సలాం మాట్లాడుతూ.. శాంతిభద్రతల రక్షణకు అంతా కృషి చేయాలన్నారు. కొంతమంది నేతలు స్వార్థ ప్రయోజనాలతో విద్వేషాలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం కలిగిందని, అన్ని వర్గాలను ఆదరిస్తుందన్నారు. ద్వేషాలను విడనాడాలని కోరారు. హిందూ, ముస్లిం, క్రైస్తవులు, సిక్కు, మత గ్రంథాల సారాంశం ఒక్కటేనని, శాంతిని ప్రబోధిస్తున్నాయని పేర్కొన్నారు. వివిధ సంఘాలు, పార్టీల బాధ్యులు లతీఫ్, శ్రీనివాస్, గౌస్ మొహియొద్దీన్, శ్రీనివాస్, హాఫెజ్ సమీ, మజీద్, కౌన్సిలర్లు జావేద్, మోయిజ్, తదితరులు ఉన్నారు.

18, 19, 20 తేదీల్లో ఈఈఎఫ్ఐ జాతీయ మహా సభలు

సిద్దిపేట అర్బన్‌: విద్యుత్తు సంస్థలో ఖాళీలను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయకుండా నేరుగా భర్తీ చేయాలని తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (ఈఈఎఫ్ఐ) జిల్లా గౌరవ అధ్యక్షుడు గోపాలస్వామి అన్నారు. ఈనెల 18 నుంచి 20 వరకు నిర్వహించనున్న సంఘం జాతీయ మహాసభల గోడ పత్రికలను ఆదివారం సిద్దిపేటలో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ..విద్యుత్తు రంగాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించకుండా నిర్వహణ బాధ్యతలను మొత్తం ప్రభుత్వమే నిర్వహించాలని పేర్కొన్నారు. డిస్కంలను రద్దుచేసి ఎలక్ట్రిసిటీ బోర్డుగా మార్చాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. జాతీయ మహాసభలకు సంఘం కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మధు, గిరిబాబు, శ్రీను, ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

యువకుడి అదృశ్యం

కొడిపల్లి: ఓ యువకుడు అదృశ్యమైన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొడిపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొడిపల్లి మండలం ముట్రాజిపల్లి గ్రామానికి చెందిన అంకం బాలరాజు (19) రెండు రోజుల క్రితం ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. ఈ మేరకు కుటుంబసభ్యులు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోవంతో తండ్రి సాయిలు ఆదివారం స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అదృశ్యం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ వివరించారు.

రుణబాధలు భరించలేక..

సిద్దిపేట టౌన్‌: రుణబాధలు భరించలేక ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు సిద్దిపేట వన్ టౌన్ ఎస్సై గోపాల్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన లగిశెట్టి ఆంజనేయులు ఈ నెల 12వ తేదీన అర్ధరాత్రి ఇంటి నుంచి బయలేదేరి వెళ్లి తిరిగి రాలేదు. అప్పుల బాధతో ఇంటి నుంచి వెళ్లిపోతున్నట్లు ఓ చీటీ రాసి వెళ్లిపోయారు. అనంతరం గుర్తించిన కుటుంబ సభ్యులు ఆయనకోసం వెదికినా ఫలితం లేకపోయింది. అతని కుమారుడు లలిత్ నారాయణ్ ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

కుక్కల దాడిలో 8 మందికి గాయాలు

పాపన్నపేట: మండల కేంద్రమైన పాపన్నపేటలో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేశాయి. ఆదివారం సాయంత్రం ఒకే సారి 8 మందిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. స్థానిక ఠాణాలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న అనంతయ్య కుమారుడు సోను(2)ను తీవ్రంగా గాయపర్చడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాదు తరలించారు.

అక్రమంగా కల్లు విక్రయిస్తే చర్యలు


కల్లు పారబోస్తున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు

హస్తాల్‌పూర్, వెల్దుర్తి: వెల్దుర్తి మండలం హస్తాల్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని శంశిరెడ్డిపల్లి తండాలో అక్రమంగా నిర్వహిస్తున్న కల్లు దుకాణంపై ఆదివారం సాయంత్రం ఎక్సైజ్‌శాఖ అధికారులు, సిబ్బంది దాడి చేశారు. ఎక్సైజ్‌శాఖ రామాయంపేట సీఐ రాధాకిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాలో ఎలాంటి అనుమతులు లేకుండా కల్లు దుకాణం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశారు. ఈ సందర్భంగా కల్లును పరీక్షించగా అందులో ప్రభుత్వం నిషేధించిన క్లోరల్‌హైడ్రేడ్ (సీహెచ్) కలిపినట్లు తేలింది. ఈ మేరకు దుకాణం నిర్వహిస్తున్న హస్తాల్‌పూర్ గ్రామానికి చెందిన నాగరాజుగౌడ్‌పై కేసు నమోదు చేశారు. అనంతరం సీఐ రాధాకిషన్ మాట్లాడుతూ.. ఎవరైనా అనుమతులు లేకుండా దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్సైజ్ శాఖ ఎస్ఐ యాదగిరి, సిబ్బంది రాములు, విక్రం, శ్రీనివాస్‌రెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

15న అవగాహన శిబిరం

సిద్దిపేట అర్బన్‌: జిల్లాలోని మత్స్యకారులకు ఈనెల 15న సిద్దిపేట కోమటి చెరువు వద్ద చేపల పెంపకంలో పాటించాల్సిన మెలకువలపై అవగాహన శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి వెంకయ్య తెలిపారు. శిబిరానికి మంత్రి హరీశ్‌రావు హాజరవుతున్నారని, జిల్లాలోని మత్స్య సహకార సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, మత్స్యకారులు పాల్గొనాలని కోరారు.

సంతకాల సేకరణ


సంతకాలు సేకరిస్తున్న నాయకులు

మెదక్ కలెక్టరేట్‌: జిల్లా కేంద్రంలో కార్మికుల ప్రయోజనాల నిమిత్తం ఈఎస్ఐ, పీఎఫ్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయాలను నిర్మించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం మెదక్‌లో సంతకాల సేకరణ ప్రారంభించారు. స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లేశం, జిల్లా అధ్యక్షురాలు బాలమణి, కార్యదర్శి రాజు సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈఎస్ఐ కార్యాలయం పటాన్‌చెరులో, డీసీఎల్ కార్యాలయం సంగారెడ్డిలో ఉండటం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. జిల్లా కేంద్రంగా ఏర్పడిన దృష్ట్యా మెదక్‌లో ఆయా కార్యాలయాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మూడేళ్లవుతున్నా అమలుకు నోచని హామీలు: టీపీసీసీ

సిద్దిపేట టౌన్‌: తెరాస ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోకపోవడం లేదని టీపీసీసీ మైనారిటీ విభాగం ఉపాధ్యక్షుడు వహీద్‌ఖాన్ అన్నారు. సిద్దిపేటలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెరాస ప్రభుత్వ పాలన పగ్గాలు చేపట్టి మూడేళ్లు కావస్తున్నా ప్రజలు సంతోషంగా లేరని వాపోయారు. ఇంటికో ఉద్యోగం, ఏకకాలంలో రైతులకు రుణమాఫీ, బోధనా రుసుము, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు నెరవేరని హామీలుగా మిగిలాయన్నారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల పేర్లు, రంగులు మార్చి నిర్మిస్తూ గొప్పలు చెప్పుకోవడం తగదన్నారు. మైనారిటీ కార్పొరేషన్ రుణాలు విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన స్థలాలను స్వాధీనం చేసుకోవాలన్నారు. జిల్లా కార్యాలయాల వద్ద ఉర్దూలో సైన్‌బోర్డులను ఏర్పాటు చేయాలని, తదితర డిమాండ్లు నెరవేర్చాలన్నారు. మైనారిటీ సెల్ జిల్లా నాయకులు హుస్సేన్, కలీముద్దీన్, మొయినొద్దీన్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న టీపీసీసీ మైనారిటీ విభాగం ఉపాధ్యక్షుడు వహీద్‌ఖాన్

ఇష్టారీతిన సెల్లార్ల కూల్చివేత తగదు


నిరసన తెలుపుతున్న దుకాణాల యజమానులు, నిర్వాహకులు

సిద్దిపేట టౌన్‌: స్థానిక పురపాలిక పరిధిలో సెల్లార్ల కూల్చివేత విషయంలో అధికారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని సిద్దిపేటలో వివిధ దుకాణాల వ్యాపారులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దుకాణాల యజమానులు మాట్లాడుతూ.. 15 సంవత్సరాల కిందట నిర్మించిన సెల్లార్లను వాహనాల పార్కింగ్ పేరిట రెండు రోజులుగా మున్సిపల్ అధికారులు కూల్చివేస్తున్నారని, ఇందులో పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. నాయకుల అండదండలు ఉన్న దుకాణాలను కూల్చివేయకుండా మిగిలినవి అక్రమ సెల్లార్లుగా ప్రకటిస్తూ కూల్చివేస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ అధికారులు సమన్యాయంతో అందరికీ ఒకేరకమైన నిబంధన వర్తింపజేయాలని, లేదంటే మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్షలు చేపడతామని పేర్కొన్నారు. పాలనాధికారి చొరవ చూపాలని కోరారు. నాయకులు గంగారాం, హోటళ్లు, దుకాణాలు, సూపర్ మార్కెట్లు, బుక్ డిపోలు, ఆసుపత్రులు, వివిధ దుకాణాల సముదాయాల యజమానులు పాల్గొన్నారు.



మూడేళ్లకే శిథిలావస్థకు చేరిన ఆకునూరు, రుద్రాయపల్లి మధ్య రోడ్డుపై నిర్మించిన వంతెన

ఐదేళ్ల నిర్వహణ... ఒట్టిమాటే.!

సడక్ యోజన అమలు అధ్వానం

నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

న్యూస్‌టుడే, చేర్యాల

పల్లెల వికాసమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన' (పీఎంజీఎస్‌వై) కొన్నేళ్లుగా అమలు చేస్తోంది. దశాబ్దాలుగా రోడ్డు సౌకర్యం లేని గ్రామాలకు లింకురోడ్లు, కల్వర్టులు, వంతెనలు నిర్మించి పల్లె ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పించడం దీని ఉద్దేశం. కేవలం రోడ్డు నిర్మించి చేతులు దులుపుకోకుండా ఐదేళ్ల వరకు నిర్వహణ బాధ్యత కూడా గుత్తేదారుదే. పనులకు సంబంధించిన ఒప్పందంలోనే ఈ విధమైన షరతు ఉంటుంది. ఐదేళ్లలో ఆ రోడ్డుపై గుంత పడినా, సైడ్‌బర్మ్స్ దెబ్బతిన్నా, కల్వర్టులు, వంతెలకు పగుళ్లు వచ్చినా, కూలినా మరమ్మతులు చేయాలి. తారురోడ్డు పక్కన పిచ్చిమొక్కలు, పొదలు పెరిగితే వాటిని తొలగించాల్సిన బాధ్యత కూడా గుత్తేదారుడిదే. నిర్వహణ పనులకు బిల్లు కూడా చెల్లిస్తారు. చిన్నపాటి పనులకు ప్రత్యేకంగా కూలీలను నియమించడం, ఆ పనుల కోసం సమయం వృథా చేయడం ఎందుకని గుత్తేదారులెవరూ పట్టించుకోవడం లేదు. అధికారుల సైతం తమకేం పట్టనట్లు మిన్నకుండడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. సంవత్సరాలు గడుస్తున్నా ఒక్కసారి కూడా మరమ్మతుల మాటెత్తడం లేదు. చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి మండలాల్లో ఈ పథకం కింద నిర్వహించిన పనులను 'న్యూస్‌టుడే' పరిశీలించగా ఈ విషయం తేటతెల్లమైంది. ఎంతో ఉన్నతాశయంతో కేంద్రం చేపట్టిన ఈ పథకం స్థానిక అధికారుల పట్టింపులేనితనంతో అభాసుపాలవుతోంది.

● చేర్యాల మండలం ఆకునూరు నుంచి రుద్రాయపల్లి వరకు ఐదో దశలో తారు రోడ్డు నిర్మించారు. 3.05 కి.మీ. దూరం రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.26 కోట్లు కేటాయించింది. ఈ పనులను గుత్తేదారు 2014లో పూర్తి చేశారు. ఈ రోడ్డుపై మధ్యలో ఓ వంతెన నిర్మించారు. తారు రోడ్డు, వంతెన కలిసే చోట సరిగా పనులు చేయకపోవడంతో చిరుజల్లులకే వర్షపు నీటికి మట్టి కొట్టుకుపోతుంది. వంతెన రెండు చివర్లలో ప్రమాదకరంగా మారింది. రాత్రివేళల్లో పలువురు ప్రయాణికులు ఈ వంతెన వద్ద ప్రమాదాలకు గురయ్యారు. తాత్కాలికంగా మట్టి పోసి చేతులు దులుపుకోకుండా వంతెనకు రెండువైపులా రాతి కట్టడంతో నిర్మిస్తే శాశ్వతంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు.

● కొమురవెల్లి మండల కేంద్రం నుంచి రాంసాగర్ మీదుగా చేర్యాల మండలం కడవేర్గు వరకు రెండో ఫేజ్ కింద తారు రోడ్డు నిర్మించారు. 6.2 కి.మీ. ఈ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.19 కోట్లు కేటాయించింది. గత ఏడాదే(నవంబరు 2016) పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఈ రోడ్డుపై పలు చోట్ల గుంతలు పడ్డాయి. సైడ్‌బర్మ్స్ దెబ్బతిన్నాయి. పలుచోట్ల తారు లేచిపోతోంది.

కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి

– రాజశేఖర్‌రెడ్డి, ఈఈ, పంచాయతీరాజ్ శాఖ

సాధారణంగా ఈ పనులను చాలాచోట్ల అసలు గుత్తేదారు చేయడం లేదు. ఉపగుత్తేదారులే పనులు చేస్తున్నారు. దీనివల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. ఉపగుత్తేదారులు పనులు పూర్తి చేసిన తర్వాత నిర్వహణ చేయమంటున్నారు. అందువల్లే మరమ్మతులు చేపట్టలేకపోతున్నాం. రెండేళ్ల పాటు నిధుల కొరత కూడా ఉంది. అందువల్ల నిర్వహణ చేయలేని పరిస్థితి.

ఈ రోడ్డును పీఎంజీఎస్‌వై 5వ దశలో నిర్మించారు. చేర్యాల విద్యుత్తు ఉప కేంద్రం వద్ద పీఆర్ రోడ్డు నుంచి తూర్పు గుంటూరుపల్లి వరకు 2.35 కి.మీ. దూరం తారురోడ్డును రూ.1.17 కోట్లతో ఆగస్టు 2014లో నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్కసారి కూడా కనీస మరమ్మతులు చేయలేదు. అనేక చోట్ల గుంతలు పడ్డాయి. సైడ్‌బర్మ్స్ దెబ్బతిన్నాయి. ఇంకా రెండేళ్లపాటు ఈ రోడ్డును సంబంధిత గుత్తేదారుడే నిర్వహించాలి. మూడేళ్లలో కనీసం ఒక్కసారి కూడా మరమ్మతులు చేపట్టకపోవడం గమనార్హం.



నిర్వహణ ఐదేళ్లని పేర్కొంటూ బోర్డు



మద్దూరు - మర్మాముల రోడ్డుపై గుంతలు

మద్దూరు మండల కేంద్రం నుంచి ధర్మారం మీదుగా మర్మాముల గ్రామం వరకు పీఎంజీఎస్‌వై రెండో దశ కింద తారురోడ్డు నిర్మించారు. మొత్తం 4.7 కి.మీ. దూరం ఉన్న ఈ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.42 కోట్లు మంజూరు చేసింది. పనులు 2015 డిసెంబరులో పూర్తయ్యాయి. అంటే ఈ రోడ్డును 2020 వరకు గుత్తేదారుడే నిర్వహించాలి. మర్మాముల, ధర్మారం గ్రామాల మధ్య అనేక చోట్ల రోడ్డు గుంతలు పడింది. కల్వర్టుల వద్ద మట్టి వర్షపు నీటికి కొట్టుకుపోయి గండ్లు పడ్డాయి. రోడ్డుకు ఇరువైపులా ముళ్ల చెట్లు పెరిగాయి. ఇప్పటివరకు ఒక్కసారి కూడా మరమ్మతులు చేయలేదు.



రోడ్డు వివరాలు తెలిపే బోర్డు



ధ్వంసమైన చేర్యాల విద్యుత్తు సబ్‌స్టేషన్ నుంచి తూర్పు గుంటూరుపల్లి వరకు నిర్మించిన రోడ్డు

పురపాలికకు ఐఎస్‌ఓ 9001 ధ్రువపత్రం

15న మంత్రి చేతుల మీదుగా అందజేత ■ ఛైర్మన్, కమిషనర్ వెల్లడి

సిద్దిపేట, న్యూస్‌టుడే: సిద్దిపేట పురపాలికకు ఐఎస్‌ఓ 9001:2015 ధ్రువపత్రం ఖరారైందని, ఈ మేరకు సంస్థ ప్రతినిధుల ద్వారా సమాచారం అందిందని కమిషనర్ రమణాచారి, ఛైర్మన్ కడవేర్గు రాజనర్సు తెలిపారు. సిద్దిపేట పురపాలికలో ఐఎస్‌ఓ సంస్థ ప్రతినిధి శివయ్య ఆధ్వర్యంలో ఆడిటర్ల బృందం అన్ని విభాగాల్లో ఆదివారం ఆడిట్ ప్రక్రియ చేపట్టింది. ఈ సందర్భంగా బల్దియా ఆధ్వర్యంలో ఐఎస్‌ఓ ప్రమాణాలతో రూపొందించిన 8 విభాగాల మాన్యువల్స్‌ను కమిషనర్, ఛైర్మన్ సదరు సంస్థ ప్రతినిధి శివయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా రమణాచారి, రాజనర్సు మాట్లాడుతూ... ఈ నెల 15న రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు చేతుల మీదుగా ఐఎస్‌ఓ 9001 ధ్రువపత్రం బల్దియా అందుకోనుందన్నారు. రాష్ట్రంలో ఈ ధ్రువపత్రం అందుకోనున్న తొలి బల్దియా సిద్దిపేట అన్నారు. సదరు సంస్థ కమిటీ వివిధ సంస్థలు, కార్యాలయాలు తదితర వాటికి ఐఎస్‌ఓ ధ్రువపత్రం రావాలంటే ఏమేం ప్రమాణాలు పాటించాలో నిబంధనలు వెలువరిస్తుందన్నారు. వాటి ఆధారంగానే సిద్దిపేట పురపాలికలో గణాంక, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, పారిశుద్ధ్యం, ఇంజినీరింగ్, పాలన, మెప్మా, కమిషనర్ విభాగాల్లో ఎనిమిది మాన్యువల్స్ మూడు నెలల పాటు ఉద్యోగులు శ్రమించి రూపొందించారన్నారు. ఇందులో బల్దియాలో చేపట్టిన అభివృద్ధి, చేపట్టబోయే కార్యక్రమాలు, సంస్కరణలను పొందుపర్చామన్నారు. పారదర్శకంగా సేవలు ఎలా అందించవచ్చో వివరించామన్నారు. దీంతో పాటు ప్రతీ పనికి ఫ్లో ఛార్టు రూపొందించామని, ఏదైనా పని/సేవకు బల్దియాకు వచ్చే ప్రజలు ఈ ఛార్ట్ చూసి దాన్ని ఎలా పొందవచ్చో అర్థం చేసుకోవచ్చన్నారు. ఉద్యోగులు మరింత పారదర్శకంగా, నిర్ణీత వ్యవధిలో పనిచేయడానికి ఇది బెంచిమార్కుగా పనిచేస్తుందన్నారు. ప్రతి పురపాలికకు సిద్దిపేటలో తయారు చేసిన మాన్యువల్ గ్రంథంగా ఉపయోగపడతాయన్నారు. ఐఎస్‌ఓ ధ్రువపత్రం రావడం వల్ల ఉద్యోగుల్లో మరింత బాధ్యత పెరుగుతుందని, ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. ఐఎస్‌ఓ సంస్థ ప్రతినిధి శివయ్య మాట్లాడుతూ.. సిద్దిపేటలో ఆడిటింగ్ ప్రక్రియ పూర్తయిందని, ప్రమాణాలకు అనుగుణంగా ఇక్కడ వ్యవస్థలు పనిచేస్తున్నాయన్నారు. మాన్యువల్స్ అద్భుతంగా తీర్చిదిద్దారని, ఓ కార్పొరేట్ సంస్థ కూడా ఈ స్థాయిలో దాన్ని రూపొందించలేదన్నారు. ఆడిటింగ్ నివేదిక సంస్థకు పంపుతున్నామన్నారు. సర్టిఫికెట్ ఖరారైందనీ, 15న అందజేస్తామన్నారు. ఏడాది పాటు వర్తిస్తుందని, తర్వాత మళ్లీ మదింపు ప్రక్రియ చేపట్టి దాని ఆధారంగా ధ్రువపత్రం కొనసాగిస్తామన్నారు.



మాన్యువల్‌ను ప్రదర్శిస్తున్న ఛైర్మన్, కమిషనర్, ఐఎస్‌ఓ సంస్థ ప్రతినిధి

ప్రభుత్వానికి ప్రజా వ్యతిరేక విధానాలు తగదు

తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు వంటేరు ప్రతాప్‌రెడ్డి



తెదేపా జెండాను ఆవిష్కరిస్తున్న తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు వంటేరు ప్రతాప్‌రెడ్డి

న్యూస్‌టుడే, సిద్దిపేట రూరల్: ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని, తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన కోదండరాంను బయట తిరగనీయడం లేదని తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. సిద్దిపేటలో ఆదివారం జిల్లా పార్టీ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెరాస ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయడం లేదని ఆరోపించారు. హామీలు అమలు చేయాలని కోరుతున్న వారిపై అక్రమ కేసులు నమోదు చేయిస్తోందని పేర్కొన్నారు. ఐకాస ఛైర్మన్ కోదండరాం అరెస్టు, ఇతర ఐకాస నేతలపై తెరాస కార్యకర్తల దాడి శోచనీయమన్నారు. ప్రజల పక్షాల పోరాడుతున్న నేతలపై ఆంక్షలు విధించడం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయని భావించిన నిరుద్యోగులకు ప్రభుత్వం లక్ష కోట్ల అప్పు మిగిల్చిందన్నారు. సిద్దిపేటకు మానేరు నీరు తెచ్చిన ఘనత తెదేపాదే అన్నారు. ఎన్నికల ముందు తెరాస ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ త్వరలో సిద్దిపేట పట్టణంలో 5000 మంది కార్యకర్తలు, 2500 ద్విచక్ర వాహనాలతో పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. సిద్దిపేట నియోజకవర్గ నూతన కమిటీలను నియమించి వారికి పత్రాలు అందజేశారు. త్వరలో సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిని నియమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దుబ్బాక, జనగాం నియోజకవర్గ ఇన్‌ఛార్జులు రమేశ్, మధుసూదన్‌రెడ్డి, నాయకులు దరిపల్లి చంద్రం, మల్లయ్య, రమేశ్, రఘుపతిరెడ్డి, భూమయ్య, రాజశ్రీ తదితరులు ఉన్నారు.

సిద్దిపేట


నేడు కృష్ణాష్టమి వేడుకలు

సిద్దిపేట అర్బన్: శ్రీకృష్ణ జన్మదినం సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని భారత్‌నగర్‌లో చిన్నారులతో వేషధారణ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సంఘం జాతీయ సహ కార్యదర్శి సత్యంజీ హాజరవుతారని తెలిపారు. హిందూ బంధువులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు.

సంఖ్య పెంచారు సరే..
వసతులేవి?

వేధిస్తున్న అదనపు గదుల కొరత

అరకొర శౌచాలయాలతో పాట్లు ● ఇదీ సర్కారు బడుల దుస్థితి


గూడెం పాఠశాలలో తాత్కాలిక రేకుల షెడ్డులో తరగతులు

న్యూస్‌టుడే, బెజ్జంకి

ఆంగ్లమాధ్యమంలో బోధనకు అనుమతులివ్వడంతో మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గినా మరికొన్ని పాఠశాలలు మాత్రం విద్యార్థులతో కళకళలాడుతున్నాయి. ఉపాధ్యాయులు చేపట్టిన బడిబాట కార్యక్రమం సత్ఫలితాలు ఇవ్వగా పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు వచ్చారు. అయినా సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు గదులు, శౌచాలయాలు కొరవడ్డాయి. పలు పాఠశాలలు ప్రహరీలకు నోచుకోవడం లేదు. మౌలిక వసతుల ఏర్పాటుఉ పాలకులు, అధికారులకు పలుమార్లు విన్నవించిన స్పందన లేకుండా పోయిందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి


బేగంపేట పాఠశాలలో 103 మంది విద్యార్థులకు ఒక్కటే మరుగుదొడ్డి

ఇవీ ప్రధాన సమస్యలు..

✦ బేగంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మొత్తం 105 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉన్న శౌచాలయాలు మరమ్మతుకు గురి కావడంతో గత్యంతరం లేక మలవిసర్జనకు విద్యార్థులను ఇళ్లకు పంపిస్తున్న దుస్థితి నెలకొంది. ఇరుకుగా ఉన్న నాలుగు గదులు ఎటూ సరిపోక వరండాలో తరగతులు నిర్వహిస్తున్నారు. శుద్ధిజలం లేక విద్యార్థులు ఇళ్ల నుంచే సీసాల్లో తాగునీటిని తెచ్చుకుంటున్నారు. సరిపడా శౌచాలయాలతో పాటు అదనపు గదులు నిర్మించాల్సి ఉంది.

✦ గూడెం ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి వరకు 66 మంది, పూర్వ ప్రాథమిక తరగతుల్లో 17 మంది చిన్నారులను కలిపి మొత్తం 83 మంది చదువుతున్నారు. వారందరికీ కలిపి రెండు తరగతి గదులే ఉండగా ఎటూ సరిపోక వరండాలో తరగతులు నిర్వహిస్తున్నారు. గత సంవత్సరం మండల పరిషత్ నిధుల నుంచి తాత్కాలికంగా రేకుల షెడ్డు నిర్మించగా ఎటూ ఉపయోగపడటం లేదు. తీవ్రమైన ఎండ, వానల సమయంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో విద్యార్థుల్లేక మూతపడగా సర్పంచి, గ్రామస్థులు, ఉపాధ్యాయుల కృషితో పూర్వవైభవాన్ని సంతరించుకొని జిల్లాస్థాయిలో గుర్తింపు పొందిన పాఠశాల ప్రహరీ నిర్మాణానికి మాత్రం నోచుకోవడం లేదు.


✦ గుగ్గిళ్ల ప్రాథమిక పాఠశాలలో అదనపు గదుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. పాఠశాలలో మొత్తం 120 మంది విద్యార్థులు చదువుతుండగా రెండే గదులు ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యకు సరిపడా లేక వరండాలో, ఉపాధ్యాయుల గదిలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఇరుకు గదుల్లో కాలం వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఒకరు పని చేస్తుండగా ముగ్గురు విద్యా వలంటీర్లు, మరో ఇద్దరు ప్రైవేట్‌గా బోధిస్తున్నారు. మూడు అదనపు గదులు, ఇద్దరు ఉపాధ్యాయుల నియామకానికి పాలకులు చొరవ చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.


వడ్లూర్‌లో ఇళ్ల నుంచి తెచ్చుకున్న తాగునీటి సీసాలతో విద్యార్థులు

✦ బెజ్జంకి, వీరాపూర్‌లోని ప్రాథమిక పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకొని ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొనగా విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువుతున్నారు. బెజ్జంకి పాఠశాలలో 80 మంది, వీరాపూర్‌లో సుమారు 35 మంది విద్యార్థులు చదువుతుండగా భవనాల శిథిలావస్థతో ఉపాధ్యాయులు ఆరుబయట తరగతులు నిర్వహిస్తున్నారు. వడ్లూర్, బేగంపేట, బెజ్జంకి, వీరాపూర్, తదితర పాఠశాలల్లో శుద్ధిజలం లేక విద్యార్థులు ఇళ్లనుంచే సీసాల్లో తాగునీటిని తెచ్చుకుంటున్నారు.

✦ మండలవ్యాప్తంగా మొత్తం 31 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా సగానికి పైగా పాఠశాలలకు వంట గదులే లేవు. కొన్ని పాఠశాలలకు గతంలో నిర్మించిన వంటగదులు నేడు శిథిలావస్థకు చేరుకొని నిర్వాహకులను అవస్థలకు గురి చేస్తున్నాయి. ఆరుబయట వంటతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల పలు పాఠశాలల్లో ఉపాధి హామీ పథకం కింద వంటగదులకు శంకుస్థాపన చేసినా పనులు నత్తనడకన సాగుతున్నాయి. సర్కారు బడుల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని ఇస్తున్న హామీలు నీటిమూటలు కాకుండా ఇప్పటికైనా సమస్యల పరిష్కారానికి పాలకులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పురాతన ఆలయాలకు వైభవం


చిత్రపటాన్ని పరిశీలిస్తున్న కౌన్సిలర్, నాయకులు

సిద్దిపేట టౌన్: పురాతన ఆలయాలకు పూర్వ వైభవం తెచ్చేందుకు మంత్రి హరీశ్‌రావు నిరంతరం కృషి చేస్తున్నారని కౌన్సిలర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పారుపల్లి వీధిలో పురాతన శివాలయం అభివృద్ధికి మంత్రి హరీశ్‌రావు సహకారంతో రూ.30 లక్షలు మంజూరు అయ్యాయి. ఈ నేపథ్యంలో టెండర్ ప్రక్రియ పూర్తిచేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధిలో భాగంగా చేపట్టనున్న పనులు, చిత్రపటాన్ని ఆదివారం పరిశీలించారు. త్వరలోనే పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. నాయకులు శ్రీకాంత్, నర్సింలు, శ్రీనివాస్, కనకయ్య తదితరులు ఉన్నారు.

సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలు ప్రారంభం


పటానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

బెజ్జంకి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని నర్మ గార్డెన్‌లో ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో నాయకులు సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలు ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన నాయకులు పాపన్న చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించి నినాదాలు చేశారు. ఈ నెల 18న పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసి ఛైర్మన్‌గా బోనగం లక్ష్మీనారాయణను ఎన్నుకున్నారు. అన్ని గ్రామాల నుంచి గౌడ కులస్థులు అధిక సంఖ్యలో జయంతికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బోనగం రాజేశం, చెప్యాల శ్రీనివాస్, భీమయ్య, శ్రీనివాస్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు డిమాండ్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మధు

సిద్దిపేట అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మధు అన్నారు. స్వచ్ఛ నియోజకవర్గంగా పేరొందిన సిద్దిపేటలో చాలా చోట్ల ప్రభుత్వ పాఠశాలల్లో శౌచాలయాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాఠశాలల్లో శౌచాలయాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు రవి, భరత్, ఆకాశ్, వరుణ్, సాయి, తదితరులు ఉన్నారు.

లయన్స్ క్లబ్‌ల సేవలు మరింత విస్తృతం



ప్రమాణ స్వీకారం చేస్తూ..

సిద్దిపేట టౌన్: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు లయన్స్ క్లబ్‌లు ముందుంటాయని, సేవలు మరింత విస్తృతం చేస్తామని కౌన్సిల్ మాజీ ఛైర్‌పర్సన్ బాబురావు అన్నారు. లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం పట్టణంలో ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా తడకమడ్ల ఈశ్వరయ్య, కార్యదర్శిగా శేఖర్, కోశాధికారిగా భగవాన్‌దాస్, పలువురు కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ.. పేదలకు ఎలాంటి కష్టమొచ్చినా ఆదుకుంటామన్నారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రారంభమై వందేళ్లవుతున్న సందర్భంగా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నిక చేసి ప్రమాణ స్వీకారం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం చిన్నకోడూరు మండలం అనంతసాగర్‌లోని యశోద ట్రస్టు నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి అవసరమైన రెండు గదులు నిర్మించేందుకు పలువురు అంగీకరించారు. ఈ మేరకు క్లబ్ ప్రతినిధులు చంద్రయ్య రూ.50 వేలు, బాబురావు రూ.25 వేలు అందించారు. మరికొంతమంది సభ్యులు సహకరిస్తామని హామీ ఇచ్చారు. క్లబ్ ప్రతినిధులు డా. శ్రీరాములు, మహేశ్, సుహాసినిలను సత్కరించారు. క్లబ్ ప్రతినిధులు బసవేశ్వర్, నాగరాజు, సూర్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం ఆదర్శంగా నిలపాలి


పూలమొక్క, బుట్ట పంపిణీ

సిద్దిపేట టౌన్: హరితహారం మూడో విడతలో భాగంగా పట్టణంలోని ఒకటో వార్డులో కౌన్సిలర్ బర్ల మల్లికార్జున్ వార్డు ప్రజలకు ఆదివారం పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. స్వచ్ఛ సిద్దిపేటలో భాగంగా చెత్తసేకరణ బుట్టలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పచ్చదనం, స్వచ్ఛతలో సిద్దిపేటను నిరంతరం ఆదర్శంగా నిలుపాలని కోరారు. నాయకులు శ్రీనివాస్, కిష్టయ్య, పుష్ప తదితరులు ఉన్నారు.

సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకోవద్దు: తెరాస

రంగధాంపల్లి (సిద్దిపేట అర్బన్): సిద్దిపేట జిల్లా కేంద్రంలో ప్రభుత్వం వైద్య కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే కాంగ్రెస్ నాయకులు అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని తెరాస సీనియర్ నాయకుడు కనకయ్య అన్నారు. పట్టణ పరిధి రంగధాంపల్లిలో ఆదివారం ఆయన మాట్లాడారు. సిద్దిపేట ప్రజలు మెరుగైన వైద్య సేవలకు వంద కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ సమస్యను గుర్తించిన గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం సిద్దిపేటకు వైద్య కళాశాల మంజూరు చేస్తే అది మాకే కావాలని కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ దీక్ష చేయడం తగదన్నారు. సమావేశంలో తెరాస నాయకులు సుధాకర్‌రెడ్డి, గిరి, శ్రీను, చందర్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సిద్దిపేట

ఎరువుల సమాచారం

చిన్నకోడూరు: మండల పరిధిలోని రెండు సహకార సంఘాల్లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఛైర్మన్లు బాలరెడ్డి, పాపయ్య తెలిపారు. గంగాపూర్ పీఏసీఎస్ పరిధిలో యూరియా-211, గ్రోమోర్ 20:20-521, గోదావరి డీఏపీ-55, పది1010 రకం-125, బీపీటీ రకం-04, కందులు-05, పెసలు-05, జనుము-04, జీలుగ-03, మొక్కజొన్న-04 సంచులు, అల్లీపూర్ పీఏసీఎస్ పరిధిలో యూరియా-122, గ్రోమోర్ 20:20-25, గ్రోమోర్ డీఏపీ-62, పది1010 రకం-121, బీపీటీ రకం-04, కందులు-05, పెసలు-03, జీలుగ-04 సంచులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

సమస్య... చొరవ... పరిష్కారం

న్యూస్‌టుడే, చిన్నకోడూరు

సిద్దిపేట నియోజకవర్గ పరిధి చిన్నకోడూరు మండలం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. కొన్ని రంగాల్లో ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలిచి జిల్లాలోనే అగ్రస్థానంలో నిలుస్తోంది. అయినా మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లోని సమస్యలు ప్రజలను అనునిత్యం వేధిస్తూనే ఉన్నాయి. వాటి పరిష్కారానికి గ్రామ స్థాయి అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోతుంది. కొన్ని గ్రామాల్లో చేసేదేమీ లేక స్థానికులే ముందుకు వచ్చి సమస్యను పరిష్కరించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆయా గ్రామాల సమస్యలను 'న్యూస్‌టుడే' వాట్సాప్ ద్వారా వెలుగులోకి తెస్తుండటంతో అధికారులు కూడా స్పందిస్తున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులకు విన్నవిస్తున్నారు. ఆయా సమస్యలకు అధికారుల స్పందన ఇలా ఉంది.

వాట్సాప్‌లో సమస్యల నివేదనకు ప్రాంతాల వారీగా చరవాణి నంబర్లు..

సిద్దిపేట: 98850 89979
సిద్దిపేట టౌన్: 99635 85053
సిద్దిపేట రూరల్: 91774 54529
చిన్నకోడూరు: 94923 02029
నంగునూరు: 94401 26566

వాహన చోదకులకు ప్రాణ సంకటం



సమస్య: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల సమీపంలో మిషన్ భగీరథ పనుల నిర్లక్ష్యం కారణంగా వాహన చోదకులకు ప్రాణ సంకటంగా మారింది. గొట్టపు పనుల నిమిత్తం సీసీ రోడ్డు తవ్వి 10 రోజులుగా అలాగే వదిలేశారు. దీంతో ఇటు వైపుగా వెళ్లే భారీ వాహనాలతో రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. ద్విచక్రవాహనదారులు కంకర రాళ్లపై ప్రయాణించే క్రమంలో అదుపు తప్పి కిందపడి గాయాల పాలవుతున్నారు.

- బాలరత్నం, చిన్నకోడూరు

సమాధానం: సంబంధిత గుత్తేదారుకు సూచించి, వాహన చోదకులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటాం.

- సందీప్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, చిన్నకోడూరు

మరమ్మతులు చేయించండి...



సమస్య: మండల పరిధి మల్యాల స్టేజి-గంగాపూర్ వెళ్లే బీటీ రోడ్డు పక్కన ఉన్న స్థలం చతికిలపడి వాహన చోదకులకు ఇబ్బందిగా మారింది. ఇటీవల కురిసిన వానకు రోడ్డుపై నుంచి వచ్చిన వాన నీరు అక్కడే నిల్వ ఉంటోంది. ఇందులో నుంచి భారీ వాహనాలు ప్రయాణించడంతో చతికిలపడిన ప్రదేశం పెద్ద గోతిలా తయారైంది. దీంతో గంగాపూర్ వైపు వెళ్లే వాహనాలు అదుపు తప్పి బోల్తా పడే ప్రమాదం ఉంది.

- గణేష్‌గౌడ్, గంగాపూర్

సమాధానం: క్షేత్ర పర్యటన చేసిన సమస్య స్థాయిని బట్టి మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం.

-శ్రీనివాస్, ఏఈ, రోడ్లు భవనాల శాఖ, చిన్నకోడూరు

ప్రయాణం కష్టతరం...



సమస్య: మండల పరిధి చంద్లాపూర్ శివారులో బీటీ రోడ్డు ధ్వంసమై అస్తవ్యస్తంగా మారి వాహన చోదకులకు ఇబ్బందిగా మారింది. ఇటువైపు ప్రయాణించే భారీ వాహనాలతో రెండు కిలోమీటర్ల మేర రోడ్డు ధ్వంసమై వాహన చోదకుల ప్రయాణానికి ఆటంకంగా మారింది. చీకటి సమయంలో పొలాల వద్దకు వెళ్లే రైతులు ఇటువైపు ప్రయాణించాలంటే జంకుతున్నారు. **- డి.నర్సయ్య, చంద్లాపూర్**

సమాధానం: బీటీ రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాస్, ఏఈ, రోడ్లు భవనాల శాఖ, చిన్నకోడూరు

స్పందనకు వందనం



మందపల్లి: స్థానిక ప్రయాణ ప్రాంగణం నుంచి పంచాయతీ కార్యాలయానికి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే ఉన్న మినీ ట్యాంకు ద్వారా నీరు రోడ్డుపైకి నిరంతరం ప్రవహిస్తూ నిల్వ ఉంటున్నాయి. దీంతో రోడ్డు బాగా చతికిలపడి వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటాన్ని జులై 11న 'న్యూస్‌టుడే' వాట్సాప్ ద్వారా కాలనీవాసులు అధికారులకు విన్నవించారు. స్పందించిన సర్పంచి ఈశ్వరమ్మ రహదారికి మరమ్మతులు చేయించారు.

హలో ఈనాడు



సిద్దిపేట	80085 73194
సిద్దిపేట టౌన్	70939 81587
సిద్దిపేట రూరల్	91774 54529
సిద్దిపేట అర్బన్	94928 30010
నంగునూరు	80085 73198
చిన్నకోడూరు	80085 55622

నియోజకవర్గ సమస్యలను పై నంబర్లకు తెలుపవచ్చు

న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్

సమస్య: పట్టణంలోని ఇందిరానగర్‌లో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రిపూట కంటిమీద కునుకు ఉండటం లేదు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. దోమల నివారణకు ఫాగింగ్ చేయండి. **- శ్రీధర్, కాలనీవాసి**

సమాధానం: నివారణ దిశగా తప్పక చర్యలు తీసుకుంటాం. అవసరం మేరకు ఫాగింగ్ చేస్తాం.

- కృష్ణారెడ్డి, పురపాలిక పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్, సిద్దిపేట

సమస్య: సిద్దిపేటలోని ఏషియన్ వెంకటేశ్వర థియేటర్ ఎదురు వీధిలో అన్నపూర్ణేశ్వరి ఆలయానికి వెళ్లే మార్గంలో సీసీ దారి అధ్వానంగా మారింది. ఏళ్ల కిందట నిర్మించింది కావడంతో ఎక్కడికక్కడ కంకరతేలి గుంతలు ఏర్పడ్డాయి. పలుమార్లు విన్నవిస్తున్నా ఫలితం ఉండటం లేదు. **- సందీప్, స్థానికుడు**

సమాధానం: నిధుల లభ్యత మేరకు తప్పక ప్రతిపాదిస్తాం. సీసీ పునర్నిర్మాణానికి చర్యలు చేపడతాం.

- లక్ష్మణ్, పురపాలిక డీఈ, సిద్దిపేట

సమస్య: పట్టణంలోని మెదక్ దారిలో తరచూ ట్రాఫిక్ ఇక్కట్లు పడుతున్నాం. దుకాణాల ఎదుట ఎవరికి వారు వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు చేపట్టాలి.

- మహేశ్, ప్రైవేటు ఉద్యోగి, సిద్దిపేట

సమాధానం: పలుమార్లు పెట్రోలింగ్ నిర్వహిస్తూ దుకాణాల యజమానులకు హెచ్చరికలు జారీ చేస్తున్నాం. సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం.

- శివశంకర్, ట్రాఫిక్ సీఐ, సిద్దిపేట

అనుసంధానం పూర్తి చేయండి



మణికంఠ కాలనీలో పైపులైన్ ఇలా..

సిద్దిపేట టౌన్: పైపులైన్ల అనుసంధాన ప్రక్రియ పూర్తికాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ పైపులైన్ నిర్మాణంలో భాగంగా పట్టణంలోని మణికంఠ కాలనీలో పలుచోట్ల పైపులు అమర్చారు. పూర్తిస్థాయిలో అనుసంధాన ప్రక్రియ పూర్తి కాలేదు. ఫలితంగా పైపులు రహదారిపై ప్రమాదకరంగా మారాయి. వాహన చోదకులు గుర్తించకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదని కాలనీవాసులు వాపోతున్నారు. వెంటనే సంబంధిత శాఖ అధికారులు స్పందించి అనుసంధానం పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మట్టి దారితో కష్టమే..!



సిద్దిపేట టౌన్: అసలే మట్టి దారి.. ఆపై ఎగుడు దిగుడు రోడ్డు.. ఫలితంగా ప్రయాణం కష్టతరంగా మారింది. పట్టణంలోని కుశాల్‌నగర్‌లో మట్టి దారిపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. కాలనీలో పలుచోట్ల మట్టిదారుల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం కావడంతో రాత్రిపూట వాహన చోదకులు జాగ్రత్తగా ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. అభివృద్ధి పనులు జరుగుతున్న దృష్ట్యా వెంటనే సీసీ దారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

పార్టీ బలోపేతమే ధ్యేయం: బీఎస్పీ

సిద్దిపేట అర్బన్: పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలని బహుజన్ సమాజ్ పార్టీ జోన్ ఇన్‌ఛార్జి వెంకట్ అన్నారు. సిద్దిపేటలో ఆదివారం పార్టీ జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలు ప్రజలు సమస్యలు తెలుసుకుని వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించారు. పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో పార్టీ నాయకులు యాదగిరి, యాదయ్య, కనకయ్య, సుధాకర్, తదితరులు ఉన్నారు.

పల్లె వినతులు

న్యూస్‌టుడే, చిన్నకోడూరు

చిన్నకోడూరు: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో మురుగు కాల్వలను శుభ్రం చేయక పోవడంతో దుకాణ యజమానులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

మెట్టుపల్లి: మెట్టుపల్లి-సలేంద్రి చౌరస్తా వరకు ఉన్న మట్టి రోడ్డుతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిని బీటీ రోడ్డుగా మార్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రామునిపట్ల: రామునిపట్ల ఎస్సీ కాలనీలో మురుగు కాల్వలను నిర్మించక పోవడంతో మురుగు నిల్వ ఉండి దుర్వాసన ప్రబలుతోంది. కాలనీలో దోమల సంఖ్య పెరిగి ఇబ్బందులు పడుతున్నారు.

చంద్లాపూర్: చంద్లాపూర్-చిన్నకోడూరు రహదారి పక్కన వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. బావి చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. వాటి వద్ద ప్రమాదాన్ని సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలని వాహన దారులు కోరుతున్నారు.

ఇబ్రహీంనగర్: ఇబ్రహీంనగర్ బాల వికాస శుద్ధినీటి కేంద్రం ముందున్న కాలనీలోని విద్యుత్తు నియంత్రిక ఇళ్ల మధ్య ప్రమాదకరంగా ఉంది. విద్యుత్తు సరఫరా అయ్యే తీగలు ఇళ్లను ఆనుకొని ఉన్నాయి. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

'అఖండ భారతావనిని నిర్మిద్దాం'

రామాయంపేట: విభజించిన మన భూభాగాలను ఒక్కటి చేసి అఖండ భారతావనిని నిర్మిద్దామని వీహెచ్‌పీ, భజరంగదళ్ నాయకులు పిలుపునిచ్చారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో కాగడాల ప్రదర్శన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ.. అఖండ భారతావని ఒకప్పుడు ప్రపంచానికి జగద్గురువుగా ఉండేదని గుర్తుచేశారు. అది నేడు అనేక భూభాగాలను విభజించబడిందన్నారు. దేశం కోసం యువత చైతన్యవంతులు కావాలని కోరారు. స్వరాజ్, శ్రీనివాస్, సంగమేశ్వర్, భానుచందర్, మల్లేశం, ప్రసాద్, నాగరాజు, సంతోష్; కనకయ్య, సాయి, వెంకటేశం తదితరులు ఉన్నారు.



కాగడాల ప్రదర్శనలో నాయకులు

గ్రామైక్య సంఘాల బలోపేతం

వీవోఏలకు గౌరవ వేతనంతో మెరుగుపడనున్న పనితీరు

న్యూస్‌టుడే, గజ్వేల్‌గ్రామీణ

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఇందిర క్రాంతి పథం ఆధ్వర్యంలో కొనసాగుతున్న గ్రామైక్య సంఘాలు బలోపేతం కానున్నాయి. ఎన్నో ఏళ్లుగా వీవోఏలుగా పని చేస్తున్న వారికి సక్రమంగా వేతనాలు రాకపోవడంతో ఇన్నాళ్లు గ్రామైక్య సంఘాల కార్యకలాపాలు ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదు. పలు అవాంతరాలు ఎదుర్కొంటూనే ఇన్ని రోజులు నెట్టుకొచ్చారు. వేతనాలు సరిగా రాని కారణంగా వీవోఏలు విధులపై అంతగా ఆసక్తి చూపలేదు. మహిళా పొదుపు సంఘాలు బలోపేతం కావాలంటే మొదట సహాయకులకు వేతనాన్ని పెంచాల్సి ఉందని భావించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నెలకు రూ.5 వేల గౌరవవేతనం ప్రకటించింది. సిద్దిపేట జిల్లాలో 22 మండల సమాఖ్యలు, 705 గ్రామైక్య మహిళా సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో 17,378 స్వయం సహాయక పొదుపు సంఘాలు పని చేస్తున్నాయి. సుమారు 1,88,413 మంది మహిళా సభ్యులు ఉన్నారు. ఏటా బ్యాంకుల నుంచి రూ.352 కోట్ల రుణాలు వారికి అందిస్తున్నారు. అంతేకాకుండా మార్కెటింగ్ పాడి కేంద్రాలు 103 ఉండగా వీటి పరిధిలో 26,371 మంది రైతులు ఉన్నారు.


పిడిచేడులో సంఘం సభ్యుల సమావేశం

వీవోఏల విధులు ఇలా..

గ్రామైక్య సంఘాల పనితీరు మెరుగుపర్చడం, పొదుపు లావాదేవీల పుస్తకాలు రాయడం, అర్హత ఉన్న స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, సామాజిక పెట్టుబడి నిధి పథకం ద్వారా రుణాలు అందేలా చూడటం, రుణాలు తీసుకొన్న వారి నుంచి నెలనెలా బ్యాంకు కిస్తీలు కట్టించడం, మహిళా సంఘాలకు, బ్యాంకర్లకు సంధానకర్తలుగా వ్యవహరించడం వీవోఏల పని. ఇదివరకు వీరికి వేతనమంటూ లేకపోవడంతో పలువురు పనిపై శ్రద్ధ పెట్టలేదు. ప్రస్తుతం నెల నెలా రాష్ట్ర ప్రభుత్వం రూ.3 వేలు, గ్రామైక్య సంఘాల ద్వారా రూ 2 వేల చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తారు. ప్రభుత్వం పొదుపు సంఘాల గ్రామ సమాఖ్యల సహాయకురాళ్లకు ఆర్థిక సాయమందించేందుకు ముందుకు రావడంతో పొదుపు సంఘాలు బలోపేతం కానున్నాయి. గ్రామ పొదుపు సంఘాల నిర్వహణ గాడినపడి సమర్థంగా విధులు నిర్వహించే వీలుంటుంది. ఆయా పొదుపు సంఘాల పొదుపు ఖాతాల నిర్వహణ, సమావేశాల ఏర్పాటు, ఇతర కార్యకలాపాలు మెరుగుపడనున్నాయి.

వీవోఏల బాధ్యత పెరిగింది: సురేశ్‌బాబు, ఇన్‌ఛార్జి డీఆర్‌డీవో, సిద్దిపేట

వేతనం పెంపుతో వీవోఏలకు ఆర్థికంగా వెసులుబాటు కలగడంతోపాటు బాధ్యతలు పెరుగుతాయి. నిర్వహణ సైతం సమర్థంగా ఉండే అవకాశముంది. గతంలో పొదుపు సంఘాల పరిధిలో ఉండే వీరు ఇకపై ప్రభుత్వ పరిధిలోకి రానున్నారు. మహిళా పొదుపు సంఘాల నిర్వహణలో ఇదిమంచి పరిణామం.

మంచి నిర్ణయం: నిఖిత, దిలాల్‌పూర్

పనికి తగిన వేతనాలుండాలని మేం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వమే రూ. 3 వేలు సాయమందించేందుకు తీసుకున్న నిర్ణయం చాలామంచిది. మాకు వేతనాలు వస్తాయని తెలిసి సంబరపడ్డాం. భవిష్యత్తులో మరింత బాధ్యతాయుతంగా పని చేస్తాం. సంఘాలు మరింత ఆర్థిక స్వావలంబన దిశగా పయనించేందుకు శాయ శక్తులా కృషి చేస్తాం.

కృష్ణాష్టమి నేపథ్యంలో నేడు ఘనంగా వేడుకలు

అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి శ్రీహరి

రంగధాంపల్లి (సిద్దిపేట అర్బన్): శ్రీకృష్ణుడి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి శ్రీహరి తెలిపారు. రంగధాంపల్లిలో ఆదివారం సంఘం జిల్లా అధ్యక్షుడు మామిండ్ల ఐలయ్యతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యావత్ యాదవ జాతి మేల్కొనేలా వేడుకలు జరుపుకోవాలన్నారు. కృష్ణాష్టమి సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని రంగధాంపల్లి శ్రీకృష్ణుడి దేవాలయం నుంచి పెద్దఎత్తున ద్విచక్ర వాహన ర్యాలీని సోమవారం 3 గంటలకు ప్రారంభిస్తామన్నారు. అనంతరం ర్యాలీ పట్టణంలోని వీధుల మీదుగా సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు చేరుకుంటుందన్నారు. తరువాత అక్కడే బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. సభకు రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావుతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. యువత ర్యాలీ, బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు రాములు, గిరి, ఐలయ్య, వెంకట్, తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న శ్రీహరి తదితరులు

సమస్యలకు పరిష్కారం.. అభివృద్ధి పనులకు శ్రీకారం

రైతు బజార్, అదనపు విద్యుత్తు ఉపకేంద్రం, గ్రంథాలయం నిర్మాణ పనులకు శంకుస్థాపన

✷ హుస్నాబాద్‌లో రూ.11.23 కోట్లతో 14 అభివృద్ధి పనులు ✷ నేడు రాష్ట్ర మంత్రులు మహేందర్‌రెడ్డి, హరీశ్ రాక

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్ పట్టణంలో కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారం కానున్నాయి. పట్టణం సహా వివిధ గ్రామాల్లో రూ.11.23 కోట్ల వ్యయంతో 14 అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారు. నేడు మంత్రులు పట్నం మహేందర్‌రెడ్డి, తన్నీరు హరీశ్‌రావులు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. దాదాపు వంద గ్రామాలకు కూడలిగా ఉన్న హుస్నాబాద్‌లో రైతు బజార్ ఏర్పాటు చేయాలని కొన్నేళ్లుగా అన్ని వర్గాల ప్రజలు కోరుతూ వచ్చారు. ఇటీవల రెండుసార్లు హుస్నాబాద్ పర్యటించిన రాష్ట్రమంత్రి హరీశ్‌రావు స్థలం చూపిస్తే రైతుబజార్ నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు రూ.60 లక్షలతో రైతు బజారు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. పట్టణంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు అదనంగా మరో 33/11 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టాలని ఏడాది కాలంగా ఉన్న ప్రతిపాదనకు మోక్షం లభించింది. హుస్నాబాద్‌తో పాటు పందిల్ల, మీర్జాపూర్‌లలో కొత్త 33/11 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్లకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. అర్ధంతరంగా నిలిచిన మినీ స్టేడియం పనులు పూర్తి చేయించడానికి మంత్రి, శాసనసభ్యుడు సతీష్‌కుమార్ చొరవ తీసుకోవడంతో రూ.86 లక్షలతో రీటెండర్ చేయించి పనులు ప్రారంభించనున్నారు. కొత్తగా నిర్మించిన ఐసీడీఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. ఆర్టీసీ బస్సుస్టేషన్‌ను రూ.33 లక్షల వ్యయంతో ఆధునీకరణ పనులకు మంత్రి మహేందర్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. అదే విధంగా హుస్నాబాద్ నుంచి హైదరాబాద్‌కు కొత్త సూపర్ లగ్జరీ బస్సును ప్రారంభించనున్నారు. హుస్నాబాద్ విద్యుత్తు డివిజన్ కార్యాలయం, మండల పరిషత్ వెనుక రూ.50 లక్షలతో గ్రంథాలయ భవనాలకు శంకుస్థాపన చేయనున్నారు. హుస్నాబాద్ పట్టణంలో మంత్రి హరీశ్ చొరవతో మంజూరైన రూ.2 కోట్ల నిధులతో చేపట్టే సిమెంటు రహదారులు, మురుగు కాలువలు, ముస్లింల శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభిస్తారు. అక్కన్నపేటలో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్‌ను ప్రారంభించనున్నారు. ఈ అభివృద్ధి పనులు ప్రారంభించే ముందు మంత్రులు స్థానిక రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో పూజలు నిర్వహిస్తారు. ఆయా కార్యక్రమాలకు శాసనసభ్యుడు వొడితల సతీష్‌కుమార్, శాసనమండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఆర్టీసీ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణతో పాటు పలువురు పాల్గొననున్నారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం వరకు హుస్నాబాద్ పట్టణంలో కార్యక్రమాలు జరుగనున్నాయి.


బస్సుస్టేషన్ ఆధునికీకరణ పనుల శంకుస్థాపనకు ఏర్పాట్లు

అర్హతకు దక్కని ఆసరా..!


- రెండేళ్లుగా లబ్ధిదారులకు తప్పని నిరీక్షణ
- తిరిగి దరఖాస్తు చేసుకున్నా.. దక్కని ఫలితం

'పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం. ఎట్టి పరిస్థితిలో వారి అభివృద్ధికి వెనుకడుగు వేసేది లేదు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఆసరా పింఛను అందిస్తాం. లబ్ధిదారులు ఏమాత్రం ఆందోళనకు గురికావాల్సిన పనిలేదు. ఒక్క దరఖాస్తు పెట్టుకుంటే చాలు అధికారులు పరిశీలించి పింఛను మంజూరు చేస్తారు'.

– ఇటీవల జరిగిన ఓ సభలో ముఖ్యమంత్రి

ఆసరా పింఛనుదారులకు ఉండాల్సిన అన్ని అర్హతలు ఉన్నప్పటికీ రెండేళ్లుగా నిరీక్షణ తప్పడం లేదు. మంత్రివర్యులు, ఎంపీ, ఎమ్మెల్సీ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా.. ఆసరా పింఛను మాత్రం నేటికీ అందని ద్రాక్షగానే మిగిలింది. పంచాయతీ కార్యదర్శి నుంచి మొదలుకొని కలెక్టర్, గ్రామ సర్పంచి నుంచి మంత్రి, ఉప సభాపతి వరకు పింఛనో రామచంద్రా అంటూ మొరపెట్టుకున్నా.. ఫలితం లేకుండా పోయింది. ప్రభుత్వాధికారులు చెబుతున్న మాటలకు, మండలంలో పరిస్థితి భిన్నంగా ఉంది.

– ప్రస్తుతం ఆసరా అందని లబ్ధిదారుల పరిస్థితి



రెండేళ్లుగా తప్పని ఎదురు చూపులు

న్యూస్‌టుడే, న్యాల్‌కల్

ప్రభుత్వం పేదలను ఆదుకునేందుకు ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఆసరా పింఛను పథకం అమలులో అపసోపాలు పడుతుంది. పెరిగిపోతున్న నిత్యావసర ఖర్చులు, అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ పింఛను భారీగా పెంచింది. గతంలో రూ.200, రూ. 500 ఉన్న పింఛను ఇప్పుడు రూ.1000, రూ. 1500కు పెంచి అందజేస్తోంది. 2014 నుంచి వితంతు, వృద్ధాప్య, వికలాంగులు, చేనేత, గీతకార్మిలకు పింఛను అందజేస్తోంది. తాజాగా ఒంటరి మహిళలకు అందజేసి ఆదుకుంటోంది. ఆసరా పింఛను పంపిణీలో మరింతగా పారదర్శకత, అక్రమాలను వెలికితీసేందుకు స్వచ్ఛంద సంస్థల చేత సామాజిక తనిఖీలను చేపట్టి పథకాన్ని పటిష్ఠంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. అయితే తనిఖీ బృందం అధికారుల అవగాహన రాహిత్యం, స్థానిక అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆసరా పంచన్లు పొందుతున్న వారి పేర్లు పింఛన్ల జాబితా నుంచి తొలగించబడ్డాయి. దీంతో పేదలకు భరోసా ఇవ్వాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

జిల్లాల్లో 1,27,470 పింఛన్లు

జిల్లాల్లోని సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ నియోజకవర్గాల్లోని మండలాల్లో 1,34,479 ఆసరా పింఛన్లను పంపిణీ చేస్తున్నారు. ఈ మేరకు ప్రతి నెల ప్రభుత్వం 60485 వితంతువులు, 52467 వృద్ధులు, 14497 వికలాంగులు, 753 చేనేత, 665 గీత కార్మికులు, 82 బీడీ కార్మికులు, 5780 మంది ఒంటరి మహిళల పింఛన్ల కోసం ప్రతినెల రూ.14.19 కోట్లను ఖర్చుచేస్తోంది. ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు ఈ పథకాన్ని పక్కాగా అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నా గ్రామాల్లో అధిక సంఖ్యలో లబ్ధిదారులు ఆసరా పింఛనుకు నోచుకోవడం లేదు. వేల సంఖ్యలో వచ్చిన దరఖాస్తులు పరిష్కారం కావడం లేదు. వృద్ధాప్య పింఛన్ల కోసం పదుల సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నా... నేటికి పింఛను రావడం లేదని పలువురు వాపోతున్నారు. పింఛను కోసం రెండేళ్లుగా అధిక సంఖ్యలో ప్రజలు ఎదురుచూస్తున్నారు.

సామాజిక తనిఖీలో తొలగింపు...

2015 ఏప్రిల్‌లో ఉమ్మడి జిల్లాలో మూడు ప్రాంతాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీలో 1050 పింఛన్లను తొలగించారు. ఇలా న్యాల్‌కల్ మండలంలో 340 పింఛను, సదాశివపేటలో 260, రామాయంపేటలో 450 పింఛన్లు తొలగింపునకు గురయ్యాయి. అయితే తనిఖీ బృందం అధికారులు పొరపాటున అర్హత ఉన్నప్పటికీ పలువురు లబ్ధిదారుల ఆసరా పింఛను తొలగించారు. అప్పట్లో అధికారులు, ప్రజాప్రతినిధులతో బాధితులు ధర్నాలకు దిగారు. తిరిగి పరిశీలించి కొనసాగిస్తామని అధికారులు చెప్పినా... రెండేళ్లుగా పట్టించుకోవడం లేదు. సామాజిక తనిఖీ అనంతరం వితంతువులు, వికలాంగులు, వృద్ధులు అధిక సంఖ్యలో తిరిగి దరఖాస్తు చేసుకున్నారు. వాటిల్లో కొందరు ఆ కేటగిరిలో అర్హత సాధించారు. మరికొన్ని దరఖాస్తులు పరిశీలనకే పరిమితం అయ్యాయి.

తొలగించిన వారిలో కొందరికి ఇస్తున్నాం

- విజయలక్ష్మి, జిల్లా సహాయ ప్రాజెక్టు అధికారి, డీఆర్‌పీఏ, సంగారెడ్డి

2015లో జరిగిన సామాజిక తనిఖీలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1050 పింఛన్లు తొలగించాం. వాటిల్లో కొందరు తిరిగి దరఖాస్తులు చేసుకోగా. . కొందరికి బీడీ కార్మికుల జాబితాలో, మరికొందరికి వింతంతు జాబితాలో పింఛన్లు ఇస్తున్నాం. ఇంకా అప్పుడు తొలగింపునకు గురైన వారిలో సుమారు 250 మంది ఉన్నారు. వీరు అర్హులమేనని తిరిగి మండల కేంద్రాల నుంచి దరఖాస్తు పంపిస్తే పరిశీలించి పింఛన్లు అందిస్తాం. కొందరు ఆధార్‌లో వయస్సు అధికంగా మార్చుకొని దరఖాస్తు చేయడంతో మంజూరు కావడం లేదు.

సమాచార వాహిని

సిద్దిపేట టౌన్: సిద్దిపేటలోని మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేటు లిమిటెడ్‌లో ఆగస్టులో పలు కొత్త చిట్టీలు ప్రారంభం అవుతున్నాయి. వీటిల్లో చేరాలని ఆసక్తి ఉన్న వారు పట్టణంలోని సంస్థ కార్యాలయంలో మేనేజర్ కె.శ్రీధర్‌ను సంప్రదించాలి. సెల్‌ఫోన్ నం. 99482 88214, 81063 54940 సంప్రదించి పూర్తి వివరాలు పొందవచ్చు.

చిట్టీల వివరాలివీ..

చిట్	గ్రూపు	కాలపరిమితి (నెలలు)	నెలసరి కిస్తీ (రూ.)	చిట్‌వాల్యూ (రూ.)
ఎల్‌టీ	టీ ఎస్‌డీ	50	10,000	5,00,000
ఎల్‌టీ	ఎక్స్ ఎస్‌డీ	50	20,000	10,00,000
ఎల్‌టీ	డీ ఎస్‌డీ	50	50,000	25,00,000
ఎఫ్‌టీ	డీ ఎస్‌డీ	40	50,000	20,00,000
ఎఫ్‌టీ	బీ ఎస్‌డీ	40	5000	2,00,000
ఎఫ్‌టీ	డబ్ల్యూ ఎస్‌డీ	40	2,500	1,00,000

సంప్రదించాల్సిన చిరునామా:

మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేటు లిమిటెడ్

ఇంటి నం. 3-4-59, 2వ అంతస్థు

ఫిర్‌దౌస్ ప్లాజా, కరీంనగర్ రోడ్డు, సిద్దిపేట - 502 103.

పాలనాధికారికి ఎక్సలెన్స్ పురస్కారం

(మొదటిపేజీ తరువాయి) భగీరథకు అనుసంధానం చేసి నిత్యం 28 లక్షల ఎంజీడీ(మిలియన్ గ్యాలన్స్ పర్ డే) నీటిని అందిస్తున్నారు. మరో 78 గ్రామాల్లో ఓహెచ్ఎస్ఆర్ ద్వారా నీరు సరఫరా అవుతోంది. హుస్నాబాద్ ప్రాంతం మినహాయిస్తే మిగిలిన నియోజకవర్గాల్లో దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ పథకంలో భాగంగా సంపు, ఓహెచ్ఎస్ఆర్, ప్రధాన, అంతర్గత పైప్‌లైన్ వంటి అంశాలపై దృష్టి పెట్టారు. ఏడాది కిందట ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతులమీదుగా రాష్ట్రంలోనే తొలిసారిగా గజ్వేల్ నియోజకవర్గంలో మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే.

ప్రత్యేక చొరవ.. జిల్లాలో భగీరథ పనులు కొనసాగడంలో పాలనాధికారి వెంకటరామరెడ్డి ముఖ్యపాత్ర పోషించారు. జిల్లా కలెక్టరేట్‌లో తరచూ సమీక్షలు జరిపి లక్ష్యాలను నిర్దేశించారు. నియోజకవర్గాల వారీగా ఏర్పాటైన వాట్సాప్ సమూహాల్లో పనులపై ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేశారు. భూసేకరణ వంటి అంశాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు. ఆర్‌డబ్ల్యూఎస్‌తో పాటు నీటిపారుదల, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారులతో సమావేశాలు జరిపి, ఆయా శాఖలు భగీరథ పనులు వేగంగా సాగేందుకు సహకరించాల్సిన తీరును వివరించారు. క్షేత్ర స్థాయి పర్యటన చేపట్టి అధికారుల్లో బాధ్యత పెంచారు.

***ఆనందంగా ఉంది:* వెంకటరామరెడ్డి, జిల్లా పాలనాధికారి**

భగీరథ పథకం ఫలవంతంగా ముందుకు తీసుకెళ్లినందుకు ప్రభుత్వం ఎక్సలెన్స్ పురస్కారం ప్రకటించడం ఆనందంగా ఉంది. జిల్లాలో ఆర్‌డబ్ల్యూఎస్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయడం వల్ల భగీరథ ఫలాలు ఆశించిన స్థాయిలో అందించగలిగాం. మిగిలిన పనులూ త్వరగా పూర్తి చేస్తాం.

బీసీ రాయితీ రుణాలు హుళక్కేనా..!

(మొదటిపేజీ తరువాయి) విడుదల కాకపోవడంతో మరో 317 మంది రుణాలు పొందలేకపోయారు. దీంతో వారిలో ఆందోళన వ్యక్తం అవుతోంది. మూడేళ్లుగా బకాయి విడుదల కాకపోవడంతో నిరాశ చెందుతున్నారు. జిల్లా బీసీ సంక్షేమశాఖ కార్యాలయం చుట్టూ చక్కర్లు కొడుతూ రాయితీ ఎప్పుడు వస్తుందని ఆరా తీస్తున్నారు.

రుణ ప్రణాళిక ఏదీ..!

2016-17 ఆర్థిక సంవత్సరంలో ఈ విభాగానికి సంబంధించి రుణ ప్రణాళిక విడుదల చేయలేదు. 2015-16కు సంబంధించి కార్యాచరణ పూర్తికాకపోవడం దీనికి కారణం. ఇక తాజా ఆర్థిక సంవత్సరం లోనూ నేటి వరకు ప్రణాళిక ఊసేలేదు. దీంతో నిరుద్యోగ యువతలో ఆవేదన వ్యక్తమవుతోంది. రజక, నాయీబ్రాహ్మణ, మత్స్య, గొల్ల, కుర్మల వంటి బీసీ సామాజిక వర్గాలకు వివిధ రూపాల్లో భారీగా ఆర్థిక చేయూత అందించేందుకు ప్రభుత్వం సిద్ధం అవుతోంది. ఈ పాటికే కొన్ని పథకాలను ప్రారంభించారు. మిగిలిన బీసీ సామాజిక వర్గాల్లోని యువతకు మాత్రం ఇలాంటి రాయితీ రుణ పథకాలే ఆధారం. రూ. లక్ష వరకు 80 శాతం, రూ.2 లక్షల వరకు 70 శాతం, రూ.3 లక్షలు ఆపైన రుణం పొందితే 60 శాతం రాయితీగా ఇస్తారు. గరిష్ఠంగా రూ.5 లక్షల వరకు రాయితీ పొందే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాయితీ బకాయి విడుదల చేయడంతో పాటు గత, ఈ ఆర్థిక సంవత్సరాల రెండూ కలిపి భారీ మొత్తంలో యూనిట్లు ప్రకటించాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం

- రాంరెడ్డి, జిల్లా బీసీ సంక్షేమాధికారి


2015-16 ఆర్థిక సంవత్సరం రాయితీ బకాయి రూ.3.54 కోట్ల మేర పేరుకుపోయింది. దీన్ని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరాం. త్వరలో వచ్చే అవకాశం ఉంది. ఇక 2015-16 ఆర్థిక సంవత్సర రుణ లక్ష్యం పూర్తి చేస్తేనే 2016-17, ఈ ఆర్థిక సంవత్సరాల రుణ ప్రణాళిక ప్రకటించే అవకాశం ఉంది.

భారమంతా వరుణుడిపైనే..!

(మొదటిపేజీ తరువాయి) సరిపెట్టుకుంటున్నారు. సన్నాలకు మారుపేరుగా నిలిచిన బీపీటీ(బాపట్ల) వంగడాలతో వరి సాగు చేస్తే పంట కాలం దాదాపు 180 రోజులు పడుతుండటం వల్ల నీరందక ఎండిపోయే ప్రమాదముందన్న ఆలోచనతో రైతులు 120 రోజులకు పూర్తయ్యే తెలంగాణ సోన(ఆర్ఎన్ఆర్), 1010 సాగు చేస్తున్నారు. సన్నగా.. కొంత తియ్యదనం ఉండే బీపీటీని శుభకార్యాలకు ఎక్కువగా వినియోగిస్తుంటారు. ధర కూడా కొంత ఎక్కువే ఉంటోంది. సాగుకు అనుకూల పరిస్థితులు లేకపోవటం వల్ల ప్రస్తుతం జిల్లాలో పాతిక శాతం కూడా బీపీటీని సాగు చేయలేదని తెలుస్తోంది. జిల్లాలో జులై రెండో వారం నుంచి ఆగస్టు నెల మొత్తం నాట్లు వేసే వరి పూర్తిగా స్వల్పకాలిక రకం కావటం గమనార్హం.

అన్నదాతలు అధైర్యపడొద్దు

- శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



జిల్లాలో సాగు ఆశాజనకంగా ఉంది. కురుస్తున్న వర్షాలు పంటలకు మేలు చేస్తున్నాయి. చెరువుల్లో నీరు చేరనంత మాత్రాన పంటలు ఎండిపోతాయని రైతులు అధైర్యపడొద్దు. పంటలు గట్టెక్కేలా వర్షాలు కురుస్తాయన్న నమ్మకముంది. బోరుబావులపై ఆధారపడి సాగు చేసిన రైతులకు దన్నుగా ప్రభుత్వం నిరంతర కరెంటు సరఫరా చేస్తోంది. సాగుకు ఇబ్బందులు ఏర్పడవు. సానుకూల దృక్పథంతో రైతులు ముందుకు సాగాలి.

రాయబార కార్యాలయంలో మనోడు

అమెరికాలో విధులతో గుర్తింపు

న్యూస్‌టుడే, మెదక్, చిన్నశంకరంపేట

ప్రధాని నరేంద్రమోదీ ఇటీవల అమెరికా పర్యటనకు వెళ్లిన సమయంలో అక్కడి భారత రాయబార కార్యాలయ అధికారులు విమానాశ్రయంలో ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఇది సాధారణమే కదా అనుకుంటున్నారు కదూ. కానీ అలా స్వాగతం పలికిన వారిలో మెతుకుసీమ యువకుడు ఉన్నాడనేదే విశేషం.

మెదక్ జిల్లా చిన్నశంకరంపేట పట్టణంలో ఆర్‌ఎంపీ వైద్యుడిగా పనిచేస్తున్న కేశవ్, శోభారాణి దంపతుల రెండో కుమారుడు రవికాంత్. అమెరికాలోని భారత రాయబార కార్యాలయంలో ఐటీ విభాగంలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రాథమిక విద్యాభ్యాసం చిన్నశంకరంపేటలోని ప్రభుత్వ పాఠశాలలో పూర్తిచేశాడు. 6 నుంచి 10వ తరగతి వరకు లింగంపల్లిలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదివాడు. అనంతరం హైదరాబాద్‌లోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్, ఆ తర్వాత అక్కడే బీటెక్ పూర్తిచేశాడు. అనంతరం అమెరికా వెళ్లి ఎమ్మెస్ చదివి ఉద్యోగ ప్రయత్నం చేస్తూ పోటీపరీక్షలకు హాజరయ్యాడు. తన ప్రతిభతో తొలి ప్రయత్నంలోనే అక్కడి భారత రాయబార కార్యాలయంలో మూడు నెలల క్రితం ఉద్యోగం సంపాదించాడు. ఇటీవల భారత ప్రధాని నరేంద్రమోదీ అమెరికా వెళ్లగా ఆయనకు స్వాగతం పలికిన వారిలో రవికాంత్ ఉన్నాడు. ఈ సందర్భంగా తన గురించి మోదీకి పరిచయం చేసుకుని అభినందనలు అందుకున్నాడు. ఈ విషయం తెలుసుకుంటున్న అతని మిత్రులు, స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



మోదీకి అమెరికాలో స్వాగతం పలికిన బృందంలో రవికాంత్ (ప్రధానికి ఎడమవైపు ఉన్న వ్యక్తి)



తల్లి శోభారాణితో..




ఇంటింటా దీన్‌దయాల్ వెలుగులు

- పథకం అమలుకు కసరత్తు
- ఉమ్మడి జిల్లాలో లక్ష మందికి లబ్ధి!

న్యూస్‌టుడే, గజ్వేల్

నివాసగృహాల్లో విద్యుత్తు సౌకర్యం లేక చీకటిలో ఉన్న పేదలకు గతేడాది కేంద్రం పంపిన తీపికబురే దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన. జిల్లాలో ఈ పథకం అమలుకు కసరత్తు మొదలైంది. అన్ని మండలకేంద్రాల వద్ద ప్రచార ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. గతేడాది(2016) డిసెంబర్‌లో ఉమ్మడి మెదక్ జిల్లాలో ఈ పథకం అమలుచేసేందుకు కేంద్రం ప్రభుత్వం రూ.80 కోట్లు మంజూరుచేసింది. విద్యుత్తు సౌకర్యం లేని బీపీఎల్ కుటుంబాలు రూ.125 చెల్లిస్తే చాలు రూ.2500 ఖరీదు చేసే కరెంటు మీటరు, ఎల్‌ఈడీ బల్బు, సర్వీసు తీగతో పాటు అవసరమైతే స్తంభాలు, కండక్టర్ తీగ బిగించి ఇంటికి విద్యుత్తు కనెక్షన్ ఇస్తారు. ఈ ఖర్చును పూర్తిగా విద్యుత్తు శాఖ భరిస్తుంది. గతంలో ఒక ఇంటికి మీటరు తీసుకోవాలంటే.. రూ.1200 డీడీ, రూ.200 సెక్యూరిటీ డిపాజిట్ చెల్లిస్తే కనెక్షన్ మంజూరుచేసి ఒక మీటరు మాత్రమే ఇచ్చేవారు. కానీ ఈ పథకంలో భాగంగా ఇప్పుడు పేదలు చెల్లించే రూ.125లో రూ.100 సర్వీస్ డిజిపాటిగా వినియోగదారుని పేరు మీదే ఉంటుంది. అంటే పేదలకు రూ.25లకే విద్యుత్తు కనెక్షన్ అందిరానుందన్నమాట. ఈ పథకం ద్వారా ఉమ్మడి జిల్లాలో లక్ష మందికి లబ్ధి చేకూరనుందని అధికారులు అంచనా వేశారు.

ఉమ్మడి మొత్తం జిల్లాలో 8.5 లక్షల కుటుంబాలున్నాయి. గృహాల విద్యుత్తు కనెక్షన్ల సంఖ్య మాత్రం 7.40 లక్షలే. అంటే ఇంకా లక్షకు పైగా కుటుంబాలు విద్యుత్తు సౌకర్యం లేకుండా ఉన్నాయని తెలుస్తుంది. ఇందులో సిద్దిపేట జిల్లాను చూస్తే ఇక్కడ మొత్తం వాణిజ్య సముదాయాలు కలిపి 4 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. కుటుంబాల ప్రాతిపదికన చూస్తే 3.5 లక్షల కుటుంబాలున్నాయి. ఈ లెక్కన సిద్దిపేట జిల్లాలో కనీసం 40 వేల కుటుంబాలలో దీన్‌దయాల్ పథకం వెలుగులు నింపనుంది. సామాజికవర్గ భేదం లేకుండా బీపీఎల్ కుటుంబమై ఉంటే చాలు.. ఈ పథకానికి అర్హులని అధికారులు చెబుతున్నారు. ఇంటింటికీ విద్యుత్తు సౌకర్యం కల్పించాలన్న సంకల్పంతో కేంద్రప్రభుత్వం ఈ పథకం రూపొందించింది.



దీన్‌దయాల్ పథకం అమలుకు గజ్వేల్‌లో విద్యుత్తు అధికారులు ఏర్పాటుచేసిన ప్రచార ఫ్లెక్సీ

చౌర్యానికి అడ్డుకట్ట

కేంద్రం తీసుకొచ్చిన దీన్‌దయాల్ పథకం వల్ల పేదలకు విద్యుత్తు సౌకర్యం కల్పించటమేకాక సరఫరాలో చౌర్యాన్ని అరికట్టేందుకు మార్గం సుగమం అవుతుందని అధికారులు అభిప్రాయ పడుతున్నారు. మారుమదిర గ్రామాలు, తండాలు, మారుమూల పల్లెల్లో ఇళ్లకు విద్యుత్తు సౌకర్యం లేని కొందరు తీగలకు కొక్కేలు వేసి వినియోగిస్తున్నారు. కొన్నిచోట్ల స్థానిక లైన్‌మెన్‌లకు అనధికార చెల్లింపులతో విద్యుత్తు చౌర్యం జరుగుతుండగా మరికొన్ని గ్రామాల్లోకి అధికారులు వెళ్లకపోవటం, రాజకీయ నాయకుల ఒత్తిడితో చూసీ చూడనట్టు ఊరుకుంటున్నారు. ఫలితంగా నిత్యం లక్షలాది యూనిట్లు చౌర్యం అవుతోంది. ఉమ్మడి జిల్లాలో అన్ని కనెక్షన్లకు కలిపి రోజుకు 18 మిలియన్ యూనిట్లు వినియోగం అవుతుండగా బిల్లింగ్ మాత్రం 15 మిలియన్ యూనిట్ల వరకే జరుగుతోంది. ఇలా ఖరీదైన ఇంధనం చౌర్యం కావటమే కాక ప్రభుత్వానికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో చౌర్యానికి అవకాశం లేకుండా ప్రతి ఇంటికి అధికారికంగా కరెంటు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది.

పేదల అభ్యున్నతికి దోహదం

- కరుణాకర్‌బాబు, విద్యుత్తు శాఖ జిల్లా అధికారి

పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేపడుతున్న ఈ పథకం అమలుకు జిల్లాలో కసరత్తు ప్రారంభించాము. అర్హులు డీడీలు కూడా కట్టాల్సిన అవసరం లేదు. విద్యుత్తు సిబ్బందికే టీఆర్ పుస్తకాలు ఇస్తున్నాము. రూ.125 చెల్లించి రసీదు తీసుకుంటే సరిపోతుంది. సామగ్రి సమకూర్చి కనెక్షన్ ఇస్తాము. విద్యుత్తు కనెక్షన్ లేని పేద కుటుంబాల వారు అర్హులు. ఇదివరకే పాత మీటర్లున్నా.. ఇంటి నంబర్లు లేకుండా దరఖాస్తు చేసినా.. ఈ పథకం వర్తించదు. పథకం ప్రజల్లోకి చేర్చేందుకు త్వరలోనే గ్రామాల్లో దండోరా వేయించి ప్రచారం చేస్తాము. మండల కేంద్రాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. ఎంతమంది దరఖాస్తు చేసుకున్నా కాదనకుండా ఇస్తాము. ఇందుకు పరిమితి లేదు.



రక్తదాన శిబిరంలో పరిశ్రమ ఉద్యోగులు



పరిశ్రమ ఆవరణలో మొక్కలు నాటుతున్న సీఈవో

ఉత్పత్తిలో ఘనత..

సేవలో సహృదయత

ఎంఎల్‌ఆర్-తేజ పరిశ్రమ ముందంజ

న్యూస్‌టుడే, మనోహరాబాద్

పరిశ్రమలు కేవలం ఉత్పత్తి స్థావరాలే కాదు.. సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాలు చేపట్టాల్సిన కేంద్రాలు కూడా. ఇదే ఉద్దేశంతో ప్రతి పరిశ్రమ స్థానికులకు తగిన చేయూత అందించాలని ప్రభుత్వం సూచిస్తోంది. ఇలా జనానికి నేరుగా ఉపయోగపడేలా కార్యక్రమాలు చేయాల్సి ఉన్నా నామమాత్రంగా చేపట్టి వదిలేస్తున్నవే ఎక్కువ. ఈ విషయంలో మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల పరిధి ముప్పిరెడ్డిపల్లి ఆటోమోటివ్ పార్కులోని ఎంఎల్‌ఆర్-తేజ ఆటో పరిశ్రమ ఆదర్శంగా నిలుస్తోంది. ఉపాధి కల్పనలో స్థానికులకు ప్రాధాన్యమిస్తోంది. వ్యాపారంలో రాణిస్తూనే సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ప్రశంసలు అందుకుంటోంది.

ఎంఎల్‌ఆర్-తేజ ఆటో పరిశ్రమ ముప్పిరెడ్డిపల్లిలోని ఆటోమోటివ్ పార్కులో 25 ఎకరాల్లో విస్తరించి ఉంది. పరిశ్రమలో వివిధ విభాగాలలో సుమారు 50 మంది స్థానికులకు ఉద్యోగావకాశం కల్పించారు. ముప్పిరెడ్డిపల్లి, జీడిపల్లి, కూచారం, కాళ్లకల్ గ్రామాలకు చెందిన యువకులు, మహిళలను ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. పరోక్షంగా మరో 50 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఏడాది క్రితం ఇక్కడ నెలకు 50-60 ఆటోలు ఉత్పత్తి చేసేవారు. ప్రస్తుతం నెలకు 210-220 ఆటోలు తయారుచేసి మార్కెట్‌లోకి పంపుతున్నారు. ఇలా ఉత్పత్తిలోనూ ఘనమైన ప్రగతి సాధించింది.

ఇవీ సేవా కార్యక్రమాలు..

- వేసవిలో ఆయా గ్రామాల ప్రధాన చౌరస్తాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటుచేసి ప్రజల దాహార్తి తీరుస్తున్నారు.
- వడదెబ్బ తగిలి పలువురు అస్వస్థతకు గురవుతున్న విషయాన్ని గమనించి ముప్పిరెడ్డిపల్లి, కూచవరం, జీడిపల్లి, కాళ్లకల్ గ్రామాల్లో సుమారు 1500 టోపీలు పంపిణీ చేస్తున్నారు. వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు.
- ముప్పిరెడ్డిపల్లిలో రూ.14 లక్షలతో హన్‌మాన్ దేవాలయ నిర్మాణం చేపట్టారు.
- రాష్ట్ర అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పరిశ్రమ అవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు.
- పరిశ్రమ అవరణలో మెగా ఆరోగ్యశిబిరం ఏర్పాటుచేశారు. చుట్టుపక్కల గ్రామాల వారికి ఉచితంగా పరీక్షలు చేసి చికిత్సకు ఆసుపత్రులకు తరలించారు.

హరితహారంలో ఉత్సాహం..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న హరితహారం కార్యక్రమంలో భాగంగా పరిశ్రమ అవరణలో సుమారు 2 వేల మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. మూడు సంవత్సరాలుగా హరితహారంలో యాజమాన్యంతో పాటు కార్మికులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. పారిశ్రామికవాడలోని బఫర్‌జోన్‌లోనూ మొక్కలు నాటి పెంచుతున్నారు.

నిల్వగుంతతో నీటి పొదుపు

పరిశ్రమ అవరణలో చిన్నపాటి కుంట మాదిరిగా పెద్ద గుంత తవ్వారు. పరిశ్రమలో ఎక్కడా నీరు నిలవకుండా ప్రత్యేక ఏర్పాటుచేశారు. పరిశ్రమలో పడే వర్షం నీరంతా ఈ కుంటలోకి చేరే విధంగా చేశారు. పరిశ్రమలో వృథా నీరు కూడా మురుగుకాల్వల ద్వారా ఇంకుడుగుంతలోకి చేరేలా నిర్మాణాలు చేపట్టారు. ఈ తరహా కృషిని గుర్తించి రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఉత్తమ పరిశ్రమగా జిల్లాస్థాయిలో అవార్డు అందజేశారు. రెండు రోజుల క్రితం జిల్లా పరిశ్రమల శాఖ అధ్వర్యంలో మెదక్‌లో నిర్వహించిన సమావేశంలో ఉత్తమ ఉత్పత్తిదారుగా ఎంపికై అభినందనలు అందుకుంది.



ఆటోలు తయారుచేస్తున్న కార్మికులు



నీటికుంటను పరిశీలిస్తున్న కలెక్టర్

సామాజిక కార్యక్రమాలు విస్తరిస్తాం

- కేశబ్‌సేన్, సీఈవో, ఎంఎల్‌ఆర్-తేజ ఆటో పరిశ్రమ

పరిశ్రమ స్థాపనతో పది మందికి ఉపయోగపడే పనులు చేపట్టి సమాజహితం కోసం కృషి చేస్తున్నాం. పరిశ్రమ వృద్ధితో పాటు సామాన్య జనాలకు ఉపయోగపడేలా కార్యక్రమాలు చేపడుతున్నాం. పరిశ్రమలో చేపట్టే కార్యక్రమాల్లో హెచ్‌ఆర్ మేనేజర్ కేదార్‌నాథ్ కృషి అభినందనీయం. సిబ్బంది తోడ్పాటు, జిల్లా అధికారుల సహాయ సహకారాలతో సేవా కార్యక్రమాలు మరింతగా విస్తరిస్తాం.

వరి.. ఆరుతడి

కేసింగ్ పైపు విధానంలో సాధ్యమే

మార్పు చూపుతున్న కోనాపూర్ రైతులు

న్యూస్‌టుడే, రామాయంపేట

ఓ వైపు వర్షాభావ పరిస్థితులు.. మరోవైపు తగ్గుతున్న భూగర్భజలాలు.. రైతులు ఏటా చూస్తున్న పరిస్థితులివి. ఇంకా పాత పద్ధతులతోనే నీటి ఆధారిత పంటలు సాగు చేయలేక చతికిలపడుతున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పు చెందకపోవడంతో నష్టాలపాలవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలతో 'కేసింగ్ పైపు' విధానంలో నీటిపొదుపు పాటిస్తూ ఆరుతడిగా వరి సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు కోనాపూర్ రైతులు.

రామాయంపేట మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన రైతు పోచమైన కిషన్ తనకున్న రెండకరాల్లోని ఎకరం భూమిలో వరి సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం భూగర్భజలాలు అడుగంటడంతో ఆయన బోరు ఆపుతూ పోస్తోంది. ఈ నేపథ్యంలో వరి సాగుకు ఇబ్బందులు పడిన కిషన్ వ్యవసాయాధికారుల, శాస్త్రవేత్తల సూచనలతో కేసింగ్ పద్ధతి పాటిస్తున్నాడు. ఆయనతో పాటు గ్రామానికి చెందిన పది మంది రైతులు ఈ బాటనే అనుసరిస్తూ తక్కువ నీటితో సైతం వరి సాగు చేయవచ్చని నిరూపిస్తున్నారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో ఈ పద్ధతి ఎంతో ఉపయోగమంటున్నారు.

తక్కువ నీటితోనే లాభం

రైతులు ఏళ్లుగా పాత పద్ధతిలోనే వరి సాగు చేస్తున్నారు. ఎక్కువ నీరు అందుబాటులో ఉంటేనే ఈ పంట పండుతుందనే భావనలో ఉన్నారు. వరి వేర్లు కేవలం 4 నుంచి 5 ఇంచుల వరకు మాత్రమే భూమిలోకి వెళ్తాయి. అంతవరకు మాత్రమే నీటిని అందిస్తే సరిపోతుంది. కానీ రైతులు వరినాటు వేసిన మొదలు కోత వరకు అందులో నీటిని వరి మొదళ్లు మునిగే వరకు నిల్వ ఉంచుతున్నారు. ఇది కేవలం కలుపు పెరగకుండా మాత్రమే తోడ్పడుతుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. కానీ ఎక్కువ నీరు పొలంలో ఉండటంతో వరి మొదళ్ల నుంచి కొత్తగా పుట్టుకొచ్చే పిలకలు నీటిలో కుళ్లిపోతాయి. దీనికితోడు దోమకాటు పెరుగుతుంది. ఎరువులు చల్లిన సమయంలో అవి మొక్కకు పూర్తిస్థాయిలో అందకుండా భూమిలో తేమశాతం ఉన్నమేరకు పోవడం వల్ల ఉపయోగం లేకుండా పోతుంది.



పొలంలో పాతిన కేసింగ్ పైపు



పైపు లోపల నిల్వ ఉన్న నీరు



రంధ్రాలు వేసిన కేసింగ్

కేసింగ్ పద్ధతి ఇలా..

ఆరుతడిగా వరి పండించేందుకు కేసింగ్ విధానం చక్కగా తోడ్పడుతుందని వ్యవసాయాధికారి రమేష్ పేర్కొంటున్నారు. 18 ఇంచుల(అడుగున్నర) కేసింగ్ పైపు తీసుకుని 9 ఇంచుల వరకు సుమారు 150కి పైగా చుట్టూ రంధ్రాలు చేశారు. ఆ రంధ్రాలు భూమికి సమాంతరంగా ఉండేలా పొలంలో పాతారు. పాతిన సమయంలో కేసింగ్ మధ్యలో ఉన్న మట్టిని పూర్తిగా తొలగించారు. భూమిలో నిల్వ ఉన్న నీరు రంధ్రాల ద్వారా కేసింగ్‌లో చేరడం వల్ల, పొలంలోని నీటి నిల్వ(తేమశాతం) స్పష్టంగా తెలుస్తుంది. వరి వేర్లకు నీరు అందుతుందన్న విషయం అవగతమవుతుంది. కేసింగ్‌లో నిల్వ ఉన్ననీటిని రోజూ గమనిస్తుండాలి. 9 ఇంచుల్లో 4 ఇంచుల వరకు తగ్గిన తరువాత ఆరుతడిలా నీటిని అందిస్తే సరిపోతుంది. దీనివల్ల సాధారణ పద్ధతిలో ఎకరం పొలానికి వినియోగించే నీటితో రెండెకరాల్లో సాగు చేయవచ్చు. చలక నేలలు, ఎర్రమట్టి నేలల్లో నీరు త్వరగా ఇంకుతుంది. అదే ఒండ్రుమట్టిలో అయితే తక్కువగా ఇంకుతుంది.

ఉపయోగాలు..

- కేసింగ్ పద్ధతితో రైతులు తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగు చేయడానికి అవకాశం ఉంది.
- నీటి ఆదాతో పాటు విద్యుత్తు ఆదా అవుతుంది.
- పిలకల శాతం పెరుగుతుంది.
- నీరు ఆరుతడిగా అందుతుండటంతో పిలక కుళ్లిపోదు. దోమపోటు నివారణ సాధ్యమవుతుంది.
- వేర్లు కుళ్లు రోగం బారిన పడకుండా, ఘంట బలంగా పెరుగుతుంది.
- ఎరువులు నేరుగా మొక్క వేరుకు చేరుతాయి.
- పశుగ్రాసం సైతం ఎక్కువగా వస్తుంది. మొక్కకు గాలి, వెలుతురు సరిగ్గా అంది రోగాల బారిన పడకుండా ఉంటుంది.

సులభం, ఎంతో సౌలభ్యం

- కిషన్, రైతు, కోనాపూర్



కేసింగ్ పైపుల పద్ధతిలో తక్కువ నీటితోనే ఎకరం పొలంలో సాగు చేస్తున్నాను. నా బోరు తక్కువగా పోయడంతో ఇదివరకు ఇబ్బంది పడ్డాను. కానీ ప్రస్తుతం ఆ ఇబ్బంది తప్పింది. మరింత సాగు చేయడానికి సిద్ధమతున్నాను.

రైతుల్లో మార్పు అవసరం

- రమేష్, వ్యవసాయాధికారి, రామాయంపేట



రైతులు పాత పద్ధతులే కాకుండా మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త పద్ధతులను అందిపుచ్చుకోవాలి. భూగర్భ జలాలు అడుగంటిన నేపథ్యంలో కేసింగ్ పద్ధతి ద్వారా వరి పండించుకోవాలి. అందరూ ఈ విధానాన్ని అందిపుచ్చుకుంటే మేలు.

సాగులోనూ సగభాగమైంది

సంసార బాధ్యతల్లోనే కాదు.. సాగు కష్టంలో కూడా చెరిసగం అనిపించుకుంటున్నారీ రైతు దంపతులు. గజ్వేల్ మండలం సింగాటం గ్రామానికి చెందిన ఉర్సుల లింగం ఈ సీజన్‌లో మూడెకరాలలో పత్తి, రెండెకరాలు మొక్కజొన్న సాగు చేశాడు. ఇటీవల కురిసిన ముసురు వర్షాలకు కలుపు మొక్కలు మొలిచాయి. తీయించేందుకు కూలీ ఖర్చులకు భరించలేక ఇలా తన భార్య విజయతో కలిసి సొంతంగా దంతెలు కొడుతున్నాడు. ఎకరం పత్తిలో కలుపు నివారణకు రూ.3 వేల వరకు ఖర్చవుతోంది. అసలే చేతిలో డబ్బులు లేక అవస్థ పడుతున్న పేద రైతులు కూలీ ఖర్చులు భరించలేకపోతున్నారు. కుటుంబసభ్యులతో కలిసి అరకలు కట్టుకుంటున్నారు.

– న్యూస్‌టుడే, గజ్వేల్



వీళ్లింతేనా.. మారరా..?



వాయు కాలుష్య నమోదు యంత్రం



- అందరికీ ఆగస్టు.. పీసీబీకి మాత్రం ఇంకా జులైనే
- రోజులు గడుస్తున్నా.. లెక్కకట్టని అధికారులు
- ఈ రోజుది.. నాలుగైదు రోజుల తర్వాత
- కాలుష్య తీవ్రత లెక్కింపులో తీవ్ర జాప్యం
- వెబ్‌సైట్ నుంచి కూడా తొలగించిన అధికారులు
- అతీ గతీ లేని మొబైల్ యాప్

ఈనాడు, హైదరాబాద్

ఇది ఆగస్టు. కానీ తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(టీఎస్‌పీసీబీ) మాత్రం ఇంకా జులైలోనే ఉంది. ఆ నెల ముగిసి చాలా రోజుల వుతుంది కదా అంటారా.. అదంతే.. అక్కడంతా పూర్తిగా విభిన్నం. అదేంటంటూ ఆశ్చర్యపోకండి. అలాగనీ వాళ్లకు ప్రత్యేక క్యాలండర్ అంటూ ఏమీ లేదు. అయినా.. ఎందుకిలా అంటారా..? అదేంటో తెలుసుకుంటే 'వీళ్ల ఘనత అంతా ఇంతా కాదని' అంటూ మెచ్చుకోక ఉండలేరు మరి.

● అక్కడ.. ఇక్కడా అని తేడా లేదు. భాగ్య నగరంపై కాలుష్యం పంజా విసురుతోంది. ధూళి కణాలు నగరవాసులకు చుక్కలు చూపిస్తున్నాయి. స్వచ్ఛమైన గాలిని దూరం చేస్తున్నాయి. కాలుష్య తీవ్రతను లెక్కగట్టేందుకు టీఎస్‌పీసీబీ నగరంలో 21 చోట్ల రూ.లక్షల విలువైన ఆధునిక యంత్రాలతో నమోదు కేంద్రాలను నిర్వహిస్తోంది. హెచ్‌సీయూ, సనత్‌నగర్, పాశమైలారం, జూపార్క్ తదితర ప్రాంతాల్లోని సీఏఏక్యూఎంఎస్ కేంద్రాల్లో నిరంతరం లెక్కిస్తారు. మిగిలిన చోట్ల నేమో క్రమం తప్పకుండా రెసిపరబుల్ డస్ట్ శాంప్లర్ అనే పరికరంతో నమోదు చేస్తున్నారు. ఆయా కేంద్రాల్లో సూక్ష్మ దుమ్ము రేణువులు(పీఎం 10), అతి సూక్ష్మ ధూళి రేణువులు(పీఎం 2.5), సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్లు, బెంజీన్, టోలీన్, గ్జైలీన్, కార్బన్ మోనాక్సైడ్ తదితర కాలుష్య కారకాలను లెక్కిస్తున్నారు.

అదంతే..!

సాంకేతిక పరిజ్ఞానం కొంగొత్త పుంతలు తొక్కుతున్న తరుణమిది. ఒక్క క్లిక్‌తో ఏ సమాచారం కావాలంటే అది తెలుసుకోవచ్చు. నగర కాలుష్య తీవ్రతను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం మాత్రం అసాధ్యంగా మారింది. ఈ రోజుది కావాలంటే మూడు, నాలుగు రోజులు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక మునుపటి నెల సగటు కావాలంటే మాత్రం పదిహేను రోజులు ఆగాల్సిందే. జులై ముగిసి పదమూడు రోజులు గడుస్తున్నా.. నేటికి ఆ 'లెక్క' తేల్చలేదంటే క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. నెల ముగిసిన తర్వాత రెండు, మూడ్రోజులంటే ఫర్వాలేదు. కానీ.. ఇన్ని రోజుల సమయం పడుతుందా అంటూ ఎవరైనా ప్రశ్నిస్తే మాకు ఇదొక్కటే పని కాదు కదా అంటూ పీసీబీ నుంచి సమాధానం వస్తుండటం గమనార్హం. కొన్నేళ్ల నుంచి ఇదే తంతు. అయినా.. అధికారుల్లో మాత్రం మార్పు రావడం లేదు.

గొప్పలు చెప్పారు..! ఒక్క క్లిక్‌తోనే కాలుష్య తీవ్రతను ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామంటూ ఏడాది క్రితం పీసీబీ అధికారులు ప్రకటించారు. ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెస్తామంటూ గొప్పలు చెప్పారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ప్రాంతం పేరు నమోదు చేస్తే దగ్గర్లో ఉన్న వాయు కాలుష్య నమోదు కేంద్రంలో నమోదైన వివరాలు ప్రత్యక్షమవుతాయని వివరించారు. ఎంత వరకు వచ్చిందని అడిగితే.. 'దాదాపుగా పూర్తయిందని..చిన్న చిన్న మార్పులు చేస్తున్నాం.. త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తాం' అంటూ కొన్ని నెలలుగా సమాధానం చెబుతూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

భద్రంగా..!

కాలుష్యాన్ని నియంత్రించాలని కాలుష్య నియంత్రణ మండలి పేరులోనే ఉంది. కాలుష్య తీవ్రతపై ఎప్పటికప్పుడు ఇతర శాఖలతో చర్చిస్తూ.. సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలి. కాకపోతే.. క్షేత్రస్థాయిలో ఇందుకు భిన్నంగా జరుగుతోంది. కనీసం కాలుష్య తీవ్రతకు సంబంధించిన సమాచారం కూడా సంబంధిత విభాగాల వద్ద అందుబాటులో ఉండటం లేదంటే వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇక సామాన్యుడి పరిస్థితి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. మొన్నటి దాకా.. కాస్త ఆలస్యమైనా సరే టీఎస్‌పీసీబీ వెబ్‌సైట్‌లో ఎంతో కొంత సమాచారాన్ని అందుబాటులో ఉంచేవారు. ఇప్పుడా ఆ అవకాశం కూడా లేదు. తాజాగా వెబ్‌సైట్ నుంచి ఆ సమాచారాన్ని తొలగించినట్లుగా పర్యావరణవేత్తలు గుర్తించారు. శనివారం 'ఈనాడు' పీసీబీ వెబ్‌సైట్‌ను పరిశీలిస్తే ఇది వాస్తవమేనని తేలింది. కాలుష్య సమాచారమే కాదు.. రూ. కోట్లు వెచ్చించి ఎన్‌జీఆర్ఐ, ఈపీటీఆర్ఐ తదితర సంస్థలతో చేయించిన అధ్యయన నివేదికల్ని సైతం పీసీబీ అధికారులు భద్రంగా దాచి పెట్టుకుంటున్నారు. పోనీ.. ఆ నివేదికల్ని వాళ్లైనా అధ్యయనం చేస్తున్నారా అంటే అదీ లేదు.

చుక్కేసి నడిపితే చుక్కలే!

- 7 నెలల్లో 2,620 మంది జైలుపాలు
- 173 మంది వాహనచోదక పత్రాల రద్దు



ఈనాడు, హైదరాబాద్

మోతాదుకు మించి మద్యం తాగి ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతున్న వారిపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. పరిమితికి మించి తాగిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. నగరంలో రోజుకు సగటున వంద మందిపై కేసులు నమోదవుతున్నాయి. కేవలం ఏడునెలల వ్యవధిలోనే 10,500 కేసులు నమోదుకాగా... 2,620 మంది జైలుకు వెళ్లారు. పదేపదే తాగి నడుపుతూ పోలీసులకు చిక్కిన 173 మంది వాహనచోదక అనుమతి పత్రాలు(లైసెన్సులు) తాత్కాలికంగా రద్దయ్యాయి.

సెంచరీలు కొడుతున్న యువత

మద్యం మత్తులో వాహనాలు నడపడమే తప్పు.. ఇక కొందరు యువత నిషా ఎక్కే దాకా తాగి వాహనాలు నడుపుతూ రహదారులపైకి వస్తున్నారు. బ్రీత్ అనలైజర్‌లో వీరి మద్యం మోతాదును చూసి పోలీసులే ఆశ్చర్యపోతున్నారు. బీఏసీ(బ్లడ్ ఆల్కహాల్ కాన్సంట్రేషన్) ప్రమాణాల మేరకు.. ప్రతి వంద మిల్లీలీటర్ల రక్తంలో మద్యం మోతాదు 30 మిల్లీగ్రాములకు మించకూడదు. వీరంతా 100 మిల్లీ గ్రాములను దాటేస్తున్నారు. ఇటీవల ఓ ప్రైవేటు ఉద్యోగినిని బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించగా... 100 మిల్లీ లీటర్ల రక్తంలో 131 మి.గ్రా. మద్యం మోతాదు కనిపించింది. మరో యువతి బీఏసీ 105 మి.గ్రా. కాగా.. వ్యాపారం చేస్తున్న ఇంకో యువతి బీఏసీ 106 మి.గ్రా నమోదైంది. వీరిపై కేసు నమోదు చేసిన అనంతరం తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. న్యాయస్థానంలో హాజరుపరచగా... ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున జరిమానా విధించారు.

ఒక్కొక్కరికి ఒక్కో దస్త్రం

డ్రంకెన్‌డ్రైవ్‌ను ప్రవేశపెట్టినప్పుడు కేసులు, జరిమానాల వరకే పరిమితం చేద్దామనుకున్నారు. సెలబ్రిటీలు, చిత్రపరిశ్రమకు చెందిన వారు, వ్యాపారులు, వైద్యులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తనిఖీల్లో దొరికిపోతుండడంతో జరిమానాల నుంచి జైలుశిక్షల వరకు దీన్ని పెంచారు. పదేపదే దొరికే వారిని గుర్తించేందుకు డ్రైవింగ్ లైసెన్స్‌ను స్కాన్ చేసి ఒక్కొక్కరికీ ఒక దస్త్రాన్ని తెరిచారు. రెండోసారి తనిఖీ చేసినప్పుడు దొరికిన వారు చిరునామా తప్పు చెప్పినా, వివరాలు అరకొరగా ఇచ్చినా డ్రైవింగ్ లెసెన్స్ ద్వారా తెలిసిపోతుంది. రెండోసారి పట్టుబడితే నిర్లక్ష్యంగా వాహనాలు నడిపారంటూ న్యాయస్థానంలో ప్రవేశపెట్టేముందు.. న్యాయమూర్తికి ఇచ్చే నివేదికలో పొందుపరచనున్నారు. తద్వారా జైలుశిక్ష పడేలా చూస్తారు.

ప్రమాదాలు తగ్గించేందుకే...: – రవీందర్, సంయుక్త కమిషనర్(ట్రాఫిక్)

మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలు చేస్తున్న వారిని కట్టడి చేసేందుకే డ్రంకెన్ డ్రైవ్‌పై దృష్టి సారించాం. కొన్ని ప్రాంతాల్లో పగలూ నిర్వహిస్తున్నాం. వారాంతాల్లో వందల సంఖ్యలో యువకులు తాగి వాహనాలు నడుపుతున్నట్టు గుర్తించాం. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, బేగంపేట, సికింద్రాబాద్ ప్రాంతాల్లో గతంలో ఎక్కువగా తనిఖీలు చేసేవాళ్లం. ఇప్పుడు ఆబిడ్స్, కోఠి, అంబర్‌పేట, చిక్కడపల్లి, ఆర్టీసీక్రాస్‌రోడ్స్, నారాయణగూడ, లిబర్టీ ప్రాంతాల్లోనూ నిర్వహిస్తున్నాం. డ్రంకెన్‌డ్రైవ్ కేసులో పట్టుబడి జైలుకెళితే భవిష్యత్తులో వారికి పాస్‌పోర్టు, వీసా, ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చే సందర్భాల్లో ఈ కేసులు ప్రభావం చూపించనున్నాయి.

'గుర్తింపు'తో దోచేస్తున్నారు..!

- పర్యవేక్షణ పట్టించుకోని విశ్వవిద్యాలయాలు
- సీట్లు అమ్మేసుకొని సొమ్ము చేసుకుంటున్న కళాశాలలు
- రోడ్డున పడుతున్న విద్యార్థులు



దిల్‌సుఖ్‌నగర్‌లోని అర్యన్ కళాశాల

ఈనాడు, హైదరాబాద్

భాగ్యనగరంలో కళాశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.. వాటి పరిస్థితి కనీసం ఆరా తీయకుండా విశ్వవిద్యాలయాలు అనుబంధ గుర్తింపు ఇస్తున్నాయి. గుర్తింపు తీసుకొన్నదే తడవుగా ఆయా కళాశాలల యజమానులు.. విద్యార్థులకు సీట్లు అమ్మేసుకొని రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. కొంతకాలం సాఫీగా నడిపి ఎవరికి అనుమానం రాకుండా రాత్రికిరాత్రే గుట్టుచప్పుడు కాకుండా బోర్డు తిప్పేస్తున్నారు. డబ్బులు చెల్లించిన విద్యార్థుల చదువు అర్థాంతరంగా ఆగిపోయి రోడ్డున పడుతున్నారు. హైదరాబాద్ గ్రేటర్ పరిధిలో ఈ తరహా సంఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. తాజాగా దిల్‌సుఖ్‌నగర్‌లోని ఆర్యన్ కళాశాలలోనూ ఇదే జరిగింది. ఈ కళాశాలకు ఉస్మానియా విశ్వవిద్యాలయం అనుబంధ గుర్తింపు ఇచ్చింది. దీంతో ఆ కళాశాల కరపత్రాలు, ప్రచారాలకు ఉస్మానియా లోగోను ప్రముఖంగా వినియోగించుకుంది. వీటిని పలుప్రాంతాలకు చెందిన విద్యార్థులు చూసి ఆకర్షితులయ్యారు. ఆయా కోర్సులకుగాను ఒక్కొక్క సీటుకు రూ.40 వేల నుంచి రూ.60వేలు వరకు చెల్లించారు. కొన్నేళ్ల నుంచి కళాశాల నడుస్తుండటాన్ని చూసి.. చాలామంది విద్యార్థులు ఏటా చేరుతున్నారు. ఒకరిని చూసి మరొకరు ఆకర్షితులవుతున్నారు. కళాశాలలో చేరే వారి సంఖ్య ఏటా పెరుగుతూ వచ్చింది. రూ.కోట్లు ఆర్జించి ఎవరికీ అనుమానం రాకుండా రాత్రికి రాత్రి బోర్డు తిప్పేసారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. అర్థాంతరంగా మా చదువులు ఆగిపోయాయని, అప్పులు చేసి కట్టిన సొమ్ముతో ఆ కళాశాల యజమాని కనిపించకుండా పోయాడని విద్యార్థులు మలక్‌పేట పోలీసులను ఆశ్రయించారు. ఇలా ఏటా నగరంలో పలు కళాశాలలు బోర్డు తిప్పేసి విద్యార్థులను నట్టేట ముంచేస్తున్నాయి.

ఆ గుర్తింపు చూసే చేరికలు..: ఉన్నత విద్య పూర్తి చేసి కొలువు దక్కించుకోవాలని ఎన్నో ఆశలతో విద్యార్థులు నగరంలోని ఆయా కళాశాలల్లో చేరుతున్నారు. వాటిల్లో చేరేముందు ఆయా కళాశాలలకు గుర్తింపు ఉందా? లేదా? ఏ విశ్వవిద్యాలయం నుంచి అనుబంధ గుర్తింపు తీసుకొంది అనే సమగ్ర విషయాలను విద్యార్థులు ఆరా తీస్తున్నారు. ఈ నేపథ్యాన్ని కళాశాలలు గుర్తించి.. ఆయా వర్సిటీలను ఆశ్రయిస్తున్నాయి. వాటి నుంచి గుర్తింపు పొందేందుకు లేనిది ఉన్నట్లు చూపించేస్తున్నాయి. అన్ని హంగులు, ఆర్భాటాలను ప్రదర్శిస్తున్నాయి. ఏదో విధంగా ఆయా వర్సిటీల నుంచి అనుబంధ గుర్తింపు పొందుతున్నాయి. అక్కడ నుంచి అక్రమాలకు పలు కళాశాలలు తెరలేపుతున్నాయి. వర్సిటీ లోగోను ప్రముఖంగా ముద్రించి ప్రచారాలను సాగిస్తున్నాయి. వర్సిటీ గుర్తింపు ఉండటాన్ని చూస్తున్నారు. పట్టా ఏ వర్సిటీ నుంచి జారీ అవుతుందని ఆరా తీసి మరీ ఆయా కళాశాలల్లో చేరుతున్నారు. రూ. లక్షలు ఫీజులు చెల్లించిన విద్యార్థులు ఆయా కళాశాలల్లో చదువుకుంటున్నారు. చివరికి ఎవరికీ అనుమానం రాకుండా ఆయా కళాశాలలు మూసేస్తున్నారు.

ప్రభుత్వ వర్సిటీల తీరు ఇంతేనా..?

ఇంజినీరింగ్, ఫార్మసీ, యూజీ, పీజీ తదితర కోర్సులను అందించే కళాశాలలకు నగరంలోని ఆయా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు అనుబంధ గుర్తింపును ఇస్తుంటాయి. వీటిని ఇచ్చేముందు భవనం, గ్రంథాలయం, తరగతి గదులు, అధ్యాపకులు తదితర అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తుంటాయి. ఇవన్నీ సక్రమంగా ఉన్నాయని వర్సిటీ అధికారులు చూసిన తర్వాతే ఆయా కళాశాలలకు అనుబంధ గుర్తింపును ఇస్తారు. ఇక్కడ వరకు బాగానే ఉంది. ఒకసారి గుర్తింపు ఇచ్చేసిన తర్వాత ఆయా కళాశాలల పరిస్థితిని పరిశీలించడంలో ఆయా వర్సిటీలు విఫలమవుతున్నాయనే విమర్శ ఉంది. సీట్లు అమ్మేసుకొని సొమ్ము చేసుకొని తరగతులు సక్రమంగా నిర్వహించకుండానే పలు కళాశాలలు నగరంలో నడుస్తున్నాయని విద్యార్థులు వివరిస్తున్నారు. నగరంలో ఉస్మానియా, జేఎన్‌టీయూహెచ్‌ల గుర్తింపుతోనే వందలాది కళాశాలలు నడుస్తున్నాయి. వీటి గుర్తింపు రద్దు చేసి విద్యార్థులను అప్రమత్తం చేస్తే ఎవరికి ఎలాంటి నష్టం జరగకుండా ఉంటుందని వారు సూచిస్తున్నారు.



ఇటీవల హార్డ్‌వేర్ పార్క్‌లో ప్రారంభించిన మిస్సైల్స్ విడిభాగాల తయారీ కేంద్రం

350 పరిశ్రమలు

రూ.13 వేల కోట్ల పెట్టుబడులు..

2 లక్షల ఉద్యోగాలు

నగర శివారులకు పెట్టుబడుల జోరు

పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తుల వెల్లువ

ఈనాడు-హైదరాబాద్

నగర శివారుల్లో వివిధ పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తులు జోరందుకుంటున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా సగటున నెలకి పది దరఖాస్తుల వరకూ వస్తున్నాయి. టీఎస్ఐపాస్ విధానం అమలు పరిచిన తరవాత చూస్తే పరిశ్రమలు పెట్టేందుకు అనూహ్యంగా అనుమతుల కోసం దాదాపు 350 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఇప్పటి వరకూ 80 పరిశ్రమలు ఉత్పత్తి బాట కూడా పట్టాయి. సరూర్‌నగర్, మహేశ్వరం, షాద్‌నగర్‌లో మూడు భారీ పరిశ్రమలు ఏర్పాటై ఉత్పత్తులు ప్రారంభించడం గమనార్హం. గత ఏడెనిమిది ఏళ్లలో ఎప్పుడూ ఈ స్థాయిలో దరఖాస్తులు రాలేదని అధికారులు చెబుతున్నారు. అలాగే ఇప్పుడు తాజాగా మరో నిర్ణయం వెలువడింది. కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసిన వారికి ప్రభుత్వం నుంచి వివిధ రకాల రాయితీలు లభించే విషయం తెలిసిందే. తాజాగా తీసుకున్న నిర్ణయం మేరకు ఈ రాయితీలు పొందేందుకు పరిశ్రమల అధిపతులు.. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలూ పరిశ్రమల కేంద్రం చుట్టూ రోజుల తరబడి తిరగాల్సిన పని లేదు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే.. నెల రోజుల్లోగా రాయితీలకు సంబంధించి మంజూరు పత్రం ఇవ్వాల్సి ఉంటుంది..

నెల రోజుల్లో రాయితీ మంజూరు ఉత్తర్వులు

పరిశ్రమలు ఏర్పాటు చేసిన పారిశ్రామికవేత్తలకు వివిధ రకాల రాయితీలు లభించే విషయం తెలిసిందే. ఇందులో ప్రధానంగా యంత్రాలపై పెట్టుబడి రాయితీ, అమ్మకపు పన్ను రాయితీ, రిజిస్ట్రేషన్ రుసుము, విద్యుత్తు బిల్లుల్లో రాయితీల్లాంటివి పొందేందుకు అవకాశం ఉంది. అయితే వీటి కోసం పారిశ్రామికవేత్తలు మీ సేవలో దరఖాస్తు చేసుకొని సంబంధిత పత్రాలతో పరిశ్రమల శాఖ అధికారుల చుట్టూ రాయితీ మంజూరు కోసం తిరగాల్సి వచ్చేది. అయితే తాజాగా ఈ పద్ధతికి స్వస్తి చెప్పి ఈ విధానాన్ని సరళీకరించారు. పరిశ్రమ అధిపతి తన దరఖాస్తును, సంబంధిత పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది. ఆ తరవాత దీనిని జీఎం స్థాయి అధికారి పరిశీలించి సంబంధిత క్షేత్రస్థాయి అధికారి పరిశీలనకు పంపుతారు. ఆయన పరిశీలించిన తరవాత తిరిగి ఆన్‌లైన్‌లోనే పరిశీలన వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. దీనిపై మళ్లీ జీఎం పరిశీలించి అన్నీ అనుకూలంగా ఉంటే వెంటనే ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ మొత్తం నెల రోజుల్లోనే పూర్తి చేసి రాయితీ పొందేందుకు అనుమతి పత్రాలు ఇవ్వాలి. అలాగే రాయితీ కోసం దరఖాస్తు చేసిన తరవాత దాని పరిస్థితి (స్టేటస్) ఏమిటన్నది కూడా ఆన్‌లైన్‌లో పరిశీలించుకునే సౌలభ్యం కల్పించారు. దీనివల్ల అక్రమాలకు ఆస్కారం తగ్గడమే కాకుండా రాయితీ మంజూరు ఉత్తర్వుల కోసం నెలల తరబడి తిరిగే సమస్య తప్పుతుంది.

పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం: జీఎం

నగర శివారుల్లో మౌలిక సదుపాయాలతో పాటు ప్రభుత్వ సానుకూల విధానాల కారణంగా పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికులు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారని పరిశ్రమల శాఖ జీఎం రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు. దరఖాస్తు వచ్చిన వెంటనే వివిధ రాకల అనుమతులు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, తాజాగా పెట్టుబడుల రాయతీ కోసం దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరించి నెల రోజుల్లోనే ముంజూరు లేఖలు ఇవ్వడం వల్ల పారిశ్రామికవేత్తలకు మరింత ప్రోత్సాహకరంగా ఉంటోందని చెప్పారు.



పరిశ్రమలకు కేటాయించేందుకు భూములు సర్వే చేస్తున్న దృశ్యం

ఉపాధికి అవకాశాలు..


నగర శివారులో రంగారెడ్డిజిల్లా పరిధిలో ఇప్పటికే ఉన్న పారిశ్రామికవాడలతోపాటు కొత్తగా ఏర్పాటవుతున్న మరికొన్ని పారిశ్రామిక ప్రాంతాల్లో (ఎలక్ట్రానిక్ సిటీ, ఫార్మాసిటీ) గత ఏడాదిన్నర..రెండేళ్ల నుంచి పరిశ్రమల ఏర్పాటు కోసం అనేక మంది ఆసక్తి చూపుతున్నారు. ఒకవైపు అనుకూలమైన పారిశ్రామిక విధానం ఉండటంతోపాటు నగరానికి చేరువగా ఉండటం.. విద్యుత్తు సమస్య పరిష్కారం కావడం.. పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు టీఎస్ఐఐసీ కూడా వేగంగా స్పందిస్తుండటం లాంటి కారణాల వల్ల పరిశ్రమలు పెట్టేందుకు ముందుకొచ్చే వారి సంఖ్య పెరుగుతోందని అధికారులు విశ్లేషిస్తున్నారు. రెండేళ్ల క్రితం నాటికి జిల్లా పరిధిలో మొత్తం పరిశ్రమల పెట్టుబడి సుమారు రూ.9 వేల కోట్లు పెట్టుబడులు కాగా ఈ రెండేళ్ల వ్యవధిలోనే దాదాపు రూ.13 వేల కోట్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు దరఖాస్తులు చేసి అనుమతులు తీసుకున్నారు.

ఇందులో దాదాపు 80 పరిశ్రమల ఏర్పాటు కూడా పూర్తయింది. షాద్‌నగర్ ప్రాంతంలో ప్రాక్టర్ అండ్ గ్యాంబెల్, మేడ్చల్ నియోజకవర్గంలో శ్రీనాథ్ రొటోప్యాక్స్, మహేశ్వరంలో మైక్రోమ్యాక్స్ కంపెనీలు ఉత్పత్తులు కూడా ప్రారంభించాయి. ఇవి భారీ పరిశ్రమల కోవకు చెందినవి కావడం గమనార్హం. అయితే అనుమతులు తీసుకున్న దరఖాస్తుదారులు పరిశ్రమల నిర్మాణాలు పూర్తి చేసేందుకు మరో ఏడాది వరకూ పడుతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం అధికారులు పరిశ్రమల నిర్మాణ పనులపై ఆరా తీస్తున్నారు. రెండు మూడు రోజుల్లో పూర్తి స్పష్టత వస్తుందని పరిశ్రమల శాఖ జీఎం రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ పరిశ్రమలన్నీ ఏర్పాటయితే ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ 2 లక్షల మందికి ఉపాధి లభిస్తుందన్నారు.

కోటలో సీఎం కాన్వాయ్ రిహార్సల్స్

గోల్కొండ, న్యూస్‌టుడే: గోల్కొండ కోటలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం 9.45గంటలకు ఈ ప్రాంతంలో సంబంధిత అధికారులు ముఖ్యమంత్రి కాన్వాయ్ రిహార్సల్స్ నిర్వహించారు. ప్రగతిభవన్ నుంచి మెహిదీపట్నం మీదుగా లంగర్‌హౌస్, రామ్‌దేవ్‌గుడాల నుంచి సీఎం కాన్వాయ్ వాహనశ్రేణిలో ఇంటలిజెన్స్ ఐజీ ఎం.కే.సింగ్ గోల్కొండకు చేరుకున్నారు. కోట ప్రధాన ద్వారం వద్ద ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎస్.పి.సింగ్ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం వాహనశ్రేణి రాణీమహల్ ప్రాంగణంలోని జెండా ఎగురవేయనున్న ప్రాంతానికి చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన స్టేజి మీదుకు వెళ్లిన ఎం.కే.సింగ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీసులు పరేడ్ నిర్వహించారు. అనంతరం వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన పోలీసులు, ఇతర విభాగాల అధికారులకు పతకాలు అందజేశారు.

ఆశ చూపి.. వల వేసి!



ఒక్కో రైస్ పుల్లింగ్ వస్తువురూ.2 వేల కోట్ల నుంచి 5 వేల కోట్లు పలుకుతుందంటూ కేటుగాళ్లు మాయ చేస్తున్నారు. వారి మాటలు నమ్మినవారిని నట్టేట ముంచేస్తున్నారు. ఇలాంటి ఘటనలు నగరంలో క్రమంగా విస్తరిస్తున్నాయి.

- **రాత్రికి రాత్రే కోటీశ్వరులు కావచ్చంటూ బురిడీ**
- **ఆర్.పి.ల పేరిట పెరుగుతున్న మోసాలు**

రైస్ పుల్లింగ్(ఆర్.పి) వస్తువుల పేరిట నగరంలో భారీ ఎత్తున మోసాలు జరుగుతున్నాయి. ప్రజలను మభ్యపెట్టి రూ.లక్షలు వసూలు చేస్తున్న అనేక మందిని తరచూ పోలీసులు అరెస్టు చేస్తున్నప్పటికీ ఇలాంటి మోసాలు కొనసాగుతూనే ఉన్నాయి.

న్యూస్‌టుడే, హైదరాబాద్

ఆర్.పి వస్తువులు ఎంతో ప్రత్యేకమైనవని, వాటికి ఎనలేని లక్షణాలు ఉంటాయని, వాటి విలువ రూ.వేల కోట్లల్లో ఉంటుందని వ్యూహాత్మకంగా ప్రచారం చేస్తూ కొంతమంది బృందాలుగా ఏర్పడి మోసాలకు పాల్పడుతున్నారు. ఏజెంట్ల ద్వారా ధనవంతులతో పరిచయాలు పెంచుకొని సునాయాసంగా రాత్రికి రాత్రి రూ.కోట్లు సంపాదించవచ్చునని నమ్మించి నట్టేట ముంచుతున్నారు. మోసపోతున్న వారిలో విద్యావంతులు, బడావ్యాపారులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు కూడా ఉంటున్నారు. దీంతో బయటకు చెప్పుకుంటే పరువుపోతుందని కొంతమంది పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. మరికొందరు ధైర్యం చేసి ఫిర్యాదు చేయడంవల్ల ఇలాంటి విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

తేలికగా సంపాదించాలనే తపన..

తేలికగా డబ్బులు సంపాదించాలన్న తపన ఈమధ్య కాలంలో ప్రజలలో బాగా పెరిగింది. పెద్దగా పెట్టుబడి అవసరం లేకుండా, అవసరమైన మేరకు సమయం వెచ్చిస్తే చాలు రూ.కోట్లు చేజిక్కించుకోవచ్చునని భావిస్తున్న వారు పెరుగుతున్నారు. ఏ వస్తువునైనా తాకగానే బంగారంగా మార్చగలిగే పరసువేది వంటి వస్తువు దొరికితే తమ దశ మారిపోతుందని, ఆర్.పి. లభిస్తే తమ కలలన్నీ ఒక్కరాత్రిలోనే తీరిపోతాయన్న అతినమ్మకంతో కాలం వెళ్లదీస్తున్నారు. ఏరోజుకైనా తమ నిరీక్షణ ఫలించకపోతుందా అన్న ఊహాలలో సంవత్సరాలు గడిపేస్తున్నారు. డబ్బుతోపాటు విలువైన సమయం వృథా అయిన విషయాన్ని గుర్తిస్తున్న కొందరు ఆ ప్రయత్నాలను విరమించుకుంటే, చాలామంది ఇంకా అదే భ్రమలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇటువంటి వారు జంటనగరాలలోని ఇరానీ హోటళ్లు, పార్కులు, రైల్వేస్టేషన్‌లలో కనిపిస్తుంటారు. ఆర్.పి.ల కోసం ప్రయత్నిస్తున్నవారు నగరంలోనే వేలసంఖ్యలో ఉంటారని అంచనా..

ఆర్.పి అంటే

పిడుగు పడినప్పుడు ఆ ప్రాంతంలో భూమిలో పాతిపెట్టిన రాగి నాణెలు, పాత రాగి వస్తువులు అపార శక్తిని పొందుతాయని, ఇలాంటి వస్తువులనే ఆర్.పి అంటారని ఈ వ్యాపారం చేసేవారు చెబుతుంటారు. ఈ శక్తిగల ఆర్.పి.కి బియ్యాన్ని ఆకర్షించే తత్వం ఉంటుందని, ఎంతదూరం నుంచి బియ్యాన్ని లాగితే అన్ని రూ.వేల కోట్లలో ధర పలుకుతుందని నమ్మిస్తారు. క్షిపణుల తయారీలో ఉపయోగించే ఆర్.పి. వస్తువులను అందించే వారికి ప్రభుత్వ సంస్థలే విడతల వారీగా రూ.వేల కోట్లు చెల్లిస్తారని గట్టిగా భరోసా కల్పిస్తారు. ఒక్క ఆర్.పి.కి దాని శక్తిని బట్టి రూ.2వేల కోట్లు మొదలు కొని రూ.5 వేల కోట్లు ధర పలుకుతుందని, పైగా ఆ డబ్బంతా వైట్ మనీయేనని నమ్మించే ప్రయత్నం చేస్తారు. చింతచెట్టుకు కాసే చింత భజనిక, ఎర్ర సొర కాయలకు ఇలాంటి శక్తి ఉంటుందని, వాటికీ పెద్ద మొత్తంలోనే డబ్బు వస్తుందన్న ప్రచారంతో వాటికోసం అన్వేషిస్తున్నవారు చాలామందే ఉన్నారు.

అన్వేషణ ఆశ చూపి..

ఫలానా చోట ఆర్.పి. ఉందన్న సమాచారం పరిచయస్థుల నుంచి చరవాణి ద్వారా అందగానే దానికోసం మొదలయ్యే అన్వేషణ నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. ఆర్.పి. వేటలో ఒకరినుంచి మరొకరికి లింకు కలుస్తుంది. ఒకరిద్దరు నేతృత్వం వహించే ఈ లింకులో ఐదుగురి నుంచి పాతికమంది వరకు ఉండే అవకాశముంది. గతంలో లంగర్‌హౌస్ ప్రాంతంలో తనవద్ద రాగితో తయారు చేసిన కెటిల్ ఉందని, దానికి టెస్టింగ్ చేయించాలని పలువురి వద్ద నుంచి రూ.లక్షలు వసూలు చేశాడు. డబ్బులిచ్చిన వారి ఒత్తిడి మేరకు అమీర్‌పేటలో పరీక్ష జరిపితే అది కాస్తా నకిలీదని తేలింది. ఈ రకంగా అతడు చాలామందిని మోసం చేసినట్లు తెలిసింది. ఆర్.పి కోసం జంటనగరాలు, శివారు ప్రాంతాలే కాకుండా పొరుగు రాష్ట్రాలకు సైతం వెళ్లవలసి ఉంటుంది. ఇందుకయ్యే ఖర్చులను, లింకులకు నేతృత్వం వహించే వారి ఖర్చులను సైతం సభ్యులే భరించవలసి ఉంటుంది. అంతంత దూరం వెళ్లినా ఆ వస్తువు మరోచోట ఉందన్న సమాచారం వస్తుంది. రూ.వేల కోట్లు విలువచేసే ఆర్.పిని భద్రత కారణాలతో సురక్షిత ప్రదేశంలో ఉంచారని, ఇంకోసారి వెళదామని నమ్మిస్తారు. ఆర్.పి. కలిగిఉన్న వ్యక్తి ఆచూకీ లభించిందని, ప్రత్యేక పరీక్షలు నిర్వహించాలని చెబుతారు. పరీక్ష నిమిత్తం దిల్లీ, బెంగళూరు నుంచి శాస్త్రవేత్తలు వస్తారని, వారి విమాన చార్జీలు, వసతి నిమిత్తం డబ్బు కావాలని వసూలు చేస్తారు. తీరా డబ్బులిచ్చినా పరీక్ష ఫెయిల్ అయిందని, ఆర్.పి నకిలీదిగా తేలిందని నచ్చజెబుతారు. ఈ రకంగా లింకుసభ్యుల వద్ద నుంచి, వారి పరిచయస్థుల నుంచి అయిన కాడికి పిండుకుంటారు.

- ఇంకొందరైతే ఎంతో శక్తిగల ఆర్.పి లభించిందని, దానిని కొనుగోలు చేసే పార్టీకి డిపాజిట్ చెల్లించేందుకు డబ్బులు కావాలని వసూలు చేస్తున్నారు. రూ.25 లక్షలు చెల్లించాల్సి ఉండగా రూ.20 లక్షలు కట్టామని, మరో ఐదులక్షలు చెల్లిస్తే కొద్దిరోజుల్లోనే రూ.కోట్లు పొందవచ్చునని నమ్మబలికి వీలైనంత మేరకు దండుకుంటున్నారు. తమ ప్రయత్నం ఫలించకున్నా రూ.10-20 వడ్డీ కలిపి ఇస్తామని భరోసా కల్పిస్తున్నారు. తెలిసిన వారి వద్ద నుంచి ఇప్పించినా ఇద్దరికి కమిషన్ ఇస్తామని నానా విధాలా ఒప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. వారి మాయలోపడి ఎందరో తమ డబ్బులతో పాటు, ఇతరుల ధనాన్ని ఇప్పించిన వారున్నారు. ఎంతకూ పెద్దమొత్తంలో నగదు రాకపోవడంతో, ఇచ్చిన డబ్బులు వస్తే చాలని ఎదురు చూస్తున్నారు.



ఆధునిక కాలంలో సార్వభౌమ దేశాలన్నింటిలోనూ కేంద్ర బ్యాంక్‌ను ఒక ముఖ్య ద్రవ్య సంస్థగా భావిస్తున్నారు. ఆ దేశాల్లో జరిగే అన్ని బ్యాంకింగ్ కార్యకలాపాలను అది నియంత్రిస్తుంది. దేశ ఆర్థిక విధానాలను అమలు పరచడంలో కేంద్ర బ్యాంకు ప్రముఖ పాత్ర వహిస్తుంది. మన దేశంలో స్వాతంత్ర్యానంతరం ప్రణాళికాబద్ధమైన ఆర్థికాభివృద్ధిని త్వరితగతిన సాధించడానికి ప్రభుత్వ స్వాధీనంలో ఉండే కేంద్ర బ్యాంక్ అవసరమని భావించి, ఆర్‌బీఐని ఏర్పాటు చేశారు.

ప్రతిభ

అంతిమ రుణదాత ఎవరు...?

జనరల్ స్టడీస్
ఇండియన్ ఎకానమీ



రచయిత
-సి.హెచ్.వెంకట్ రెడ్డి
అసిస్టెంట్ ప్రొఫెసర్

భారత రిజర్వ్ బ్యాంక్, ద్రవ్య విధానం

ఆర్థిక వ్యవస్థ ఉత్పాదక రంగంలో అవసరమైన పెట్టుబడులను పొదుపు ద్వారా సమీకరించడంలో బ్యాంకులు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలకు అవసరమైన పెట్టుబడులను అందించడానికి వాణిజ్య బ్యాంకులు పరపతిని సృష్టిస్తున్నాయి. ఈ ప్రక్రియలో అప్పుడప్పుడు వ్యాపార కార్యకలాపాల్లో వచ్చే ఒడిదొడుకుల ఫలితంగా వ్యాపార చక్రాలు ఏర్పడతాయి. ద్రవ్యోల్బణం, నిరుద్యోగ సమస్యలు కూడా తలెత్తుతాయి. ధరల స్థాయిల్లోని ఒడిదొడుకులను అదుపులో పెట్టడానికి పరపతి, ద్రవ్య పరిమాణాలను నియంత్రించడం అవసరం. కాగితపు ద్రవ్యం, దాని మార్పిడి రేటును స్థిరీకరించడం కూడా అవసరం. తద్వారా మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థ, ద్రవ్య వ్యవస్థ చివరికి ఆర్థికాభివృద్ధికి దారితీయాలి. దీన్ని సాధించడానికి, బ్యాంకింగ్ వ్యవస్థను నియంత్రించడానికి అధికారం కలిగి ఉన్న అత్యున్నత సంస్థ అవసరం. భారతదేశంలో భారత రిజర్వ్ బ్యాంక్ అనే కేంద్ర బ్యాంకు ఈ కార్యకలాపాలను నిర్వహిస్తుంది.

పుట్టు పూర్వోత్తరాలు

మొట్టమొదటి కేంద్ర బ్యాంక్ 1656 లో స్వీడన్ రిక్స్ బ్యాంకు స్థాపనతో మొదలైనా, కేంద్ర బ్యాంక్ అనే భావన ఈ మధ్యకాలంలో బాగా ప్రసిద్ధి చెందింది. 1694 లో స్థాపించిన 'బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్' ఒక కేంద్ర బ్యాంక్ నిర్వహించాల్సిన అన్ని విధులను నిర్వహించింది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌ను అనుసరించి 19 వ శతాబ్దంలో యూరప్‌లో మరెన్నో కేంద్ర బ్యాంకులు పుట్టుకొచ్చాయి.

1800 లో స్థాపించిన 'బ్యాంక్ ఆఫ్ ఫ్రాన్స్' దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అన్ని కార్యకలాపాలను నిర్వహించింది. బ్యాంక్ ఆఫ్ నెదర్లాండ్స్‌ను 1814 లో, 'బ్యాంక్ ఆఫ్ రష్యా'ను 1860 లో ఏర్పాటు చేశారు. దేశీయ ద్రవ్య పద్ధతిని క్రమపరచడానికి 1882 లో 'బ్యాంక్ ఆఫ్ జపాన్'ను స్థాపించారు. 'ఇటలీ సెంట్రల్ బ్యాంకు' 1893 లో ఏర్పడగా, స్విస్ జాతీయ బ్యాంకు 1907 లో స్థాపితమైంది. ప్రపంచంలో అతి పెద్ద పెట్టుబడిదారీ దేశమైన అమెరికాలో 'ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్'ను 1913 లో, కెనడాలో 1934 లో స్థాపించారు.

1920 లో బ్రెస్సెల్స్‌లో జరిగిన అంతర్జాతీయ విత్త సమావేశంలో కేంద్ర బ్యాంకు లేని దేశాల్లో వీలైనంత తొందర్లో కేంద్ర బ్యాంకులను స్థాపించాలని తీర్మానించారు. దీనికి అనుగుణంగా చాలా దేశాల్లో కేంద్ర బ్యాంకులను స్థాపించారు.

కేంద్ర బ్యాంకు నిర్వచనం

కేంద్ర బ్యాంకు నిర్వచనం అది నిర్వహించే విధులను అనుసరించి ఉంటుంది. కేంద్ర బ్యాంకు విధులు వివిధ దేశాల్లో వివిధ రకాలుగా ఉంటాయి. ఒకే దేశంలో వివిధ కాలాల్లో వివిధ రకాలుగా ఉంటాయి. అందువల్ల కేంద్ర బ్యాంకుకు అందరికీ ఆమోదయోగ్యమైన నిర్వచనాన్ని ఇవ్వడం కష్టం.

- కేంద్ర బ్యాంకు ప్రధానమైన విధి స్థిరత్వాన్ని కాపాడటం. అంటే ద్రవ్య ప్రవాహాన్ని నియంత్రించడం. - కిష్, ఎల్‌కిన్
- ప్రజల శ్రేయస్సు దృష్ట్యా ఆర్థిక వ్యవస్థలోని ద్రవ్య పరిమాణాల పెరుగుదల, తరుగుదలను అజమాయిషీ చేయడం కేంద్ర బ్యాంకు ముఖ్య విధి - కెంట్
- కేంద్ర బ్యాంకు అనేది వాణిజ్య బ్యాంకులకు అంతిమంగా రుణాలిచ్చి ఆదుకునే వ్యవస్థ - హాత్రే
- ద్రవ్య విధానాన్ని అమలు పరచడం కేంద్ర బ్యాంకు ముఖ్యవిధి - సేయర్స్
- కేంద్ర బ్యాంకు ద్రవ్య, బ్యాంకింగ్ నిర్మాణంలో శిఖరం ఆక్రమిస్తున్న బ్యాంకు. ఇది కరెన్సీ నోట్లను జారీ చేయడంలో గుత్తాధిపత్యాన్ని కలిగి ఉండటంతోపాటు అంతిమ రుణదాతగా వ్యవహరిస్తుంది - డికాక్

భారత రిజర్వ్ బ్యాంక్

* భారతదేశ కేంద్ర బ్యాంక్ రిజర్వ్ బ్యాంక్. దీన్ని RBI చట్టం 1934 కు అనుగుణంగా 1935 ఏప్రిల్ 1 న రూ.5 కోట్ల మూలధనంతో వాటాదార్ల బ్యాంకుగా (Share holders bank) స్థాపించారు.
* 1949 జనవరి 1 న రిజర్వ్ బ్యాంక్‌ను జాతీయం చేశారు. ప్రారంభంలో రిజర్వ్ బ్యాంక్ కేంద్ర కార్యాలయం కలకత్తాలో ఉండేది. 1937 లో దీన్ని శాశ్వతంగా ముంబయికి మార్చారు. సమర్థవంతంగా విధులను నిర్వహించడానికి వీలుగా కోల్‌కతా, దిల్లీ, బెంగళూరు, నాగ్‌పూర్, చెన్నై, హైదరాబాద్, పట్నా నగరాల్లో శాఖలను ఏర్పాటు చేశారు. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. నలుగురికి మించకుండా ఉపగవర్నర్లు ఉంటారు. ఆర్‌బీఐ ప్రస్తుత గవర్నర్ ఉర్జిత్ పటేల్.

ఆర్‌బీఐ లక్ష్యాలు

ఎ) కరెన్సీని క్రమబద్ధం చేయడం
బి) ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య స్థిరత్వాన్ని, సుస్థిరతను సాధించడం
సి) పటిష్టమైన ద్రవ్య విధానాన్ని అమలుపరుస్తూ, పరపతిని నియంత్రించడం ద్వారా ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం.
డి) దేశంలో వాణిజ్య బ్యాంకులకు స్నేహితుడిగా, తత్వవేత్తగా, మార్గదర్శకుడిగా వ్యవహరించడం.
ఇ) దేశవ్యాప్తంగా ఒకే రీతిలో పరపతి విధానాన్ని అమలు చేయడం.
ఎఫ్) దేశ ఆర్థిక, కోశ విధానాల్లో ప్రభుత్వానికి సలహాదారుగా వ్యవహరించడం.

ఆర్‌బీఐ విధులు

ఆదర్శమైన ఒక కేంద్ర బ్యాంక్ నిర్వహించే అన్ని ప్రాచీన, ఆధునిక విధులను భారత రిజర్వ్ బ్యాంక్ నిర్వహిస్తుంది. భారత రిజర్వ్ బ్యాంక్ చట్టం 1934 ప్రకారం ఆర్‌బీఐ ఈ కింది విధులను నిర్వహిస్తుంది.

1. ద్రవ్యాన్ని ముద్రించి, చలామణీ చేసే గుత్తాధిపత్యం:

భారత రిజర్వ్ బ్యాంక్ చట్టం 1934 సెక్షన్ 22 ప్రకారం కరెన్సీ నోట్లను ముద్రించే గుత్తాధిపత్య అధికారం భారత రిజర్వ్ బ్యాంకుకు ఉంటుంది. రెండు రూపాయల కరెన్సీ నుంచి రూ.2 వేల నోట్ల వరకు ఆర్‌బీఐ ముద్రించి, పంపిణీ చేస్తుంది.

* ఒక రూపాయి నోటు, ఒక రూపాయి నాణేలను భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేసినా, వాటి పంపిణీ బాధ్యత మాత్రం ఆర్‌బీఐదే.
* 1956 కు ముందు ఆర్‌బీఐ కరెన్సీ నోట్ల జారీకి అనుపాత నిల్వల పద్ధతిని పాటించింది. 1956 లో అనుపాత నిల్వల పద్ధతిని రద్దు చేసి, 'కనిష్ఠ నిల్వల పద్ధతి' (Minimum Reserve System) ప్రవేశపెట్టింది.
* కరెన్సీ జారీకి రూ. 400 కోట్లు కనీస నిల్వలుగా నిర్ణయించారు. ఇందులో రూ.200 కోట్ల మేర బంగారం, రూ.200 కోట్ల విదేశీ మారక ద్రవ్యం ఉండాలి. 1957 లో కరెన్సీ నిల్వల పరిమాణాన్ని రూ.400 కోట్ల నుంచి రూ. 200 కోట్లకు తగ్గించారు. ఇందులో రూ. 115 కోట్ల మేరకు బంగారం నిల్వలు, రూ. 85 కోట్ల మేరకు విదేశీ మారక ద్రవ్యం ఉండాలి.

2. ప్రభుత్వ బ్యాంకు:

ఆర్‌బీఐ నిర్వహించే రెండో ముఖ్య విధి- ప్రభుత్వ బ్యాంకుగా వ్యవహరించడం. కేంద్ర ప్రభుత్వానికి, జమ్మూ కశ్మీర్ రాష్ట్రాన్ని మినహాయించి మిగిలిన అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రభుత్వ బ్యాంకుగా, ప్రభుత్వ ఏజెంటుగా ఇది వ్యవహరిస్తుంది. ఆర్థిక, ద్రవ్య విధానాల విషయాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సలహాదారుగా ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరఫున రుణాలను స్వీకరిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు 90 రోజుల కాలపరిమితితో స్వల్పకాలిక రుణాలను మంజూరు చేస్తుంది. వీటిని 'వేస్ అండ్ మీన్స్' అడ్వాన్స్ అంటారు. కొన్ని అత్యవసర పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఓవర్ డ్రాఫ్టు సౌకర్యాన్ని కూడా కల్పిస్తుంది.

3. బ్యాంకులకు బ్యాంకు:

వాణిజ్య బ్యాంకులకు నాయకత్వం వహించి, వాటి కార్యకలాపాలను నియంత్రిస్తుంది. వాణిజ్య బ్యాంకులు తమ లావాదేవీలను ఎప్పటికప్పుడు ఆర్‌బీఐకి పంపాల్సి ఉంటుంది. ఒక కొత్త బ్యాంకు ఆవిర్భవించాలన్నా, ఒక కొత్త శాఖను ఏర్పాటు చేయాలన్నా వాణిజ్య బ్యాంకులు ఆర్‌బీఐ నుంచి లైసెన్సు పొందాల్సి ఉంటుంది.

4. అంతిమ రుణదాత:

అర్హత కలిగిన బిల్లులను రీ-డిస్కౌంట్ చేయటం ద్వారా గానీ, అర్హమైన సెక్యూరిటీల మీద రుణాలు, అడ్వాన్సుల రూపంలో వాణిజ్య బ్యాంకులు రిజర్వ్ బ్యాంక్ నుంచి ఆర్థిక సహాయం పొందవచ్చు. బ్యాంకింగ్ వ్యవస్థలో సంక్షోభం ఏర్పడే పరిస్థితుల్లో వాణిజ్య బ్యాంకులను ఆదుకోవటానికి ఆర్‌బీఐ అందుబాటులో ఉంటుంది. అందుకే ఆర్‌బీఐని అంతిమ రుణదాత అంటారు.

5. పరపతి నియంత్రణ ద్వారా ఆర్థిక స్థిరత్వం:

వాణిజ్య బ్యాంకులు సృష్టించే పరపతి పరిమాణం ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణ, ప్రతిద్రవ్యోల్బణానికి దారితీసి ఒడిదొడుకులు ఏర్పడవచ్చు. పరిమాణాత్మక, గుణాత్మక పరపతి నియంత్రణ సాధనాలను ఉపయోగించడం ద్వారా ఆర్‌బీఐ పరపతి నియంత్రణ చేస్తుంది.

6. అంతర్జాతీయ ద్రవ్యనిధుల పరిరక్షణ:

విదేశీ ద్రవ్య వ్యవహారాలన్నీ ఆర్‌బీఐ ద్వారానే నడుస్తాయి. అంతర్జాతీయ చెల్లింపుల శేషంలో ఏర్పడే లోటును పూరించడానికి విదేశీ మారకంగా ఉపయోగించే బంగారు నిల్వలను, విదేశీమారక ద్రవ్య నిల్వలను పరిరక్షించడం ఆర్‌బీఐ విధుల్లో ఒకటి.

7. క్లియరింగ్ హౌస్‌ల నిర్వహణ:

బ్యాంకుల నిత్యావసరాల్లో పనులను సులభతరం చేసే నిమిత్తం కొన్ని ముఖ్య కేంద్రాల్లో ఆర్‌బీఐ క్లియరింగ్ హౌస్‌లను నిర్వహిస్తోంది. క్లియరింగ్ హౌస్‌ల ద్వారా జరిగిన వ్యవహారాల వల్ల ఏయే వాణిజ్య బ్యాంకులు ఎక్కువ రుణాలు ఇస్తున్నాయో ఆర్‌బీఐకి తెలుస్తుంది.

8. పర్యవేక్షక విధులు:

భారతదేశ బ్యాంకింగ్ వ్యవస్థలో రిజర్వ్ బ్యాంకు శిఖరాగ్ర సంస్థ. బ్యాంకింగ్ సంస్థలపై నియంత్రణ, పర్యవేక్షణ ద్వారా డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడుతుంది. ఆర్థిక వ్యవస్థలో మోసపూరిత కార్యకలాపాల నియంత్రణకు అవసరమైన విధివిధానాలను అమలుపరచడం ద్వారా బ్యాంకు నిధులు సమర్థవంతంగా ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడేలా చూస్తుంది.

9. అభివృద్ధిపరమైన విధులు:

భారతీయ రిజర్వ్ బ్యాంక్ అనేక అభివృద్ధిపరమైన, ప్రగతి పూర్వకమైన విధులను నిర్వహిస్తుంది. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి, అవస్థాపన సౌకర్యాల కల్పనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా అవసరమైన చర్యలను ఆర్‌బీఐ చేపడుతుంది.

* వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి కోసం 1963 లో వ్యవసాయ పునఃవిత్త కార్పొరేషన్‌ను, 1982 లో నాబార్డ్‌ను స్థాపించింది.
* పారిశ్రామికాభివృద్ధి సాధించడానికి 1948 లో భారత పారిశ్రామిక విత్త కార్పొరేషన్‌ను, 1953 లో రాష్ట్ర విత్త కార్పొరేషన్‌లు, 1964 లో భారత పారిశ్రామిక అభివృద్ధి బ్యాంకు (ఐడీబీఐ), భారతదేశ యూనిట్ ట్రస్ట్ (యూటీఐ)ను ఆర్‌బీఐ స్థాపించింది.

ఆర్‌బీఐ ద్రవ్యవిధానం

ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య పరిమాణం ముఖ్యంగా పరపతి రూపంలో బ్యాంకులు సృష్టించే ద్రవ్యం ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుంది. కానీ, అదే సమయంలో ద్రవ్యోల్బణం, స్పెక్యులేటివ్ కార్యకలాపాలకు, ఆదాయ అసమానతలు పెరగడానికి, వ్యాపార చక్రాలు ఏర్పడటానికి ద్రవ్య పరిమాణం కారణం అవుతుంది. కాబట్టి ఈ సమస్యలను అధిగమించి, నిర్దిష్ట లక్ష్యాలను సాధించడానికి భారత రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య విధానాన్ని అమలు చేస్తుంది.

ద్రవ్య విధానం ముఖ్య లక్ష్యాలు:

ఎ) ధరల స్థాయి నియంత్రణ, వ్యాపార చక్రాల నియంత్రణ
బి) సంపూర్ణ ఉద్యోగిత సాధించడం
సి) త్వరిత ఆర్థికాభివృద్ధికి తోడ్పడటం
డి) ఆదాయ అసమానతలు తగ్గించడం
ఇ) విదేశీ మారకపు రేట్ల స్థిరత్వానికి కృషి చేయడం
ఎఫ్) చెల్లింపుల శేషంలో సమతౌల్యం సాధించడం
జి) ప్రాంతీయ సమానాభివృద్ధికి కృషి చేయడం

ద్రవ్య విధాన/ పరపతి నియంత్రణ సాధనాలు

రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య పరిమాణం, ఉపయోగాలను నియంత్రించడానికి చేపట్టే విధానాన్నే 'ద్రవ్యవిధానం' అంటారు. ద్రవ్య విధాన సాధనాలు లేదా పరపతి నియంత్రణ సాధనాలు రెండు రకాలు: అవి.

1. పరిమాణాత్మక పరపతి నియంత్రణ సాధనాలు
2. గుణాత్మక పరపతి నియంత్రణ సాధనాలు

* పరిమాణాత్మక పరపతి నియంత్రణలో భాగంగా రిజర్వ్ బ్యాంక్ దేశంలో పరపతి పరిమాణాన్ని, ద్రవ్య సరఫరాను నియంత్రిస్తుంది.
* గుణాత్మక పరపతి విధానం అంటే పరపతి, ద్రవ్య సరఫరా ఉపయోగాన్ని నియంత్రించడం. దీనికోసం మార్జిన్లను మార్చడం, విచక్షణాత్మక వడ్డీరేటు, వినియోగదారుల పరపతి నియంత్రణ, పరపతి రేషనింగ్, నైతికోద్బోధ, ప్రత్యక్ష చర్యలు లాంటి విధానాలను ఆర్‌బీఐ పాటిస్తుంది.

IBPS - RRBs Recruitment

No. of Questions: 80 **Maximum Marks: 80** **Time: 45 Mts.**

ప్రతిభ

IBPS Officers Prelims Model Paper - 2017

Reasoning Ability

Directions (1-5): In each of the following questions, relationship between different elements is shown in the statements. The statements are followed by two Conclusions numbered I and II. Study the Conclusions based on the given statements and mark the appropriate answer: Give answer

1) If both the Conclusion I and Conclusion II are true
2) If either Conclusion I or Conclusion II is true
3) If neither Conclusion I nor Conclusion II is true
4) If only Conclusion I is true
5) If only Conclusion II is true

1. Statements: $A \le R \le N = G \ge T > S$

Conclusions: I. $A < S$ II. $A = S$

(2 - 3):

Statements: $C > R \le E = T$; $R < Y$; $U \ge E$

2. Conclusions: I. $C > Y$ II. $U \ge Y$

3. Conclusions: I. $U \ge R$ II. $T \le U$

(4-5):

Statements: $P \ge R = B \le S$; $C \le B > Z$

4. Conclusions: I. $Z = P$ II. $S \le Z$

5. Conclusions: I. $C < S$ II. $C = S$

Directions (6 - 7): These questions are based on the position of English alphabets.

6. Four of the following five are alike in a certain way and so form a group. Which is the one that does not belong to the group?

1) LOJ 2) FID 3) RUP 4) ILN 5) CFA

7. Which of the following will be the next letter in the following letter series?

B C E H L ?

1) Q 2) P 3) O 4) Cannot be determined 5) None of these

Directions (8 - 10): Study the following information to answer the given questions:

A building has seven floors numbered one to seven, in such a way that the ground floor is numbered one, the floor above it, number two and so on such that the topmost floor is numbered seven. One out of seven people viz. A, B, C, D, E, F and G lives on each floor. A lives on fourth floor. E lives on the floor immediately below F's floor. F does not live on the second or the seventh floor. C does not live on an odd numbered floor. B does not live on a floor immediately above or below C's floor. D does not live on the top-most floor. G does not live on any floor below E's floor.

8. Who lives on the topmost floor?

1) B 2) C 3) E 4) G 5) Cannot be determined

9. Who lives immediately above D's floor?

1) A 2) B 3) C 4) F 5) G

10. Four of the following five are alike in a certain way and so form a group. Which is the one that does not belong to that group?

1) F 2) D 3) B 4) G 5) C

Directions (11 - 15): Study the following information to answer the given questions:

In a Group of 5, each person has an exclusive and different preference (has/ likes) for a pen, a watch and a car. Pen preferences are



Parker, Lamy, Pointer, Lexi and Cello. Car preferences are WagonR, Swift, Santro, Mica and City. Watch preferences are Timex, Titan, Fastrack, Samay and Citizen. Suman has Mica and Parker but does not prefer among watches -Titan or Fastrack. The one who has Swift, likes Fastrack. Mrudula has preference for City, Cello and Citizen. Amit has preference for Lamy and Timex. Veena prefers WagonR and Lexi. Harsh's preference for a watch is not Titan.

11. Which watch is Suman's preference?

1) Titan 2) Fastrack 3) Samay 4) Cannot be determined 5) None of these

12. Which pen is Harsh's preference?

1) Lamy 2) Pointer 3) Lexi 4) Cannot be determined 5) None of these

13. Which watch is Harsh's preference?

1) Samay 2) Fastrack 3) Timex 4) Cannot be determined 5) None of these

14. Who's preference is Swift?

1) Harsh 2) Amit 3) Veena 4) Cannot be determined 5) None of these

15. Which watch is Veena's preference?

1) Samay 2) Fastrack 3) Titan 4) Cannot be determined 5) None of these

Directions (16 - 18): In each question below is given a statement followed by two assumptions numbered I and II. An assumption is something supposed or taken for granted. You have to consider the statement and the following assumptions and decide which of the assumptions is implicit in the statement. Give answer

1) If only assumption I is implicit.
2) If only assumption II is implicit.
3) If either assumption I or II is implicit.
4) If neither assumption I nor II is implicit.
5) If both assumptions I and II are implicit.

16. Statement: Please send an official letter rather than semiofficial on this subject this time.

Assumptions:

I. The format and emphasis of different types of letters is different.

II. We can send different types of letters on the same subject.

17. Statement: Please check the availability of 2 tickets from Delhi to Lucknow.

Assumptions:

I. Person checking knows the desired mode of travel.

II. Person checking knows the details of the person travelling.

18. Statement: If you want to increase your writing speed, use 0.7 pen.

Assumptions:

I. There are different types of pens available.

II. The person being told understands what is 0.7 pen.

Directions (19 - 20): Each of the questions below consists of a question and two statements numbered I and II given below it. You have to decide whether the data provided in the statements are sufficient to answer the question. Read both the statements and Give answer

1) If the data in statement I alone is sufficient to answer the question, while the data in statement II alone is not sufficient to answer the question.
2) If the data in statement II alone is sufficient to answer the question, while the data in statement I alone is not sufficient to answer the question.
3) If the data either in statement I alone or in statement II alone is sufficient to answer the question.
4) If the data in both the statements I and II together are not sufficient to answer the question.
5) If the data in both the statements I and II together are necessary to answer the question.

19. On which day was Yasir born? (His date of birth is February 29)

I. He was born between year 2005 and 2011.

II. He will complete 4 years on February 29, 2012.

20. Out of 64 students, 38 play both chess and cricket. How many students play only chess?

I. Out of 64 students, 22 students don't play any game. 4 students play only cricket.

II. Out of 64 students, 20 are girls and 10 of them don't play any game.

Directions (21 - 25): Study the following information carefully and answer the questions given below:

Nine persons – P, Q, R, S, T, U, V, W and X - are seated in a straight line facing north but not necessarily in the same order. T sits fourth to the left of W. Neither T nor W sits at the extreme ends of the line. Only one person sits between X and R. Neither X nor R is an immediate neighbour of W. P sits second to the right of X. Only two persons sit between P and S. Q is not an immediate neighbour of S or P. V is not an immediate neighbour of X.

21. What is the position of V with respect to Q?

1) Fifth to the right
2) Immediate neighbour
3) Second to the right
4) Third to the right
5) Other than those given as options

22. Which of the following represents persons seated at two extreme ends of the line?

1) S, R 2) Q, S 3) R, P 4) X, Q 5) V, X

23. How many persons are seated between R and P?

1) One 2) Two 3) Three 4) Four 5) None

24. If T is related to V and Q is related to P in a certain way, to which of the following would X be related to following the same pattern?

1) Q 2) T 3) R 4) S 5) W

25. Who amongst the following sits exactly in the middle of the persons who sits seventh from the left and the person who sits sixth from the right?

1) P 2) Q 3) T 4) S 5) V

Directions (26 - 30): Study the following information carefully and answer the questions given below :

Seven persons namely, M, N, O, P, Q, R and S attended seminars in seven different cities viz, London, Paris, Bangkok, New York, Madrid, Tokyo and Seoul on seven different days of the same week starting from Monday to Sunday, but not necessarily in the same order. S attended Seminar on Wednesday. Only one person attended Seminar between S and the person who attended Seminar in Seoul. Only three persons attended Seminars between R and the person who attended Seminar in Seoul. Only one person attended Seminar between Q and the person who attended Seminar in Seoul. O attended Seminar immediately before P. Only two persons attended Seminars between P and the person who attended Seminar in Bangkok. M did not attend Seminar on Saturday. M attended Seminar immediately before the person who attended Seminar in Tokyo. N attended Seminar immediately before the person who attended Seminar in London. O did not attend Seminar in New York. N attended Seminar in Madrid but not on Monday.

26. Four of the following five are alike in a certain way as per the given arrangement and hence form a group. Which is the one that does not belong to that group?

1) O – Wednesday 2) N – Friday 3) M - Thursday 4) Q – Saturday 5) S - Tuesday

27. Which of the following represents the day on which N attended a Seminar?

1) Saturday 2) Sunday 3) Thursday 4) Tuesday 5) Other than those given as options

28. Who amongst the following attended Seminar in Seoul?

1) M 2) O 3) Either M or P 4) P 5) Cannot be determined

29. Which of the following combinations of Day-Person-City is definitely true?

1) Monday – Q – Bangkok
2) Friday – M – London
3) Saturday – R – Tokyo
4) Tuesday – N – Madrid
5) Thursday – O – Paris

30. Which of the following statements is true as per the given arrangement?

1) The one who attended Seminar in New York attended on Tuesday.
2) N attended Seminar on Saturday immediately after P.
3) M attended Seminar exactly between S and O
4) P attended Seminar on Tuesday in Paris
5) None of the given statements is true

Key

1-3	7-1	13-2	19-3	25-1
2-3	8-4	14-1	20-1	26-3
3-1	9-3	15-3	21-5	27-1
4-3	10-5	16-5	22-2	28-4
5-2	11-3	17-1	23-3	29-5
6-4	12-2	18-5	24-4	30-2.

(మిగతా ప్రశ్నలు రేపటి పేజీల్లో)

Mail your feedback to..
pratibhadesk@eenadu.net

హాయ్! బుజ్జీ!!

కృష్ణా ముకుందా మురారా!

చిన్ని కన్నయ్య పుట్టిన రోజు కృష్ణాష్టమి. ఈ పండగ వచ్చిందంటే మన దేశమంతా సందడే సందడి. వీధి వీధినా ఉట్లు కొడుతూ, గోపాలుణ్ని భక్తిగా ఆరాధిస్తూ అన్ని చోట్లా వేడుకలే. ఈ సందర్భంగా కృష్ణుడికి సంబంధించిన కొన్ని విశేషాలు తెలుసుకుందామా!





ఎత్తైన గుడి!

- ప్రపంచంలోనే ఎత్తైన కృష్ణుడి గుడిగా 'బృందావన చంద్రోదయ మందిర్' రికార్డులకెక్కింది.
- దీని ఎత్తు 700 అడుగులు అంటే దాదాపు 70 అంతస్తుల భవనమంత ఎత్తు.
- ఇదున్నది ఉత్తర్‌ప్రదేశ్ లోని బృందావన్‌లో.
- 2014లో ప్రారంభమైన దీని నిర్మాణం మరికొంత కాలంలోనే పూర్తికానుంది.
- పండగ సందర్భంగా ఇక్కడి రాధాకృష్ణుల విగ్రహ మూర్తులకు భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారు.



శ్రీకృష్ణునికీ ఉందో మ్యూజియం

- ఈ మ్యూజియం పేరు 'శ్రీకృష్ణ సంగ్రహాలయ్.'
- హరియాణాలోని కురుక్షేత్రలో ఉంది.
- రకరకాల కృష్ణుడి ప్రతిమల్ని ఇక్కడ చూడొచ్చు. కళాకారులు వేసిన కళాఖండాలు ఓవైపు కనువిందు చేస్తాయి. శిలలతో చెక్కిన శిల్పాలొకవైపు; మట్టి, కంచుతో తయారుచేసిన రకరకాల విగ్రహాలు మరోవైపు దర్శనమిస్తాయి.
- అర్జునుడికి కృష్ణుడు భగవద్గీతను బోధించడం, అంపశయ్యపై ఉన్న భీష్ముడు... లాంటి మహాభారతంలోని సన్నివేశాలు ఇక్కడ నిలువెత్తు బొమ్మల రూపంలో కనువిందుచేస్తాయి.

మీకు తెలుసా?

- ఈ పండగను మనతోపాటు నేపాల్, బంగ్లాదేశ్, ఫిజి, పాకిస్థాన్... దేశాల్లోనూ చేసుకుంటారు.

చేత వెన్నముద్ద!

- చిన్ని కృష్ణుడి వెన్న ముద్ద తమిళనాడు లోని మహాబలిపురంలో ఉంది.
- వాస్తవానికి ఇది ఓ పెద్ద రాయి. దీని పేరే 'కృష్ణుని వెన్న ముద్ద'.
- కన్నయ్య ఓసారి అమ్మ మజ్జిగ కుండ లోని వెన్నముద్దను దొంగిలించి తెచ్చాడని, అదే ఇక్కడ రాయి రూపంలో మారిందని చెబుతారు.



- దాదాపు ఆరు మీటర్ల ఎత్తు, ఐదు మీటర్ల వెడల్పు ఉన్న ఇది 250 టన్నులకు పైగా బరువుంటుందట.
- పూర్తిగా ఏటవాలు ప్రదేశంలో కొంచెం మాత్రమే భూమిపై ఆనుకుని ఉంటుందిది. చూస్తే అమ్మో కిందికి దొర్లి పడిపోతుందేమోనని భయమేస్తుంది. అలా ఎప్పుడైనా జారిపోతుందేమోనని దీన్ని ఇక్కడి నుంచి కదల్చడానికి చాలా ప్రయత్నించారు. 1908లో ఒకసారి ఏడు ఏనుగులతో దీన్ని పక్కకి లాగించారు. అంతకంటే ముందు పల్లవ రాజైన నరసింహ వర్మన్ సైతం దీన్ని జరిపించేందుకు ప్రయత్నించారు. అయితే 1200 ఏళ్లుగా ఇది ఒక్క అంగుళమైనా కదలకుండా అలానే ఉంది.



ఐదు తేడాలు కనుక్కోండి





కలలుకంటూ కూర్చుంటే
పని అణువంతైనా ముందుకు
సాగదు, కష్టపడితేనే
పూర్తవుతుంది
- *భగవద్గీత*

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- flute = వేణువు
- నవనీతం = తాజావెన్న

నవ్వుల జల్లులు!

మొదటివ్యక్తి: నాలుగో నెంబరు ప్లాట్‌ఫారానికి ఎలా వెళ్లాలండీ?
రెండో వ్యక్తి: ప్లాట్‌ఫారం టిక్కెట్టు కొనుక్కుని!
- దండెం రాజయ్య, *డోర్నకల్*

టీచర్: గోపీ అదేంటి? సగం పుస్తకం చింపేశావు?
గోపి: మీరే కదా టీచర్ పొద్దుపుగా ఉండాలన్నారు. అందుకే మరో సగం ఇంట్లో దాచా.
- ఎం. లింగమూర్తి, *నల్లగొండ*

చిలిపి ప్రశ్న

వేగంగా పరిగెత్తే నది?
- రెడ్డి రామలక్ష్మి, *కాకినాడ*

చెప్పగలరా?

మాటలో ఉన్నా కానీ ఆటలో లేను,
ధరంలో ఉన్నా కానీ వరంలో లేను,
ఆవులో ఉన్నా కానీ ఆకులో లేను,
పాడులో ఉన్నా కానీ పాములో లేను.
ఇంతకీ నేనెవరో చెప్పగలరా?

కిట్టయ్యవే అన్నీ!

ఇక్కడున్న సినిమా పేర్లు పట్టికలో ఉన్నాయి. కనుక్కోండి.

శ్రీకృష్ణ పాండవీయం, శ్రీకృష్ణ విజయం, శ్రీకృష్ణ సత్య, శ్రీకృష్ణమాయ, శ్రీకృష్ణతులాభారం, కృష్ణ లీలలు. ముకుంద, మురారి, గోపాల గోపాల, కన్నయ్యకిట్టయ్య, శ్రీకృష్ణార్జునయుద్ధము

గో	శ్రీ	కృ	ష్ణ	స	త్య	శ్రీ	ము
పా	కృ	ష్ణ	కు	క	ణి	రా	ద్ధ
ల	ష్ణ	లీ	య	న్న	రి	శ్రీ	యు
గో	తు	ల	మా	య్య	ము	కృ	న
పా	లా	లు	ష్ణ	కి	కుం	ష్ణ	ర్జు
ల	భా	రా	కృ	ట్ట	ద	వి	ష్ణా
రు	రం	ధ	శ్రీ	య్య	స	జ	కృ
శ్రీ	కృ	ష్ణ	పాం	డ	వీ	యం	శ్రీ

కృష్ణయ్య నామాలు

ఇక్కడి పదాలు పట్టికలో ఉన్నాయి. కనుక్కోండి

L	H	R	S	H	I	K	E	S	H	A
Y	M	A	F	X	Y	T	Q	Y	Q	P
Z	U	L	C	T	R	V	K	A	H	A
F	R	Z	L	Y	G	N	D	M	R	R
P	L	M	U	K	U	N	D	A	D	M
T	I	G	N	L	I	T	D	L	B	A
Z	D	G	F	V	M	O	A	V	L	D
X	H	L	O	C	M	R	Z	R	D	H
K	A	G	G	A	Y	K	R	L	G	A
L	R	Q	D	C	N	R	M	D	G	V
M	A	D	H	U	S	U	D	A	N	A

GOVINDA, MUKUNDA, HRSHIKESHA, MADHAVA, MURLIDHARA, ACYUTA, DAMODARA, MADHUSUDAN

జవాబులు: **చిలిపిప్రశ్న:** గంగా! **చెప్పగలరా:** మాధవుడు
ఐదు తేడాలు కనుక్కోండి: మురళి, నెమలీక, వెన్న, కుండ, కడియం



డీఎస్పీ నాగరాజును పరామర్శిస్తున్న మంత్రి హరీశ్‌రావు, ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

డీఎస్పీకి మంత్రి పరామర్శ

మెదక్ కలెక్టరేట్: గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మెదక్ డీఎస్పీ నాగరాజును మంత్రి హరీశ్‌రావు, మెదక్ ఎంపీ ప్రభాకర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఐకాస ఛైర్మన్ కోదండరాంను తూప్రాన్‌లో అరెస్ట్ చేసే క్రమంలో డీఎస్పీ గాయపడిన సంగతి విదితమే. హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడిని మంత్రి, ఎంపీ పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని మంత్రి ఆసుపత్రి వైద్యులకు సూచించారు.

ఎన్డీఎస్ఎల్‌ను ప్రభుత్వపరం చేయాలి

మెదక్ కలెక్టరేట్: మెదక్ మండలం మంబోజిపల్లిలోని నిజాం చక్కెర కర్మాగారాన్ని (ఎన్డీఎస్ఎల్) ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని పీసీసీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. అధికారంలోకి వస్తే ఎన్డీఎస్ఎల్‌ను ప్రభుత్వపరం చేస్తామని మెదక్‌లో జరిగిన ఎన్నికల సభలో ముఖ్యమంత్రి కేసీఆర్, ఉపసభాపతి, స్థానిక ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఈ విషయమై దివంగత ముఖ్యమంత్రి వైఎస్ హయాంలో ఏర్పాటు చేసిన కమిటీలో తనతో పాటు పద్మాదేవేందర్‌రెడ్డి సభ్యురాలిగా ఉన్నారని, కర్మాగారాన్ని ప్రభుత్వపరం చేయాలని అప్పట్లో నివేదిక అందజేశామన్నారు. ఈ ప్రాంతంలో ఎలాంటి ప్రాజెక్టులు లేవని, రైతులు చెరకు సాగుపై ఆధారపడి జీవిస్తున్న క్రమంలో ఫ్యాక్టరీని మూసివేయడంతో ఉపాధి కరవైందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే అక్టోబరులో సీజన్ ప్రారంభం కానుందని తెలిపారు. ఇప్పటికైనా ఈ విషయంలో ఉపసభాపతి చొరవ చూపాలని కోరారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: స్పెషల్ ఆరాధన శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా ద్వారకలోని శ్రీకృష్ణ ఆలయ విశేషాలు, బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ ప్రత్యేక ప్రవచనం 'శ్రీకృష్ణ శరణంమమ', 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: స్పెషల్ శుభమస్తు: అనుకున్నపనులు జయప్రదం కావాలంటే శ్రీకృష్ణుడిని ఎలా పూజించాలి...? బ్రహ్మశ్రీ చాగంటి విశేష ప్రవచనం? 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: ఆడుతూ పాడుతూ... (శ్రీకాంత్, గాయత్రి).

మధ్యాహ్నం

12-00: స్పెషల్ అభి'రుచి': ఘుమఘుమలు 'గసగసాలరైస్', మీచేతివంట 'మూంగ్‌దాల్ కోఫ్తాకర్రీ', 'కొబ్బరి పెసరపొంగలి', జస్ట్ ఎమినిట్ 'పల్లీపోహ' తయారు చేసే విధానం. ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00:వసంతం(డైలీ సీరియల్), 04-30: ఢీ 10 (సుప్రీండాన్స్‌షో) (రిపీట్), 06-00: శ్రీభాగవతం (భక్తిరసాత్మక దృశ్యకావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతి చినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఆలీతో సరదాగా: హీరోయిన్ రకుల్‌ప్రీత్‌సింగ్‌తో.., 10-30: సినీవారం: (స్పెషల్ ప్రోగ్రాం).

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం 12:00జబర్దస్త్ రిమిక్స్
01:00 మైకేల్ మదన్ కామరాజు రిపీట్
01:15 ది బ్రేకప్ కన్సల్టెంట్ రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యో రామ రిపీట్
03:30 హంగామా రిపీట్
సాయంత్రం
04:30 నా షో నా ఇష్టం
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 ఈ-జంక్షన్
09:00 పటాస్
09:30 అల్లరే అల్లరి
10:00 సరదాగా కాసేపు
10:30 తారక్ మామా అయ్యో రామ రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

★ మానస (ఉ.6:00, సా. 6.00, రా. 11.00)
★ డా.ఈటీవీ – (ఉ.6:30, 11:00, మ. 3:30, సా. 7:30)
★ యోగమంత్ర (ఉ.7:00, సా.5:30, రా. 11:30)
★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ.7:30, సా.5:00, రా. 10:30)
★ అమృతం (ఉ.8:00, మ. 12:30, రా. 8:00)
★ హెల్దీ & టేస్టీ – (ఉ.8:30, మ. 01:00, రా. 8:30)
★ ఆరోగ్యమస్తు (ఉ.9:00, మ. 03:00, సా. 4:00, రా. 9:00)
★ ఆయుష్ (ఉ. 9:30)
★ లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ (ఉ. 10:00)
★ అందరికి ఆరోగ్యం (ఉ.10:30)
★ విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)
★ హెల్దీ డయాబెటిక్ - (మ. 1:30)
★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్ (మ. 2:00, రా. 7:00)
★ బాడీ మైండ్ & సోల్– అంతరంగం (మ. 2:30, రా. 9:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: ముద్దమందారం (ప్రదీప్, పూర్ణిమ), 10-00: మార్నింగ్ షో: గోవుల గోపన్న (ఏఎన్నార్), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: శ్రీవారికి ప్రేమలేఖ (నరేశ్, పూర్ణిమ), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: అనుబంధం (ఏఎన్నార్, సుజాత), రాత్రి: 7-00: ఫస్ట్‌షో: శ్రీకృష్ణావతారం (ఎన్టీఆర్), 10-00: సెకండ్‌షో: అమాయకుడు కాదు అసాధ్యుడు (కృష్ణ).

ఈటీవీ అభిరుచి

కృష్ణాష్టమి స్పెషల్

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - కోవా ఉండల పాయసం & చుక్కకూర పెరుగు వడలు, ఉ.6.30: టేస్ట్ ఆఫ్ ఇండియా - తిల్ గుల్ వాడి & మటర్ కారాంజీ, ఉ.7.00: వావ్ ఏమి రుచి – టమోట సాస్ & ఇటాలియన్ పాస్తా, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – అంజీర్ కొబ్బరి బర్ఫీ & పప్పు చెక్కలు, ఉ.9.30: మమ్మీస్ కిచెన్ – రాగి లడ్డులు, ఉ.9.45: ప్రముఖ గేయ రచయిత రఘు కుంచె తో "చట్‌పట్" – జామకాయ పచ్చడి, ఉ.11.00, రా.10.45: గోరు ముద్దలు – బ్రౌన్ రైస్ కిరాన్, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ – రాగి కుడుములు, ఉ.11.30, రా.8:00: బాబాయ్ హోటల్ - వెన్న ఉండలు & శ్రీ ఖండ్, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా - అంజీర్ ఆల్మండ్ కి కట్లీ, మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – అటుకుల ప్రసాదం విత్ జబర్దస్త్ ఆర్టిస్ట్ నిహాంత్, మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్ - ధనియ బర్ఫీ, మ.12.45: సూప్స్ & స్టార్టర్స్ - అరికెల పాయసం, మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి (స్కివర్స్ స్పెషల్) – చికెన్ పెప్పర్ స్కివర్స్ & ఫ్లావర్డ్ యోగర్ట్ అసోర్టెడ్ వెజిటబుల్స్, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) ఓట్స్ పాయసం, మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ – ట్రెస్ లిచి, మ.2.15, రా.10.30: చెఫ్స్ స్పెషల్ – మెంతి పులిహోర, మ.2.30: చోటా షెఫ్ – స్వీట్ పోహా, మ.3.15: ఈవారం – మిక్స్డ్ రవ్వ కిచిడి, సా.5.15: స్నాక్స్ – చిట్టి ఆవడలు.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ కృష్ణాలయం, ఉడిపి, కర్ణాటక, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ కృష్ణాలయం, ఉడిపి, కర్ణాటక, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 14-08-2017

SVBC TTD – **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం - నిత్య పూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామ స్తోత్రం, 07-30 శ్రీవారిసేవలు (తోమాలసేవ), 08-00 శతమానం భవతి, 08-30 పూజకు వేళాయే - శివుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 గోపాలుడే గోవిందుడు, 03-30 విష్ణుపురాణం, **సాయంత్రం:** 04-30 శ్రీమహాలక్ష్మి వైశిష్ట్యం - మైలవరపు శ్రీనివాసరావు, 05-00 లైవ్ ఎస్.డి. సేవ - తిరుమల + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + శివపంచాక్షరి + లింగాష్టకం, 08-00 భక్తిచైతన్యం, 08-30 మహాలక్ష్మి వైభవం - చాగంటి, 09-00 శ్రీకృష్ణ ఆలయ వైభవం, 09-30 శ్రీ కృష్ణతత్వం - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 శ్రీకృష్ణ జయంతి - వద్దిపర్తి.

భక్తి TV – **ఉదయం:** 06-00 శ్రీశివసహస్రం, 06-30 నమకంచమకం, 07-00 అర్చన, 07-30 శ్రావణసోమవార వైభవం (లైవ్), 08-00 పుణ్యక్షేత్రం, 08-30 లక్ష్మీవైభవం, 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శివస్తోత్రం, 05-30 శ్రీశివసహస్రం, 06-00 నమకంచమకం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 అమృతకలశం, 08-00 భజరే నందబాలం, 08-30 హరే రామ.. హరే కృష్ణ, 09-00 శ్రీకృష్ణతత్వం, 09-30 ద్వారక వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

Zee తెలుగు – **ఉదయం:** 07-30 ఓంకారం, 08-00 సినిమా: తడాఖా, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్‌రష్, 01-00 బతుకు జట్కాబండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమభాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: బాబు బంగారం.

Star maa – **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు, 08-30 ఫన్‌టైమ్, 09-00 సినిమా: చూడాలని ఉంది, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 సంసారం ఒక చదరంగం, 02-00 కుంకుమపువ్వు, 02-30 బిగ్‌బాస్ రిపీట్, **సాయంత్రం:** 04-00 బిగ్‌బాస్ రిపీట్, 05-30 ఓకె జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్‌బాస్, 10-30 బిగ్‌బాస్ రిపీట్.

GEMINI – **ఉదయం:** 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: మేజర్ చంద్రకాంత్, **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావు (రిపీట్) 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: శౌర్యం, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని 2, 08-00 నువ్వునాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు. 10-00 సినిమా: పటాస్.

HBO SIMPLY THE BEST. – **ఉదయం:** 06-00 ఎనీగివెన్ సన్‌డే, 08-22 ఎంపైర్ ఆఫ్ ది సన్, 11-04 10000 బీసీ, 12-59 విస్కీ ట్యాంగో ఫాక్స్‌ట్రాట్, **మధ్యాహ్నం:** 12-14 గెట్ స్మార్ట్, 02-47 కుంగ్ ఫూ పాండా, **సాయంత్రం:** 04-21 13 అవర్స్, **రాత్రి:** 09-00 మిషన్ ఇంపాజిబుల్ రోగ్ నేషన్, 11-22 షావొలిన్ సాకర్.

పత్తిని ప్రస్తుతం ఆశిస్తున్న తెగుళ్లు - నివారణ చర్యలు

ప్రస్తుతం పత్తిని ఆశిస్తున్న తెగుళ్లను గుర్తించి, నివారణకు చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు పొందే అవకాశం ఉందని వైరా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ జే. హేమంత్ కుమార్, డాక్టర్ ఎన్.కిశోర్‌కుమార్ తెలిపారు.

వేరుకుళ్లు తెగులు: భూమిలో తేమ అధికంగా ఉన్నప్పుడు, వర్షం బాగా పడి ముంపునకు గురైనప్పుడు ఈ తెగులు వ్యాప్తి చెంది, లేతాకులు పసుపు రంగుకు మారి ఎండిపోతాయి. ఈ తెగులు పంట అన్ని దశల్లో ఆశిస్తుంది. అర్ధంతరంగా మొక్క పూర్తిగా ఎండిపోవటం దీని లక్షణం. ఒక్క రోజులోనే మొక్క ఎండిపోతుంది. తెగులు తీవ్రమైనప్పుడు వ్యాధి సోకిన మొక్కలు పొలంలో గుంపులుగా ఎండిపోతాయి. దీని నివారణకు, ముందు జాగ్రత్త చర్యగా.. వేసవి కాలంలో పొలాన్ని లోతుగా దున్నాలి. పొలంలో సేంద్రియ పదార్థాన్ని, పశువుల ఎరువును ఎక్కువగా వాడాలి. సిఫారసు మేరకు పొటాష్ ఎరువులను తప్పక వాడాలి. కిలో విత్తనానికి 2 గ్రా. కార్బండజిమ్ లేదా 10 గ్రా. ట్రైకోడెర్మావిరిడితో విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లేదా కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపిన ద్రావణాన్ని తెగులు సోకిన మొక్కల మొదళ్ల చుట్టూ నేలపై పోయాలి. అంతర పంటల సాగుతో కూడా తెగులు తీవ్రతను తగ్గించవచ్చు. పత్తి విత్తే సమయాన్ని మార్చి కూడా తెగుళ్ల బారి నుంచి పంటలను కాపాడుకోవచ్చు.

ఎండు తెగులు: పత్తిని ఆశించే ఎండు తెగులుకు ఫ్యుజేరియం, వర్టిసీలియం వంటి శిలీంధ్రాలు ప్రధాన కారణం. పంటను ఫ్యుజేరియం వడలు తెగులు ఆశించినప్పుడు తెగులు సోకిన మొక్కల ఆకులు వాడిపోయి మొదట ఈనెల మధ్య పసుపు రంగుకు తర్వాత ఎర్రగా మారి ఆకుల కింది నుంచి పైకి ఎండుకుంటూ రాలిపోతాయి. ఈ తెగులు పుష్పించే దశలో ఎక్కువగా కన్పిస్తుంది. కాండాన్ని చీల్చి చూస్తే లోపల నల్లని బూజుతో చారలు కన్పిస్తాయి.

ఆకుమచ్చ తెగులు: పత్తి పంటను ఆశించే తెగుళ్లలో ఆకుమచ్చ తెగులు ప్రధానమైనది.



పత్తి ఆకుపై బ్యాక్టీరియా తెగులు మచ్చలు

ఆల్టర్‌నేరియా, సెర్కోస్పోరా, హెల్మింథోస్పోరియం, శిలీంధ్రజాతులు, జాంతోమోనాస్ ఆకుముడత బ్యాక్టీరియా నల్లమచ్చ తెగులు, బ్యాక్టీరియా ఆకుమాడు తెగులు ప్రధానమైనవి.

ఆల్టర్‌నేరియా ఆకుమచ్చ తెగులు: ఆశించిన మొక్కల ఆకుల మీద గోధుమరంగు మచ్చలు వలయాకారపు సుడులుగా ఏర్పడతాయి. తెగులు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు తర్వాత దశలో కాయల మీద కూడా మచ్చలు ఏర్పడతాయి.

సెర్కోస్పోరా ఆకుమచ్చ తెగులు: ఆకుల మీద ముదురు గోధుమ రంగులో గుండ్రని మచ్చలు ఏర్పడి చుట్టూ ఎరుపు రంగు కలిగి మధ్యభాగం తెల్లగా ఉంటుంది. ఈ తెగులు ఎక్కువగా ముదురు ఆకుల మీద పంట చివరి దశలో కన్పిస్తుంది.

హెల్మింథో స్పోరియం ఆకుమచ్చ తెగులు: ఈ తెగులు సోకిన ఆకుల మీద తేలికపాటి గోధుమరంగు గుండ్రని మచ్చలు ఏర్పడి, మధ్య భాగం బూడిద రంగుతో, చుట్టూ ఎర్రటి అంచులు ఏర్పడతాయి. తెగులు తీవ్రమైనప్పుడు వ్యాధి సోకిన ఆకుల మధ్యలో ఆకారం లేనటువంటి తూటాల వంటి రంధ్రాలతో రాలిపోతాయి.

ఆకుమచ్చ తెగుళ్ల అదుపు: తెగులు ఆశించిన భాగాలను పీకి నాశనం చేయాలి. లీటరు నీటికి ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా కాప్టాన్ + హెక్సాకొనజోల్ 1 గ్రా. 2-3 సార్లు 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. పొలాన్ని ఎప్పటికప్పుడు కలుపు మొక్కలు లేకుండా శుభ్రంగా ఉంచాలి. తప్పనిసరిగా నత్రజని పొటాష్ ఎరువులను సిఫారసు మేరకు అందించాలి.

బ్యాక్టీరియా నల్లమచ్చ తెగులు: మొక్క వివిధ దశల్లో వివిధ రూపాల్లో కన్పిస్తుంది. ఆకులపై కోణీయాకారంలో నూనె రంగు మచ్చలు ఏర్పడి తర్వాత నల్లగా మారి మూడో దశలో ఆకుల ఆనెల ద్వారా తెగులు వ్యాపించి నల్లగా మారుతుంది. తెగులు ఉధృతంగా ఉన్నప్పుడు కొమ్మలకు కూడా వ్యాపించి కొమ్మలు నల్లగా మారతాయి. దీనినే బ్లాక్ ఆర్మ్ అని పిలుస్తారు. తెగులు ఉధృతి ఎక్కువైతే ఆకు పండి రాలిపోతుంది. తెగులు పువ్వులకు, కాయలకు సోకినప్పుడు పరిపక్వత చెందకుండానే రాలిపోతాయి.

ఈ తెగులు నివారణకు.. తెగులు సోకిన మొక్కలను, పీకి నాశనం చేయాలి. పొలంలో కలుపు మొక్కలు లేకుండా చూడాలి. కిలో విత్తనానికి 10 గ్రా. సుడోమోనాస్ ఫ్లోరెసెన్స్‌తో విత్తనశుద్ధి చేయాలి. ఉధృతిని బట్టి 3-4 సార్లు 15 రోజుల వ్యవధిలో 10 లీ. నీటికి స్ట్రెప్టోసైక్లిన్ లేదా పోషామైసిన్ 1 గ్రా., + కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రా. కలిపి పిచికారీ చేయాలి.

–న్యూస్‌టుడే, ఖమ్మం (వ్యవసాయం)






పర్యాటక లోకం.. త్రివర్ణ శోభితం



- రామోజీ ఫిల్మ్‌సిటీలో ఫ్రీడం ఫెస్ట్ వేడుకలు
- 15వ తేదీ వరకు ప్రత్యేక సంబరాలు




అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: వినోదం.. విహారానికి తోడు ప్రత్యేక కార్యక్రమాల సందడితో రామోజీ ఫిల్మ్‌సిటీలో ఫ్రీడం ఫెస్ట్ వేడుకలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ నెల 11న వేడుకలు ప్రారంభమవగా నిత్యం ఆబాలగోపాలం సంబరాల్లో మునిగితేలుతున్నారు. స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటే ప్రత్యేక కార్యక్రమాలలో పర్యాటకులు పాలుపంచుకొంటూ ఆనంద తీరాలను చవిచూస్తున్నారు. ప్రకృత రమణీయ అందాలను వీక్షిస్తూ ప్రత్యేక వినోద కార్యక్రమాలను సందర్శకులు ఆస్వాదిస్తున్నారు.



మైమరపించేలా.. స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటేలా కళాకారుల ప్రదర్శనలు.. సంభ్రమాశ్చర్యాలకు గురిచేసే వినోద కార్యక్రమాలు.. బాహుబలి ఫేం గాయకుల గానామృతం.., ఢీ జోడి నృత్యాలు, దూల్ బీట్స్, థిమాటిక్ పాటలు, నృత్యాలతో రామోజీ ఫిల్మ్‌సిటీలో స్వేచ్ఛా వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. దేశం నలుమూలల నుంచి పర్యాటకులు తరలివచ్చి ఈ వేడుకల్లో పాలుపంచుకుంటూ మరిచి పోలేని మధురానుభూతిని సొంతం చేసుకుంటున్నారు. ఇంకెందుకు ఆలస్యం మీరు సైతం ఈ ఫ్రీడం ఫెస్ట్ సంబరాలలో భాగస్వాములై ఆనందోత్సాహాలను ఆస్వాదించేందుకు తరలిరండి మరి..

సందర్శనకు ఎన్నెన్నో అవకాశాలు... రామోజీ ఫిల్మ్‌సిటీ ఫ్రీడం ఫెస్ట్ సంబరాలలో పర్యాటకులు పాలుపంచుకొని ఆనందించేందుకు వీలుగా పలు ప్రత్యేక ప్యాకేజీల్లో ఫిల్మ్‌సిటీకి ఆహ్వానిస్తున్నారు. ఫ్రీడం ఫెస్ట్ రామోజీ స్టార్ ఎక్స్‌పీరియన్స్ ప్యాకేజీ, ఫ్రీడం ఫెస్ట్ డే టూర్ ప్యాకేజీలతో పాటు ఫిల్మ్‌సిటీలోనే ఉంటూ వేడుకల సందడిని ఆద్యంతం ఆనందించేందుకు పలు ప్రత్యేక ప్యాకేజీలు పర్యాటకుల కోసం అందుబాటులో ఉంచారు. లగ్జరీ హోటల్ సితార, కంఫర్ట్ హోటల్ తార, ఎకానమిలో శాంతినికేతన్‌లలో బస చేసేందుకు అవకాశం కల్పిస్తున్నారు. వెంటనే సకుటుంబ సమేతంగా వేడుకలకు తరలివచ్చి ఆనందలోకాల్లో విహరించండి.





రుస్తుం గీసిన చిత్రం

జన్మాష్టమి చిత్రం ఆవిష్కరణ

కృష్ణాష్టమిని పురస్కరించుకొని చిత్రకారుడు రుస్తుం 'జన్మాష్టమి' చిత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. పట్టణంలోని తన ఆర్ట్ గ్యాలరీలో క్యాన్వాస్‌పై చిత్రాన్ని గీశారు. ఈ సందర్భంగా చిత్రకారుడు మాట్లాడుతూ.. భగవద్గీతను ప్రపంచానికి అందించిన శ్రీకృష్ణుడి జన్మదినమే కృష్ణాష్టమి అని పేర్కొన్నారు. అందరి జీవితాల్లో ఆనందాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్

నెమలిఈకలో నల్లనయ్య

కృష్ణాష్టమి సందర్భంగా కొల్చారం ఉన్నత పాఠశాల కళావిద్య బోధకుడు శ్రీనివాస్ వేసిన చిన్నికృష్ణుడి చిత్రం.

– న్యూస్‌టుడే, మెదక్



'అరెస్టు అప్రజాస్వామికం'

సిద్దిపేట అర్బన్: ఐకాస ఛైర్మన్ ఆచార్య కోదండరాం శాంతియుతంగా అమరుల స్ఫూర్తి యాత్ర చేపడితే తెరాస ప్రభుత్వం అడుగడుగునా అడ్డుకుంటోందని ఐకాస జిల్లా కన్వీనర్ భూపతిరెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ లోపాలను ఎండగడతారనే భయంతోనే రాష్ట్ర ప్రభుత్వం యాత్రకు అడ్డుతగులుతోందని దుయ్యబట్టారు. కామారెడ్డి జిల్లాలో పోలీసుల అనుమతి తీసుకున్నా నాటకీయ పరిణామాల మధ్య కోదండరాంను అరెస్టు చేశారని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు తెలుసుకోడానికే అమరుల స్ఫూర్తి యాత్ర ప్రారంభించారన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని, తెరాస ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చినా, వాటిలో ఒక్కటి కూడా అమలు కావడం లేదని విమర్శించారు. భిక్కనూరులో జరిగిన సంఘటనలో ఐకాస నాయకులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐకాస నాయకులు పాండు, లక్ష్మి, మల్లారెడ్డి, శ్యాంసుందర్, లింగరాజు ఉన్నారు.



పోతారం(ఎస్)లో వాగును తలపిస్తున్న రహదారి

హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో భారీ వర్షం

హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో మొదలైన వర్షం సాయంత్రం వరకు కురిసింది. వర్షంతో రహదారులన్నీ జలమయం అయ్యాయి. మురుగు కాలువలు పొంగి ప్రవహించాయి. వర్షంతో మొక్కజొన్న, పత్తి చేలల్లో వర్షపు నీరు నిలిచింది. నాలుగైదు రోజులుగా తీవ్రమైన ఎండతో వాడిపోతున్న పంటలకు ఈ వర్షం జీవం పోసింది. వర్షంతో పలు గ్రామాల్లో పోచమ్మ బోనాలు చేస్తున్న మహిళలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. భారీ వర్షంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పత్తి చేలో చేరిన వాన నీరు